



ప్రపంచాన్ని మార్చే శక్తివంతమైన ఆయుధం విద్య మాత్రమేనని ఎంతోమంది మేధావులు చెప్పారు. అంతటి శక్తివంతమైన ఆయుధాన్ని ప్రజలకు అందించేవారు, మనిషిని పరిపూర్ణమైన వ్యక్తిగా తీర్చిదిద్దే క్రాంతి ప్రదాతలు ఉపాధ్యాయులు. ఎగిరే గాలిపటం విద్యార్థి అయితే దానికి ఆధారమైన దారం గురువు. శిష్యుడు ఏ తీరానికి చేరాలన్నా ఆ చుక్కాని దిశానిర్దేశం ఉండాల్సిందే!. అందుకే సమాజంలో తల్లి, తండ్రి తర్వాత గురువును దైవంగా భావిస్తారు.. పూజిస్తారు. బోధన వృత్తి నుంచి దేశ సార్వభౌమాధికారి స్థాయికి ఎదిగిన మహామనిషి సర్వేపల్లి రాధాకృష్ణన్. ఆయన జయంతి సందర్భంగా ఏటా సెప్టెంబరు ఐదవ తేదీన ఉపాధ్యాయ దినోత్సవం జరుపుకుంటున్నారు. ఈ వేడుకలకు జిల్లా సిద్ధమైంది.

ఆచార్య దేవోభవ!

- భావిభారత పౌరుల తయారీలో ఉపాధ్యాయుడే కీలకం
- నేడు సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతి
- 60 మంది టీచర్లకు ఉత్తమ అవార్డులు

నెల్లూరు (విద్య), సెప్టెంబరు 4 : విద్యార్థి జీవితాన్ని ప్రభావితం చేసేది ఉపాధ్యాయుడే. ఎక్కువ మంది విద్యార్థులు పాఠశాల స్థాయిలో ఉపాధ్యాయులను నిజమైన గురువులుగా చెప్పుకుంటారు. ఉపాధ్యాయులకు ఆదర్శంగా నిలిచిన వ్యక్తి డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్. విద్యార్థి జీవన గమనాన్ని నిర్దేశించి విలువలు ఎలా ఉండాలో అధ్యాపక లోకానికి చాటిచెప్పిన మహనీయుడు ఆయన. తమిళనాడులోని తిరుత్తణిలో జన్మించిన రాధాకృష్ణన్ విద్యార్థికి ఉపాధ్యాయుడికి మధ్య సంబంధం ఎలా ఉండాలో విడమరిచి చెప్పారు. అధ్యాపకుడిగా, ఉపకులపతిగా, దౌత్యవేత్తగా, ఉపరాష్ట్రపతిగా, రాష్ట్రపతిగా ఆయన సేవలు నిరుపమానం. ఆయన అధిరోహించిన శిఖరాలు ఆయన జీవితంలోని అసాధారణ కోణాలను వెల్లడిచేస్తాయి. ఉపాధ్యాయ వృత్తి నుంచి రాష్ట్రపతి వరకు ఉన్నతి సాధించిన ఆయన్ను స్మరించుకుంటూ ఆయన జయంతి రోజున ఉపాధ్యాయ దినోత్సవంగా జరుపుకోవడం ఆనవాయితీగా మారింది.

60 మందికి గురు సత్కారం

ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా జిల్లాలో ముగ్గురు ప్రధానోపాధ్యాయులు, 24 మంది స్కూల్ అసిస్టెంట్లు, 33 మంది సెకండరీ గ్రేడ్ టీచర్లు మొత్తం 60 మంది ఉపాధ్యాయులు ఉత్తమ పురస్కారాలను అందుకోబోతున్నారు. గురువారం నగరంలోని కలెక్టరేట్‌లో ఉన్న తిక్కన ప్రాంగణంలో ఉదయం 10 గంటలకు సన్మాన కార్యక్రమాలు నిర్వహించేందుకు విద్యాశాఖ-సమగ్రశిక్షలు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశాయి. ఈ కార్యక్రమానికి రాష్ట్ర మంత్రులు పొంగూరు నారాయణ, ఆనం రామనారాయణరెడ్డితోపాటు ఎంపీ, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఇతర ప్రజా ప్రతినిధులు, కలెక్టర్ ఆనంద్, ఎస్పీ జి.కృష్ణకాంత్, జేసీ కార్తీక్, కమిషనర్ ఎం.సూర్యతేజ హాజరవుతారని డీఈఓ రామారావు, ఎస్ఎస్ఏ ఏపీసీ సీహెచ్.ఉషారాణి తెలిపారు.



ప్రభుత్వ విద్యను బలోపేతం చేయాలి

ఉపాధ్యాయ దినోత్సవం నాడు ఉపాధ్యాయుల్లో వెలుగులు నిండేలా పాలకులు నిర్ణయం తీసుకోవాలి. ప్రభుత్వ పాఠశాలల్లో చదివిస్తున్న తల్లిదండ్రులకు భరోసా ఇవ్వడంతోపాటు ప్రోత్సాహకాలూ అందించాలి. విద్యను ప్రైవేటీకరణ నుంచి కాపాడటంతోపాటు ప్రాథమిక విద్యలో మాతృభాషలో బోధన కొనసాగించాలి. గతంలో జరిగిన తప్పులు పునరావృతం కాకుండా ఉపాధ్యాయుల గౌరవం పెరిగేలా నిర్ణయాలు తీసుకోవాలి. హక్కులను కాపాడుతూ వారికి అందించాల్సిన రాయితీలను, సౌలభ్యాలను అందించేందుకు ప్రభుత్వాలు కృషి చేయాలి.

- జీవీ.చలపతిశర్మ, యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి

ప్రయోగాల మాస్టర్ సుధాకర్



విద్యార్థులకు ప్రయోగ మెలకువలు నేర్పుతున్న సుధాకర్

పొదలకూరు : పొదలకూరు బాలుర ఉన్నత పాఠశాలలో భౌతిక రసాయన శాస్త్ర ఉపాధ్యాయుడిగా పని చేస్తున్న ఏవీ సుధాకర్ వైజ్ఞానిక ఆలోచనలతో శాస్త్రీయ వైఖరిని పెంపొం దించుకుని ఎన్నో ప్రశంసలు అందుకున్నారు. రసాయన శాస్త్ర పీజీ పట్టా అందుకుని ప్రముఖ కంపెనీల్లో అవకాశాలు వచ్చినా ఉపాధ్యాయ వృత్తిపై ఉన్న మమకారంతో ఉపాధ్యాయుడిగా కొనసాగుతున్నారు. జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో నిర్వహిస్తున్న ఏకైక సైన్స్ క్లబ్ పొదలకూరు ఉన్నత పాఠశాలలో ఉంది. దాని ద్వారా అనేక వైజ్ఞానిక సామాజిక కార్యక్రమాలు నిర్వహిస్తూ జాతీయస్థాయిలో మూడుసార్లు అవార్డు అందుకున్నారు. గ్రామీణ ప్రాంత విద్యార్థులకు సైతం వైజ్ఞానిక భావాలు అందించాలని ఇటువంటి నిశ్చయంతో తన తల్లిపేరిట నెల్లూరులోని తన ఇంటిపై సుమారు రూ.10లక్షలతో ఏవీఎం కిడ్స్ సైన్స్ కార్నర్‌ను ఏర్పాటు చేశారు. ప్రతి ఆదివారం ఉచితంగా విద్యార్థులకు అవకాశం కల్పిస్తూ వారిలో విజ్ఞాన శాస్త్ర పట్ల భయాన్ని పోగొట్టి భావిశాస్త్రవేత్తలుగా ఎదిగేందుకు అవకాశం కల్పిస్తున్నారు. నాసా బార్క్ ఐఏఎస్ఎఫ్ ఎన్‌టీఎస్‌సీ వంటి ప్రతిష్ఠాత్మక సదస్సులకు హాజరై ప్రశంసలు పొందారు.

బహుముఖ ప్రజ్ఞశాలి ప్రసాద్



ఆత్మకూరు : పట్టుదల.. క్రమశిక్షణ.. అంకితభావం.. కర్తవ్య నిర్వహణలో న్యాయం చేయాలనే సంకల్పం డాక్టర్ ఎం ప్రసాద్ సొంతం. ఆత్మకూరులోని ప్రభుత్వ హైస్కూల్‌లో తెలుగు పండిట్ ఉన్న ఆయన మాతృబాష తోపాటు హిందీ, ఇంగ్లీషు, తమిళం, మళయాళం, కన్నడం, సంస్కృత భాషల్లో ప్రావీణ్యం సంపాదించారు. విద్యా బోధనతోపాటు విద్యార్థులకు అవసరమైన కథలను ఇతర భాషల్లో నుంచి తర్జుమా చేసి బోధిస్తున్నారు. వ్యాసాలు, కవితలు, పాటలతోపాటు విద్యార్థులకు కోలాటం, జానపద నృత్యాలను నేర్పుతుంటారు. 30కిపైగా జాతీయ సదస్సులు, 15 అంతర్జాతీయ సదస్సుల్లో పాల్గొని తాను రచించిన వ్యాసాలను సమర్పించారు. అందుకే ఎన్నో సంస్థలు, బాషాభిమానులు ఆయన్ను సత్కరించారు. ఉద్యోగ బాధ్యతలను సక్రమంగా నిర్వహిస్తున్నందుకు జిల్లాస్థాయిలో ఉత్తమ ఉపాధ్యాయుడిగా ఎంపిక అయ్యారు.



భావిభారత పౌరుల్లో ఉత్సాహం నింపుతూ..

అనంతసాగరం : ఈయన పేరు చల్లా చంద్రశేఖర్‌రెడ్డి చిలకలమర్రి ఉన్నత పాఠశాలలో గణిత ఉపాధ్యాయుడు. చదువుతోపాటు పర్యావరణంపై విద్యార్థులకు ప్రత్యేక తర్ఫీదు ఇవ్వడంతోపాటు సామాజిక అంశాలపై అవగాహన కల్పిస్తున్నారు. స్వాతంత్ర్య సమరయోధుల జీవత చరిత్రలు తెలిసేలా కార్యక్రమాలు నిర్వహిస్తూ భావిభారత పౌరుల్లో ఉత్సాహం నింపుతున్నారు. ఇటీవల జరిగిన జాతీయ అంతరిక్ష క్విజ్ పోటీల్లో ఆయన పాల్గొనగా, ఇస్రో ఛైర్మన్ ఎస్ సోమనాథ్ నుంచి ప్రశంస పత్రం లభించింది.

మనుసున్న మాస్టార్లు వీరు!



పిల్లలకు విద్యాసామగ్రి ఇస్తున్న ఉపాధ్యాయులు బాబు, ఫణిరాజు

ఉదయగిరి రూరల్ : పాఠశాలకు వెళ్లమా.. పాఠాలు బోధించామా.. ఇంటికెళ్లామా అనే ఆలోచనతో ఆ ఉపాధ్యాయులు పని చేయడం లేదు. ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధి, విద్యార్థులకు ఉత్తమ బోధనతోపాటు వసతుల కల్పనే లక్ష్యం విధులు నిర్వహిస్తూ ఆదర్శంగా నిలుస్తున్నారు ఉదయగిరి మండలం జీ.అయ్యవారిపల్లి ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయులు బాబు, ఫణిరాజులు. తమ పాఠశాల ఆవరణలో ఫలాలు, పూలు, ఆయుర్వేద మొక్కలను విద్యార్థులతో నాటించి సంరక్షణ బాధ్యతలు చేపడుతున్నారు. మొక్కల పెంపకం వల్ల కలిగే లాభాలు, పర్యావరణ పరిరక్షణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను పిల్లలకు వివరిస్తున్నారు. అలాగే తమ సొంత నిధులతో ప్రతిఏటా విద్యార్థులకు నోట్‌పుస్తకాలు, ఇతర సామగ్రి అందజేస్తున్నారు. పాఠశాలలో గ్రంథాలయం ఏర్పాటు చేసి, 300 రకాల పుస్తకాలను సమకూర్చారు. ప్రతిరోజు తప్పనిసరిగా యోగా తరగతులు నిర్వహించడమేగాక, నవోదయ ప్రవేశ పరీక్షలకు విద్యార్థులకు శిక్షణ ఇచ్చి ఉచితంగా మెటీరియల్ అందజేస్తారు. విద్యార్థులకు చిత్రలేఖనం పోటీల్లో తర్ఫీదు ఇవ్వడంతోపాటు వ్యాసరచన, వకృత్వ పోటీలు నిర్వహించి విద్యార్థులకు బహుమతులు అందజేస్తూ అందరిచేత మన్ననలు పొందుతున్నారు.







ఆపన్న హస్తం అందిద్దాం!

- బెజవాడ బాధితులను ఆదుకుందాం!
- ఇప్పటికే విరివిగా విరాళాలు
- ధాన్యం, నిత్యావసరాలూ అందజేత
- కలెక్టరేట్‌లో ప్రత్యేక కౌంటర్ ఏర్పాటు

సాయం చేయండి : కలెక్టర్

నెల్లూరు (హరనాథపురం) : వరద బాధితులకు సహాయం చేసి ఆదుకోవాలని కలెక్టర్ ఆనంద్ జిల్లావాసులను కోరారు. వరధ బాధితులకు ఆహార పదార్థాల సేకరణ కోసం కలెక్టరేట్ ప్రాంగణంలోని డీఎస్వో కార్యాలయంలో ప్రత్యేక కౌంటర్ ఏర్పాటు చేయించినట్లు చెప్పారు. బిస్కెట్లు, బ్రెడ్, పాలు, వాటర్ బాటిళ్ల తదితర ఆహార పదార్థాలను స్వచ్ఛందంగా ఈ కౌంటర్‌లో అందజేయాలన్నారు. వీటిని ప్రత్యేక వాహనంలో విజయవాడకు తరలించనున్నట్లు చెప్పా రు. ఆహార పదార్థాలు అందచేసేవారు ఏఎస్ఓ అంకయ్య ఫోన్ నెం. 8500040699లో సంప్రదించాలన్నారు.

- నగదు జమ చేయాలనుకునే వారు సీఎం రిలీఫ్ ఫండ్ ఎస్‌బీఐ ఖాతా నెం.38588079208. ఐఎఫ్ఎస్‌సీ నెం. 0018884, యూనియన్ బ్యాంకు ఖాతా నెం. 110310100029039, ఐఎఫ్ఎస్‌సీ నెం: యూబీఐఎన్ 0830798 ఏపీ సెక్రటేరియట్ వెలగపూడి బ్రాంచి ఖాతాకు చెల్లించవచ్చని తెలిపారు. కలెక్టరేట్‌లోని డీఆర్‌ఓకు అందజేసే చెక్కులను సీఎంఆర్ఎఫ్ ఖాతాకు జమ చేయనున్నట్లు కలెక్టర్ చెప్పారు.
- : జిల్లాలోని రిజిస్ట్రేషన్లు-స్టాంపులశాఖ ఉద్యోగులు రూ.1.93 లక్షల విరాళాన్ని వారి రాష్ట్ర అసోసియేషన్ ద్వారా సీఎం సహాయనిధికి అందచేశారని ఆ శాఖ డీఐజీ కిరణ్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. తాను వ్యక్తిగతంగా రూ.25 వేలు పంపినట్లు తెలిపారు. రెవెన్యూ సిబ్బంది నెల్లూరు నుంచి ఏడు వాహనాల్లో ఫుడ్ ప్యాకెట్లు, వాటర్ బాటిళ్లను సిద్ధం చేసి పంపారు.

నెల్లూరు (హరనాథపురం): రాష్టంలోని ఉద్యోగులు, ఉపాధ్యాయులు, కార్మిక పెన్షనర్లు, గ్రామ సచివాలయ సిబ్బంది తమ ఒక రోజు వేతనాన్ని రాష్ట్ర ఖజానాకు జమ చేస్తున్నారని ఏపీఎన్జీవో సంఘం జిల్లా అధ్యక్షుడు మన్నేపల్లి పెంచలరావు చెప్పారు. ఎన్జీవో హోంలో విలేకరులతో ఆయన మాట్లాడుతూ ఏపీజేఏసీ ఛైర్మన్ శివారెడ్డి, ప్రధాన కార్యదర్శి హృదయరాజులు ముఖ్యమంత్రిని కలిసి ఒక రోజు మూలవేతనాన్ని సెప్టెంబరు నెల జీతం నుంచి మినహాయించి రాష్ట్ర ఖజానాకు జమచేయాలని వినతిపత్రం ద్వారా కోరినట్లు చెప్పారు.

- నెల్లూరు (సాంస్కృతికం) : ది నెల్లూరు ఆర్య వైశ్య బులియన్ మర్చంట్స్ అండ్ పాన్ బ్రోకర్స్ అసోసి యేషన్ సభ్యులు రూ.3,01,116 విరాళంగా ఇచ్చారు. ఆ మేరకు చెక్కును జీఎస్టీ జాయింట్ కమిషనర్ ఎ.రవీంద్రనాథ్‌రెడ్డికి అందజేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు శోభన్‌బాబు, కొండా ప్రవీణ్‌శంకర్, ఆడిటర్ ఏవీఎస్ కృష్ణమోహన్‌రావు పాల్గొన్నారు. అలాగే భారత సేవా ఫౌండేషన్ సభ్యులు 16,516 విలువగల ఆయుర్వేద సబ్బులు, పేస్టులను కమిషనర్ సూర్యతేజ ద్వారా బాధితులకు పంపారు.
- జలదంకి : మండలంలోని ఎన్డీఏ కూటమి నాయకులు ప్రత్యేక వాహనం ద్వారా విరాళాలు సేకరించారు. అన్నవరం, జలదంకి గ్రామాలలో ప్రజల నుంచి బియ్యం, నిత్యావసర సరుకులు సేకరించారు. ఈ కార్యక్రమంలో నాయకులు మునగాల తిరుమలరెడ్డి, రామక్రిష్ణారెడ్డి, రామచైతన్య, అశోక్, మువ్వా శ్రీహరి తదితరులు పాల్గొన్నారు.



నెల్లూరు : రూ.3 లక్షల చెక్కును అందిస్తున్న బులియన్ మర్చంట్స్ నాయకులు

- కందుకూరు : నియోజకవర్గంలోని ప్రజాప్రతినిధులు రూ.లక్ష విరాళం అందజేశారు. వలేటివారిపాలెం, కందుకూరు జడ్పీటీసీ సభ్యుల భర్తలు ఇంటూరి హరిబాబు, తొట్టెంపూడి శ్రీనివాసరావు, కందుకూరు ఎంపీపీ భర్త ఇంటూరి మాధవరావు, సర్పంచులు సబ్ కలెక్టరు శ్రీపూజను కలిసి డీడీ అందజేశారు. అలాగే ఆర్యవైశ్యుల ఆధ్వర్యంలో వాటర్‌బాటిళ్లు, బిస్కెట్ ప్యాకెట్లు సిద్ధం చేసి, ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు ద్వారా బాధితులకు పంపిణీ చేయనున్నట్లు వారు తెలిపారు. అలాగే హోటల్స్ అండ్ రెస్టారెంట్ల యజమానులు రూ.50వేలు అందజేస్తున్నట్లు తెలిపారు.

స్వాతంత్ర్య సమరోద్యమ సమయంలోనైనా.. విపత్కర పరిస్థితుల్లోనైనా దొడ్డ మనసు ప్రదర్శించడం, మేమున్నామంటూ ఆపన్న హస్తం అందించడం సింహపురీయుల ప్రత్యేకత.

ఆనాడు బ్రిటీష్ పాలనకు వ్యతిరేకంగా సుదీర్ఘ కాలం నడిచిన స్వాతంత్ర్య పోరాటానికి జిల్లావాసులు పెద్ద ఎత్తున ఆర్థిక సాయం అందించారు. బకింగ్‌హాం కెనాల్ మీదుగా జిల్లా నుంచి భారీగా ధాన్యపు రాశులు ఉద్యమకారులకు పంపారు. స్వాతంత్ర్య అనంతరం కూడా నెల్లూరు ప్రజలు పలు సందర్భాల్లో భారీ విరాళాలతో మానవత్వం చాటుకున్నారు. దివిసీమ ఉప్పెన మొదలు దేశంలో ఎక్కడ ఏ విలయం జరిగినా, సాటి మనిషికి సాయం అవసరం అనిపించే ఏ సందర్భంలోనైనా మేమున్నామంటూ బాధితులకు అండగా నిలబడి, తమ వంతు సాయం చేశారు.

ఇప్పుడు అన్నపూర్ణలాంటి కోనసీమకు కష్టమొచ్చింది. వరద బీభత్సానికి బెజవాడ కన్నీటి చెలమయ్యింది. సంపన్న ప్రాంతంగా గుర్తింపు పొందిన ప్రాంతం పిడికెడు మెతుకుల కోసం చేయి చాస్తోంది. ఈ విపత్కర పరిస్థితుల్లో మరోసారి నెల్లూరువాసులు తమ దానగుణం చాటుకోవాల్సిన అవసరం ఏర్పడింది. ఇప్పటికే ఎంతోమంది దాతలు సాయం అందిస్తున్నారు. జిల్లాకు చెందిన పూర్వ ఉపరాష్ట్రపతి వెంకయ్య కుటుంబం, నెల్లూరు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకరరెడ్డి దంపతులు భారీగా విరాళాలు అందజేశారు. పలువురు దాతలు నేరుగా ముఖ్యమంత్రి సహాయనిధి బ్యాంక్ ఖాతాలకు అందజేస్తున్నారు. కలెక్టర్ ద్వారా మరి కొందరు నిధులు సమకూరుస్తున్నారు. విజయవాడ గుండెపై ప్రకృతి చేసిన గాయం మాన్పలేకపోయినా కనీసం ఆ బాధ నుంచి అక్కడి ప్రజలకు కాసింత ఉపశమనం కలిగించడానికి అవసరమైన సాయం అందాలంటే అందరూ తలో చేయి వేయాలి. నెల్లూరీయుల గొప్ప మనసు మరోసారి చాటుకోవాలి.

- నెల్లూరు (ఆంధ్రజ్యోతి)

సహాయక చర్యల్లో మేము సైతం

నెల్లూరు, (ఆంధ్రజ్యోతి) : విజయవాడలో వరద సహాయక చర్యల్లో మేము సైతం అంటూ జిల్లా నుంచి పెద్ద సంఖ్యలో అధికారులు, ఉద్యోగులు తరలివెళ్లారు. ప్రభుత్వ ఆదేశాలతో పలు శాఖల ఉద్యోగులను బృందాలుగా విభజించి పంపారు. పారిశుధ్య కార్యక్రమాల నిర్వహణ, విద్యుత్ పునరుద్ధరణ, బాధితులను సురక్షిత ప్రాంతాలకు తరలించే పనిలో భాగంగా మున్సిపాలిటీలు, పంచాయతీల్లోని పారిశుధ్య సిబ్బందిని, విద్యుత్ సిబ్బందిని, ఫైర్, పోలీసు సిబ్బందిని తరలించారు. జాయింట్ కలెక్టర్ కార్తీక్, ఆత్మకూరు ఆర్డీవో మధులతలు మొదటి రోజు నుంచీ సహాయక చర్యల్లో భాగమయ్యారు. విద్యుత్ శాఖ నుంచి లైన్‌మన్ మొదలు ఈఈ స్థాయి వరకు సుమారు 200 మంది అధికారులు, సిబ్బంది విజయవాడలో ఉన్నారు. పంచాయతీ విభాగం నుంచి 60 టీంలు (ఒక్కో టీంలో ఆరుగురు)గా విభజించి మొత్తం 360 మంది పారిశుధ్య నిర్వహణలో పని చేస్తున్నారు. పోలీసు శాఖ నుంచి కానిస్టేబుల్ మొద లు డీఎస్పీ వరకు కలిపి 400 మంది విధుల్లో ఉన్నారు. అగ్నిమాపక శాఖకు సంబంధించి 70 మంది సిబ్బంది సహాయక చర్యల్లో భాగస్వా ములై ఉన్నారు. నెల్లూరు, పొదలకూరు మినహా జిల్లాలో మిగిలిన అన్ని ఫైర్ ఇంజన్లు విజయవాడకు వెళ్లాయి. నెల్లూరు కార్పొరేషన్ నుంచి 166 మంది పారిశుధ్య కార్మికులు, నలుగురు శానిటరీ ఇన్‌స్పెక్టర్లు, ఐదుగురు సచివాలయం సిబ్బంది, పది మంది పారిశుధ్య మేస్త్రీలతోపాటు కమిషనర్ సూర్యతేజ, ఎస్ఈ సంపత్ కుమార్, ఈఈలు సంజయ్, చంద్రయ్య, పలువురు డీఈ, ఏఈలు విజయవాడలో సహాయక చర్యల్లో ఉన్నారు.

ప్రభుత్వం మారినా కొందరు ఇరిగేషన్ అధికారుల తీరు మారడం లేదు. పాత జీవోలను అడ్డుపెట్టుకుని విచ్చలవిడిగా చెరువుల్లో మట్టి తవ్వకాలకు అనుమతులు ఇస్తున్నారు. ఇదే అదునుగా అక్రమార్కులు కూడా బరి తెగిస్తున్నారు. తీసుకుంటున్న అనుమతులకు, జరుపుతున్న తవ్వకాలకు సంబంధం లేకుండా చెరువులను కుళ్ల బొడుస్తున్నారు. నెల రోజులుగా జరుగుతున్న అక్రమ తవ్వకాలపై కలెక్టర్ ఆనంద్ సీరియస్ అయ్యారు. ఇకపై చెరువుల్లో తవ్వకాలకు అనుమతులిచ్చినా, అనధికారికంగా తవ్వకాలు జరిగినా సంబంధిత అధికారులను సస్పెండ్ చేస్తానని హెచ్చరించారు.



నెల్లూరు చెరువులో మట్టి తవ్వకాలతో ఏర్పడ్డ భారీ గుంత

పాత జీవోలు.. కొత్త అనుమతులు!

- ఇరిగేషన్ అధికారుల లీలలు
- చెరువులను కుళ్లబొడుస్తున్న అక్రమార్కులు
- అనుమతులు గోరంత.. తవ్వేది కొండంత
- వరుస ఫిర్యాదులతో కలెక్టర్ ఆగ్రహం
- సస్పెండ్ చేస్తానని అధికారులకు హెచ్చరిక

నెల్లూరు, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి) : కొత్త ప్రభుత్వం ఏర్పడ్డాక రియల్ ఎస్టేట్ వేగం పుంజుకుంది. కొత్తగా వెలుస్తున్న లేఅవుట్లకు మట్టి, గ్రావెల్ అవసరం కావడంతో కొందరు అక్రమ మార్గంలో వ్యాపారాన్ని మొదలు పెట్టారు. మట్టి, గ్రావెల్ తవ్వకాలకు కూటమి ప్రభుత్వం ఇంతవరకూ ఎటువంటి గైడ్‌లైన్స్ జారీ చేయ లేదు. గత ప్రభుత్వంలో జరిగిన అక్రమాలను దృష్టిలో పెట్టుకొని ఈదఫా పక్కాగా నిబంధనలు రూపొందించాలని యోచిస్తోంది. కానీ జిల్లాలో మాత్రం గడువు ముగిసిన జీవోలను అడ్డుపెట్టుకొని అక్రమార్కులు చెరువుల్లో మట్టి, గ్రావెల్ తవ్వకాలకు దరఖాస్తు చేస్తున్నారు. దీనికి రాజకీయ సిఫారసు తోడవుతోంది. ఇంకే ముంది పాత జీవోల ఆధారంగా తవ్వకాలకు అనుమతులు జారీ చేస్తున్నారు. ఒక్క నెల్లూరు సెంట్రల్ డివిజన్ పరిధిలోనే ఇటీవల ఎక్కువగా అనుమతులు జారీ అవుతున్నాయి. నెల్లూరు చెరువులో వెయ్యి క్యూబిక్ మీటర్లకు అనుమతులు తీసుకొని 30 వేల క్యూబిక్ మీటర్లను తవ్వేశారు. ఇంకా తవ్వుతూనే ఉన్నారు. వ్యవసాయ భూముల చదునుకు మట్టి అవసరమని అనుమతుల పత్రాల్లో పేర్కొంటున్నా ఆ మట్టి, గ్రావెల్‌ను లేఅవుట్లకు తరలిస్తూ రూ.కోట్లు గడిస్తున్నారు. ధనలక్ష్మీపురం పరిసరాల్లోని చెరువులో కూడా విచ్చలవిడిగా తవ్వకాలు జరుపుతున్నారు. జిల్లాలోని అనేక చోట్ల ఇదే పరిస్థితి కొనసాగుతోంది. దీంతో అక్రమార్కులు మరింత బరితెగిస్తున్నారు.

కలెక్టర్ ఆగ్రహం

మట్టి, గ్రావెల్ తవ్వకాల్లో అక్రమాలు జరుగుతున్నాయన్న ఫిర్యాదుల నేపథ్యంలో జిల్లాలో అనుమతులు జారీ చేయవద్దని ఇరిగేషన్ శాఖ సెక్రటరీ సాయిప్రసాద్ గత నెలలో ఆదేశాలు జారీ చేశారు. అయినా కొన్ని డివిజన్ల ఈఈలు అనుమతులు ఇస్తున్నారు. ఇటీవల జిల్లాలో మట్టి తవ్వకాలు ఎక్కువైపోతుండడం, అడిగితే అనుమతులు ఉన్నాయని చెబుతుండడం కలెక్టర్ దృష్టికి వచ్చింది. ఈ తవ్వకాలతో కొన్ని చెరువులు రూపుకోల్పో తున్నట్లు కలెక్టర్‌కు ఫిర్యాదులు అందాయి. దీంతో వెంటనే స్పందించిన కలెక్టర్ ఇరిగేషన్ ఉన్నతాధికారులతో చర్చించారు. సెక్రటరీ ఆదేశాలు జారీ చేసినా అనుమతులిచ్చినట్లు కలెక్టర్ దృష్టికి రావడంతో ఆయన సీరియస్‌గా తీసుకున్నారు. ఇకపై ఎక్కడైనా తవ్వకాలకు అనుమతులిచ్చినా లేదా చెరువుల్లో అనధికారికంగా మట్టి తవ్వకాలు జరిగినా సంబంధిత అధికారులను సస్పెండ్ చేస్తానని తీవ్రంగా హెచ్చరించారు. దీంతో ఒక్కసారిగా ఇరిగేషన్ శాఖలో ఉలికిపాటు వచ్చింది. కలెక్టర్ ఆదేశాలతో వెంటనే ఇరిగేషన్ ఎస్ఈ కృష్ణమోహన్ అన్ని డివిజన్లకు మోమో జారీ చేశారు. దీనిపై ఎస్ఈను వివరణ కోరగా మెమో జారీ చేసిన మాట వాస్తవమేనని చెప్పుకొచ్చారు.

తెల్లవారుజాము 2 గంటల సమయంలో అంతా ఆదమరిచి నిద్రపోతున్నారు. ఇంతలో కూతవేటు దూరంలో ఉన్న ఓ బాణసంచా గోదాములో భారీ శబ్దం. క్షణాల్లో మంటలు ఉవ్వెత్తున ఎగసిపడ్డాయి. ఏం జరిగిందో తెలుసుకునేలోపు అంతా కాలిపోయి బూడిద మిగిలింది. గోదాముకు కాపలా ఉన్న ఓ వృద్ధుడు సజీవదహనమవగా, మరొకరు అప్రమత్తమై తప్పించుకున్నాడు. సుమారు రూ. 10 లక్షల టపాసులు అగ్నికి ఆహుతి అయ్యాయని బాధితుడు గగ్గోలు పెట్టారు. నెల్లూరు శివారున కల్లూరిపల్లి వద్ద బుధవారం ఉదయం జరిగిన ఈ ఘటన శివారు ప్రాంతప్రజలను ఉలికిపాటుకు గురిచేసింది.

నిశిరాత్రిలో విస్ఫోటం

- కల్లూరిపల్లి వద్ద బాణసంచా గోదాము దగ్ధం
- నిమిషాల్లో వ్యాపించిన మంటలు
- వాచ్‌మన్ సజీవదహనం
- మరొకరికి తప్పిన ప్రమాదం
- రూ. 10 లక్షల ఆస్తినష్టం

నెల్లూరు రూరల్, సెప్టెంబరు 4 : నగర శివారులోని కల్లూరిపల్లి పరిధిలో ఆకుల సుధీర్‌కు చెందిన భవానీ ట్రేడర్స్ టపాసుల గోదాములో బుధవారం తెల్లవారుజాము సుమారు 2 గంటల ప్రాంతంలో మంటలు చేలరేగాయి. ఈ మంటలు ఎలా వచ్చాయో తెలియదుకానీ గోదాములో ఒక్కసారిగా భారీ శబ్దాలతో పేలుళ్లు సంభవించాయి. వరండాలో నిద్ర పోతున్న వాచ్‌మన్ వడ్లమూడి సుబ్బయ్య (62) అప్రమత్తం అయ్యేలోపే మంటలు చుట్టుముట్టాయి. ఊపిరాడని స్థితిలో అక్కడే పడిపోయిన సుబ్బయ్య మంటల్లో చిక్కుకుని సజీవదహనమయ్యాడు. పోస్టుమార్టానికి తరలించడానికి కూడా వీలులేకపోవడంతో అక్కడే పీఎం చేయించిన పోలీసులు కేసుకట్టారు. మరోక వాచ్‌మన్ టపాసుల వెంకటేశ్వర్లు మాత్రం మంటలను పసిగట్టి అప్రమత్తమై పరుగులు తీయడంతో ప్రాణాలతో బయటప డ్డాడు. ఈ ప్రమాదంలో రూ. 10 లక్షల వరకు టపాసులు అగ్నికి ఆహుతైనట్లు నిర్వహకులు బోరుమన్నారు. కాగ నివాసాలకు దూరంగా గోదాము ఉండటంతో ప్రాణ నష్టం ఒకరితో ముగిసిందని, లేకపోతే అంచన బీకరంగా ఉండేదని పోలీసు అధికారులు ఆందోళన వ్యక్తం చేశారు. విషయం తెలుసుకున్న వెంటనే అగ్నిమాపక దళం హుటాహుటిన ఘటనా స్థలికి చేరుకుని మంటలను అదుపు చేసింది. నెల్లూరు ఆర్డీవో మలోలా, రూరల్ డీఎస్పీ ఘట్టమనేని శ్రీనివాసులు, రూరల్, బుచ్చి, కోవూరు సీఐలు గుంజివేణు, శ్రీనివాసులురెడ్డి, సుధాకర్‌రెడ్డిలు ఘటన వద్దేఉండి ప్రమాదాన్ని అంచనా వేశారు. అటు సీసీ కెమెరాలు కూడా మంటల్లో కాలిపోవడంతో ఆధారాలు లేకుండాపోయాయి. విద్యుత్‌సర్క్యూట్ వల్ల ఈ ప్రమాదం జరిగిందని అందరూ అనుమానిస్తున్నప్పటికీ ప్రభుత్వ నిబంధనలు ప్రకారం విద్యుత్ సరఫరా ఉండకూడదని తెలుస్తోంది. రూరల్ పోలీసులు కేసు కట్టి దర్యాప్తు చేస్తుండగా వాస్తవాలు తేలాల్సి ఉంది.

ప్రమాణాలపై తనిఖీ చేయండి : ఎమ్మెల్యే

నెల్లూరురూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి ఘటనా స్థలికి చేరుకుని మృతుడు సుబ్బయ్య కుటుంబాన్ని ఓదార్చారు. ప్రభుత్వం నుంచి సహాయం అందేలా చూస్తానని హామీ ఇచ్చారు. రూరల్లోని అన్ని టపాసుల దుకాణాల్లో ప్రమాణాలు ఉన్నాయా లేదా తనిఖీ చేయాలని అధి కారులకు సూచించారు. అనంతరం విజయ డెయిరీ ఛైర్మన్ కొండ్రెడ్డి రంగారెడ్డి, రూరల్ మాజీ ఎంపీపీ బీవీరమణారెడ్డి తదితరులు బాధిత కుటుంబాన్ని పరామర్శించారు.



పూర్తిగా కాలిపోయిన గోదాము, (ఇన్‌సెట్‌లో) మృతుడు సుబ్బయ్య (ఫైల్)

మెనూ అమలులో నిర్లక్ష్యం వద్దు

● జిల్లా బీసీ సంక్షేమాధికారి ప్రసన్న



సమావేశంలో మాట్లాడుతున్న బీసీ సంక్షేమాధికారి ప్రసన్న

నెల్లూరు (హరనాథపురం), సెప్టెంబరు 4 : బీసీ సంక్షేమ హాస్టళ్లలో మెనూ సక్రమంగా అమలు చేయాలని, మెనూ అమలులో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని జిల్లా బీసీ సంక్షేమాధికారి ప్రసన్న హాస్టల్ వెల్ఫేర్ అధికారులను హెచ్చరించారు. బుధవారం నగరంలోని బీసీ సంక్షేమాధికారి కార్యాలయంలో ఏబీసీడబ్ల్యూవోలు, హెచ్‌డబ్ల్యూవోలతో సమావేశం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ నిరంతరం హాస్టళ్లను తనిఖీ చేస్తామన్నారు. విద్యార్థుల నుంచి ఫిర్యాదులు వస్తే సహించబోమన్నారు. జ్వరాల ప్రబలుతున్న దృష్ట్యా విద్యార్థులకు తాగడానికి వేడి నీరు ఇవ్వాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సహాయ బీసీ సంక్షేమాధికారి సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ మోటార్ల దొంగలు అరెస్ట్



స్వాధీనం చేసుకున్న విద్యుత్ మోటార్లతో పోలీసులు

కోవూరు, సెప్టెంబరు 4: ఇటీవల కాలంలో నియోజకవర్గ పరిధి లోని గ్రామాల్లో విద్యుత్ మోటార్లను అపహరించిన ఇద్దరు యువకులను బుధవారం పోలీసులు అరెస్టు చేశారు. ఎస్ఐ రంగనాథ్‌గౌడ్ కథనం ప్రకారం వివరాలిలా ఉన్నాయి. ఇందుకూరుపేట మండల పరిధిలోని పున్నూరు గ్రామానికి చెందిన రాజేష్, శ్యామ్‌సుందర్ విలాసాలకు అలవాటుపడి విద్యుత్ మోటార్లను అపహరించి విద్యుత్ తీగలను, మోటార్లను అమ్ముకుని పోలీసులకు చిక్కకుండా తిరుగుతున్నారు. దీంతో యువకులపై అనుమానం వచ్చి విచారించగా విద్యుత్ మోటార్లను అపహరించేది వారేనని పోలీసుల విచారణలో తేలింది. వారివద్ద నుంచి రూ.5లక్షల విలువచేసే 12 విద్యుత్ మోటార్లను, 20కేజీల రాగిని స్వాధీనం చేసుకున్నారు. ఇరువురినీ అరెస్టు చేసి కోర్టులో హాజరుపరిచినట్లు వివరించారు.

మద్యం మత్తులో హెడ్ కానిస్టేబుల్ వీరంగం

- తనపై దాడి చేశారని మరో హెచ్‌సీ ఫిర్యాదు
- సీఐ, ఎస్ఐలతో కూడా దురుసు ప్రవర్తన



వీరంగం చేస్తున్న హెడ్‌కానిస్టేబుల్ జేమ్స్‌ను అదుపు చేస్తున్న ఎస్ఐ

కలువాయి, సెప్టెంబరు 4: స్థానిక పోలీసు స్టేషన్‌లో రాపూరు సీఐ విజయకృష్ణ, ఎస్ఐ సుమన్ ఉండగానే బుధవారం హెడ్‌కానిస్టేబుల్ ఎస్.జేమ్స్ మద్యం మత్తులో వీరంగం సృష్టించారు. సేకరించిన వివరాల మేరకు, విధుల విషయమై అడిగినందుకు మద్యం సేవించి వచ్చిన హెచ్‌సీ జేమ్స్ తనను కాలితో తన్ని దాడి చేశాడని మరో హెచ్‌సీ రమణయ్య సీఐకి ఫిర్యాదు చేశారు. బుధవారం బాధ్యతలు చేపట్టేందుకు ఎస్ఐ సుమన్ కూడా ఇక్కడి వచ్చారు. వారు రమణయ్యపై దాడి విషయాన్ని ప్రశ్నించినందుకు మరో మారు జేమ్స్ వీరంగం చేశాడు. పోలీసులంతా పట్టుకున్నా.. సీఐ,ఎస్ఐ ఉన్న గదిలోకి పలుమార్లు వెళ్లి వారితో కూడా దురుసుగా ప్రవర్తించాడు. స్టేషన్‌లో నానా బీభత్సం సృష్టించాడు. దీంతో అతడ్ని అదుపు చేయడం పోలీసులకు తలకుమించిన బారంగా మారింది. ఈ విషయమై సీఐ ఉన్నాతాధికారులకు సమాచారం ఇచ్చినట్లు తెలిసింది. అనంతరం జేమ్స్‌ను ఎస్ఐ సుమన్ కారులో ఎక్కించుకుని నెల్లూరుకి తీసుకెళ్లారు.

త్రుటిలో తప్పిన ప్రమాదం



తెగి రోడ్డుపై పడ్డ విద్యుత్ తీగ


ఉదయగిరి రూరల్, సెప్టెంబరు 4: పట్టణంలోని ఖాన్‌షావలిదర్గా సమీపంలో బుధవారం ఈదురు గాలులకు 11 కేవీ విద్యుత్ తీగ తెగి రోడ్డుపై పడింది. అక్కడ ఎవరూ లేకపోవడంతో పెద్ద ప్రమాదం తప్పింది. గాలులకు సమీపంలో ఉన్న ట్రాన్స్‌ఫార్మర్ వద్ద పెద్ద శబ్దం రావడంతో ఉన్నట్టుండి విద్యుత్ తీగ తెగి రోడ్డుపై పడింది. ఆ సమయంలో రాకపోకలు సాగించే వారు లేకపోవడంతో ప్రమాదం తప్పింది. స్థానికులు లైన్‌మన్ రమణకు సమాచారం అందించడంతో ఆయన వచ్చి మరమ్మతులు చేసి విద్యుత్ సరఫరాను పునరుద్ధరించారు.

రెండు మోటార్ సైకిళ్ల ఢీ

ఒకరి మృతి, ఇద్దరికి గాయాలు

కలిగిరి, సెప్టెంబరు 4: కలిగిరి-సంగం రహదారిలో కలిగిరికి సమీపంలోని పొగాకు బోర్డు వద్ద బుధవారం రాత్రి ఎదురెదురుగా వస్తున్న రెండు మోటార్ సైకిళ్లు ఢీకొన్నాయి. ఈ ఘటనలో నెల్లూరు రూరల్ మండలం వెల్లంటికి చెందిన పాదర్తి సుధాకర్(42) అక్కడికక్కడే మృతి చెందాడు. మరో ఇద్దరికి గాయాలయ్యాయి. పోలీసుల కథనం మేరకు.. సుధాకర్ కలిగిరి నుంచి సంగం వైపు వస్తుండగా కలిగిరి మండలం వెలగపాడుకు చెందిన గుత్తి రవీంద్ర, తోకల దర్గాబాబు మరో మోటార్ సైకిల్‌పై కలిగిరికి వస్తున్నారు. ఈ క్రమంలో రెండు వాహనాలు ఎదురెదురుగా ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో సుధాకర్ మృతి చెందగా మరో వాహనంపై ఉన్నవారికి గాయాలు కాగా వారిని చికిత్స నిమిత్తం 108వాహనంలో స్థానిక ప్రైవేటు వైద్యశాలకు తరలించారు. ఘటనపై వివరాలు సేకరించి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్ఐ సుబ్బారావు తెలిపారు.

పోలంగారిపల్లిలో వింత మేకపిల్ల జననం



సీతారామపురం, సెప్టెంబరు 4: మండలంలోని పోలంగారిపల్లిలో బుధవారం వింత మేకపిల్ల జన్మించింది. వివరాల్లోకి వెళితే.. పోలంగారిపల్లిలోని కటారి వెంకటయ్య మేకలు పెంచుకుంటూ జీవిస్తున్నాడు. బుధవారం ఆ మేకల్లోని ఒక మేక వింత పిల్లకు జన్మనిచ్చింది ఆ మేక పిల్లకు ఎనిమిది కాళ్లు, రెండు తలలు, నాలుగు చెవులు ఉన్నాయి. అలా పుట్టిన మేక పిల్లను తల్లి నుంచి వేరు చేసే క్రమంలో చనిపోయింది. ఈ విషయమై మండల పశువైద్యాధికారులను వివరణ కోరగా, జన్యులోపంతో కొన్ని సార్లు ఇలా జరుగుతుందని తెలిపారు.

చికెన్ ధరలు

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్

	కిలో
బాయిలర్ లైవ్	105
లేయర్ లైవ్	105
స్కిన్ చికెన్	196
స్కిన్‌లెస్	216
లేయర్	178

బంగారం, వెండి ధరలు

బంగారం (22 క్యారెట్లు)

ఒక గ్రాము ధర	రూ.6821
వెండి కిలో ధర	రూ. 83,100
వెండి ఒక గ్రాము	రూ. 86.10

కుక్కల దాడిలో దుప్పి మృతి

మర్రిపాడు, సెప్టెంబరు 4 : మండలంలోని కదిరినాయుడుపల్లి అటవీ సమీప పొలాల్లోకి మంచి నీటికోసం వచ్చిన చుక్కల దుప్పి బుధవారం సాయంత్రం కుక్కల దాడిలో మృతి చెందింది. రైతులు అటవీ శాఖాధికారులకు సమాచారం ఇవ్వటంతో పంచనామా నిర్వహించి అడవిలో ఖననం చేశారు. నాలుగు రోజుల క్రితం కూడా పడమటినాయుడుపల్లిలోకి వచ్చిన దుప్పి కుక్కల చేతిలో మృతి చెందింది.

విజిలెన్స్ ఎస్పీగా రాజేంద్రకుమార్

నెల్లూరు,(క్రైం), సెప్టెంబరు 4: జిల్లా విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఎస్పీగా పీఆర్ రాజేంద్రకుమార్‌ను నియమిస్తూ ఆ శాఖ డీజీ హరీష్‌కుమార్ గుప్తా బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. రాజేంద్రకుమార్ గతంలో జిల్లాలో రైల్వే డీఎస్పీగా, సీఐడీ ఏఎస్పీగా పనిచేశారు. ఆయన రెండు రోజుల్లో బాధ్యతలు స్వీకరించనున్నారు.

- పీవోపీ విగ్రహాలతో ప్రకృతికి విఘాతం
- జల కాలుష్యం, ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం
- బంక మట్టి విగ్రహాలే మేలంటున్న వైద్యులు
- మార్పురాకపోతే ప్రమాదమంటున్న పర్యావరణవేత్తలు

మనదేశం ప్రకృతిని పూజించే దేశం. చెట్టును, పుట్టను కూడా దైవంగా భావించి ఆరాధించే సంప్రదాయాలున్న కర్మభూమి. విఘ్నాలను తొలగించి ప్రథమ పూజను అందుకునే విఘ్నేశ్వరుడిని కూడా ప్రకృతి సిద్ధంగా పూజించడం అనాదిగా వస్తున్న ఆచారం. ఏటా జరిగే వినాయక చవితి పండుగకు మట్టితో ప్రతిమను తీర్చిదిద్ది దానికి ప్రాణప్రతిష్ఠ చేసి 21 రకాల వృక్షాల పత్రాలతో అర్చించడం ఆనవాయితీ. అయితే గణేశ ఆరాధనలోనూ ఆధునిక పోకడలతో మనిషి అనుసరిస్తున్న ప్రకృతి విరుద్ధ విధానాలు చివరికి అదే మనిషి మనుగడను ప్రశ్నార్థకంగా మారుస్తున్నాయి. మట్టి గణపతిని పూజించే విధానానికి స్వస్తి చెప్పి ప్లాస్టర్ ఆఫ్ ప్యారిస్ (పీవోపీ) విగ్రహాలను తయారు చేసి పూజిస్తున్నారు. తర్వాతి కాలంలో ఆ విగ్రహాలు పర్యావరణ వినాశనానికి, మనుషులతోపాటు పశుపక్ష్యాదుల అనారోగ్యానికి కారణమవుతున్నాయి. పీవోపీ ప్రతిమలను పూజించి నిమజ్జనం చేయరాదని వైద్యులు, పర్యావరణవేత్తలు పదేపదే మొత్తుకుంటున్నా ప్రజల్లో ఆశించినంతగా మార్పు రావడం లేదు. ఈ నేపథ్యంలో ఈ ఏడాది వినాయక చవితికి ప్లాస్టర్ ఆఫ్ ప్యారిస్ విగ్రహాలు విడనాడి బంకమట్టి ప్రతిమలపై ప్రత్యేక శ్రద్ధ చూపాల్సిన అవసరం ఉంది.



ప్లాస్టర్ ఆఫ్ పారిస్ వినాయక విగ్రహాలు



మట్టితో చేసిన ప్రతిమ

మేల్కొందాం... మట్టి గణపతినే పూజిద్దాం !

నెల్లూరు(వైద్యం), సెప్టెంబరు 4 : ప్లాస్టర్ ఆఫ్ ప్యారిస్ వినాయక విగ్రహాలలో అనేక రసాయనాలు మిళితమై ఉంటాయి. ఇందులో ప్రమాదకరమైన లెడ్, పాదరసం, సీసం, జియోగ్యాస్ వంటి రసాయనాలు ఉంటాయి. వినాయక చవితి పూర్తైన అనంతరం విగ్రహాలను నీటిలో నిమజ్జనం చేస్తారు. దీని వలన ఆ విగ్రహాలలోని ప్రమాదకరమైన రసాయనాలు నీటిలో కలుస్తాయి. ఆ నీటిని తాగిన పశుపక్ష్యాదులు ప్రాణాంతక వ్యాధుల బారినపడే ప్రమాదం ఉంది. అంతేకాదు పీవోపీ విగ్రహాల తయారీలో వాడే రంగులు కూడా ప్రమాదకరమైనవే. జిప్సం, కాల్షియం, మెగ్నీషియం, సిలికాన్ వంటివి నీటిలో కలిసి మానవ మనుగడకు ముప్పుగా పరిణమిస్తున్నాయి.

ఆరోగ్యానికి అనర్థం

నీటిలో పీవోపీ విగ్రహాలను కలపడం వల్ల వాటిలోని రసాయనాలు నీటిలో కలుస్తాయి. ఆ నీటిని తాగడం వల్ల...

- శ్వాసకోశ వ్యాధులకు గురయ్యే అవకాశం ఉంటుంది.
- రసాయనాల వల్ల చర్మ వ్యాధులు సోకుతాయి.
- గుండె, మూత్రపిండాలు, నాడీ వ్యవస్థపై ప్రభావం చూపుతుంది.
- రక్తకణాలు కూడా దెబ్బ తింటాయి. డయేరియా(అతిసారా)కు గురై ప్రాణాపాయానికి దారి తీస్తుంది. మెదడుపై తీవ్ర ప్రభావం చూపుతుంది.

3వేల విగ్రహాలకు పైగా నిమజ్జనం

జిల్లా వ్యాప్తంగా వినాయక చవితి పండుగను భక్తిశ్రద్ధలతో జరుపుకుంటారు. వీధి వీధిన విగ్రహాలు ఏర్పాటు చేస్తున్నారు. పోటీతత్వంతో పెద్ద పెద్ద విగ్రహాలు ప్రతిష్ఠిస్తున్నారు. ఇందులో 98 శాతం ప్లాస్టర్ ఆఫ్ ప్యారీస్ విగ్రహాలే. బంక మట్టి విగ్రహాలే పెట్టుకోవాలని, లేకుంటే ప్రకృతికి తద్వారా మానవాళికి ప్రమాదమని పర్యావరణవేత్తలు హెచ్చరిస్తున్నా ఆకర్షణీయమైన రంగులు, సులభ రవాణా తదితర కారణాలతో ఎక్కువ మంది పీవోపీ విగ్రహాలవైపే మొగ్గుచూపుతున్నారు. ఈ ఏడాది చవితికి జిల్లా వ్యాప్తంగా మూడు వేలకు పైగా పీవోపీతో చేసిన ఉత్సవ విగ్రహాలను ఏర్పాటు చేస్తున్నట్లు అంచనా. వీటివల్ల పర్యావరణానికి తీవ్ర విఘాతం ఏర్పడే అవకాశం ఉంది. ఈ నేపథ్యంలో మట్టి విగ్రహాలనే పూజించాల్సిన ఆవశ్యకత ఎంతో ఉంది. ఇవి నీటిల త్వరగా కరగడమేకాక పర్యావరణానికి ఎటువంటి హాని కలిగించవని నిపుణులు సూచిస్తున్నారు. కాగా, ఇళ్లలో పూజించేవారు ఎక్కువగా మట్టి విగ్రహాలనే ఎంచుకుంటున్నప్పటికీ భారీ విగ్రహాలను మాత్రం పీవోపీతో చేసినవి ఏర్పాటు చేస్తుండటం ఆందోళనకరం.

పర్యావరణంపై తీవ్ర ప్రభావం



ప్లాస్టర్ ఆఫ్ ప్యారిస్ విగ్రహాల వలన పర్యావరణానికి తీవ్ర విఘాతం కలుగుతుంది. నీటిలో ఈ విగ్రహాలు కలపడం వలన నెలరోజుల పాటు పూర్తిగా నీటిలో కలిసే అవకాశం లేదు. రసాయనాలు కూడా భూమి పొరల్లో చేరి పర్యావరణానికి చేటు కలిగిస్తాయి. భూగర్భ జలాలు కూడా కలుషితమయ్యే అవకాశం ఉంది. ఈ రసాయనాల అవశేషాలు నీటిలోనే ఎక్కువ కాలం ఉంటాయి. దీనిపై విస్తృత ప్రచారం కూడా చేస్తున్నాం.

- డాక్టర్ కాలేషా, జీజీహెచ్ జనరల్ సర్జన్, జనవిజ్ఞాన వేదిక జిల్లా అధ్యక్షుడు

ఆరోగ్యం దెబ్బతింటుంది



పీవోపీతో చేసిన వినాయక విగ్రహాల వల్ల ఎన్నో అనర్థాలు ఉన్నాయి. ఆ విగ్రహాలను నీటిలో కలపటం వల్ల ఆ నీటిలో రసాయనాలు కలుస్తాయి. వాటిని తాగడంతో ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం చూపుతాయి. ప్రతి ఏటా జిల్లాలో విగ్రహాల సంఖ్య పెరుగుతూనే ఉంది. ఇందులో పీవోపీతో చేసినవే ఎక్కువ. ఇది ప్రకృతిపరంగా మానవాళికి మంచిది కాదు. ప్రకృతికి ఇబ్బంది లేని విధంగా సంప్రదాయబద్ధంగా పండుగ జరుపుకోవాలి.

- డాక్టర్ ఏవీ రమణయ్య, ప్రజారోగ్య వేదిక రాష్ట్ర అధ్యక్షుడు

'కాకాణి'వి దిగజారుడు మాటలు

- రూ.కోట్లు విలువైన భూములు బంధువులకు ధారాదత్తం
- విచారణకు వెళ్లిన అధికారులను దొంగలు అంటారా!?
- సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి ఆగ్రహం



విలేకరులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సోమిరెడ్డి

నెల్లూరు, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్ వెళుతూ తాను వరదలో చిక్కుకుంటే తెలంగాణ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సాయం చేశారని, ఆటువంటిది డబ్బు సంచులు దాటించారంటూ వైసీపీ నేత కాకాణి గోవర్ధన్‌రెడ్డి మాట్లాడటం ఆయన దిగజారుడుతనానికి నిదర్శనమని టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు, సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి దుయ్యబట్టారు. బుధవారం నెల్లూరులోని తన క్యాంపు కార్యాలయంలో సోమిరెడ్డి విలేకరుల సమావేశంలో మాట్లాడారు. మరుపూరులో రూ.కోట్ల విలువైన ప్రభుత్వ భూములను అధికారుల సంతకాలు లేకుండా కాకాణి తన బంధువులకు ధారాదత్తం చేస్తే ఊరుకోవాలా అని ప్రశ్నించారు. భూ అక్రమాలపై విచారణలో భాగంగా పోలీసులు, రెవెన్యూ అధికారులు ఒకరి ఇంటికెళితే నగలు దొంగతనం చేశారని చెప్పడం కాకాణికే చెల్లిందని విమర్శించారు. ఎమ్మెల్యేగా, మంత్రిగా పనిచేసిన వ్యక్తి రెవెన్యూ, పోలీసులను దొంగలని మాట్లాడటం దురదృష్టకరమన్నారు. రోజుకు రెండుసార్లు తనను, ఒకసారి చంద్రబాబును తిడితే చేసిన పాపాలు పోతాయనుకుంటున్నారేమో.. ఏదీ వదిలిపెట్టేది లేదు.. అంటూ స్పష్టం చేశారు. అందరూ ఉదారంగా స్పందించి వరద బాధితులను ఆదుకునేందుకు ప్రభుత్వానికి విరాళాలు అందజేయాలని సోమిరెడ్డి పిలుపునిచ్చారు.

ఒకరి నేత్రదానం ఇద్దరికి వెలుగు: కలెక్టర్



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న కలెక్టర్, వైద్యాధికారులు

నెల్లూరు (వైద్యం), సెప్టెంబరు 4 : ఒకరి నేత్రదానం ఇద్దరి జీవితాల్లో వెలుగునిస్తుందని కలెక్టర్ ఆనంద్ వెల్లడించారు. బుధవారం కలెక్టర్ చాంబర్‌లో జాతీయ నేత్రదాన పక్షోత్సవాల పోస్టర్లను వైద్యాధికారులతో కలిసి కలెక్టర్ ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ సమాజంలో ఎంతో మంది కంటిచూపునకు దూరమై అంధకారంలో జీవిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వారికి చూపును ప్రసాదించేందుకు నేత్రదానంపై అవగాహన పెంచుకోవాలన్నారు. దేశంలో ప్రతి ఏడాది కోటిమంది మరణిస్తున్నారని వీరిలో రెండు శాతం మంది నేత్రదానం చేస్తే అంధత్వాన్ని నివారించవచ్చని చెప్పారు. ఆగస్టు 25వ తేదీ నుంచి సెప్టెంబరు 8వ తేదీ వరకు నేత్రదాన పక్షోత్సవాలు జరుగుతున్నాయని తెలిపారు. ప్రభుత్వ జిల్లా ఆసుపత్రితో పాటు ఏరియా, సామాజిక ఆసుపత్రులు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల పరిధిలో నేత్రదానంపై అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో డీఎంహెచ్‌వో డాక్టర్ పెంచలయ్య, డీసీహెచ్ఎస్ డాక్టర్ రమేష్‌నాథ్, జిల్లా అంధత్వ నివారణ అధికారి డాక్టర్ శర్వాణి, శ్రీనివాసరావు, గురవయ్య, అబేగ్ తదితరులు పాల్గొన్నారు.

కృష్ణానదికి, బుడమేరుకు తేడా తెలియని అజ్ఞాని జగన్

● టీడీపీ నేత కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి



మాట్లాడుతున్న కోటంరెడ్డి పక్కనే నాయకులు

నెల్లూరు (వ్యవసాయం), సెప్టెంబరు 4 : కృష్ణానదికి బుడమేరు కాలువకి తేడా తెలియని అజ్ఞాని జగన్‌మోహన్ రెడ్డి అని తెలుగుదేశం పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి హేళన చేశారు. నెల్లూరులోని టీడీపీ కార్యాలయంలో బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. 74 ఏళ్ల వయసులో ముఖ్యమంత్రి చంద్రబాబు పగలు, రాత్రి తేడా లేకుండా నడుము లోతు నీళ్లలో వరద సహాయక చర్యల్లో పాల్గొంటున్నారని, ఆయనపై విమర్శలు చేయడం సరికాదన్నారు. మాజీ ముఖ్యమంత్రిగా వరద బాధితులకు ఏం చేశావంటూ జగన్‌ను ప్రశ్నించారు. తండ్రి అధికారాన్ని అడ్డుపెట్టుకుని లక్షల కోట్లు సంపాదించిన జగన్ వరద బాధితుల నిధికి రూ.కోటి ఇవ్వడం సిగ్గుచేటని ఎద్దేవా చేశారు. జగన్ పాలనలో వరదలొస్తే హెలికాప్టర్‌లో ఏరియల్ సర్వే చేశాడని, కానీ చంద్రబాబు నడుము లోతు నీళ్లలో దిగి స్వయంగా అధికార యంత్రాంగంతో పని చేయిస్తున్నారన్నారు. మేకప్ కోసం ఇటలీ వెళ్లిన రోజా ప్రభుత్వంపై విమర్శలు చేయడం హాస్యాస్పదంగా ఉందన్నారు.

● వరద బాధితులకు రూ.10 లక్షలు ఇస్తాం

వరద బాధితుల సహాయార్థం తన కుటుంబం తరపున రూ.10లక్షలలోపు ఆర్థిక సాయం ప్రకటిస్తున్నానని, దీనిని చంద్రబాబుకి అందించడం జరుగుతుందని చెప్పారు. ఈ సమావేశంలో నాయకులు ఉచ్చి భువనేశ్వరీప్రసాద్, పిట్టి సత్యనాగేశ్వరరావు, జహీర్, బాలాజీ, అంచూరి శ్రీనివాసులు నాయుడు, పసుపులేటి మల్లికార్జున, సుజన్ తదితరులు పాల్గొన్నారు.

ఎన్ఎంఎంఎస్ పరీక్షకు

దరఖాస్తుల ఆహ్వానం

నెల్లూరు (విద్య), సెప్టెంబరు 4 : నేషనల్ మీన్స్ కం మెరిట్ స్కాలర్‌షిప్ పరీక్ష కోసం ప్రభుత్వ పరీక్షల కార్యాలయ వెబ్‌సైట్ www.bseap.gov.in గురువారం నుంచి అందుబాటులో ఉంటుందని డీఈవో రామారావు ఓ ప్రకటనలో పేర్కొన్నారు. జిల్లాలోని ప్రభుత్వ, జడ్పీ, మునిసిపల్, ఎయిడెడ్, ఎంపీపీ, ఏపీ ఆదర్శ పాఠశాలల్లో 8వతరగతి చదువుతూ ఏడాదికి రూ.3.50లక్షలలోపు ఆదాయం ఉన్న విద్యార్థులందరూ ఈ పరీక్షకు అర్హులని తెలిపారు. విద్యార్థులకోసం ఈనెల 17వతేదీ వరకు వెబ్‌సైట్ పని చేస్తుందని, దరఖాస్తు సమయంలో ఆధార్‌లో ఉన్న విధంగానే వివరాలను నమోదు చేయాలని సూచించారు. ఓసీ, బీసీ విద్యార్థులు రూ.100, ఎస్సీ, ఎస్టీ విద్యార్థులు రూ.50 పరీక్ష రుసుమును ఆన్‌లైన్ అప్లికేషన్‌లో ఇచ్చిన ఎస్‌బీసీ కలెక్ట్ లింక్ ద్వారా మాత్రమే చెల్లించాలన్నారు. డిసెంబరు 8వతేదీన పరీక్ష జరుగుతుందని, మరిన్ని వివరాలకు వెబ్‌సైట్‌నుగానీ, దర్గామిట్ట జడ్పీ పాఠశాలలోని జిల్లా పరీక్షల విభాగం కార్యాలయంలోగానీ సంప్రదించాలని కోరారు.

బాలికపై లైంగిక వేధింపులు

● ఫోక్సో చట్టం కింద కేసు నమోదు

అల్లూరు, సెప్టెంబరు 4 : ఓ బాలికపై వృద్ధుడు లైంగిక వేధింపులకు పాల్పడుతూ అసభ్యంగా ప్రవర్తించడంతో అతడిపై ఫోక్సో చట్టం కింద కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ కిషోర్‌బాబు బుధవారం రాత్రి తెలిపారు. ఆయన తెలిపిన వివరాల మేరకు.. నెల్లూరు రూరల్ మండలం సౌత్ రాజుపాలెంకు చెందిన గోళ్ల దేవదాసు తన బంధుమిత్రులతో కలసి అల్లూరు పట్టణ పరిధిలోని ఆర్‌డీఆర్ కాలనీలోని ఓ వివాహానికి హాజరయ్యాడు. తనకు మనుమరాలు వరసైన 9 ఏళ్ల బాలిక పట్ల అసభ్యంగా ప్రవర్తించడంతో ఆ బాలిక తన తల్లికి తెలియజేసింది. వెంటనే తల్లి అల్లూరుపోలీసు స్టేషనులో ఫిర్యాదు చేయడంతో దేవదాసుపై ఫోక్సో చట్టం కింద కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

టీజీపీ అధికారులు ఎస్కేప్ పరిశీలన

కలువాయి, సెప్టెంబరు 4 : సోమశిల-కండలేరు వరద కాలువ 5.5 కిలోమీటరు వద్ద దెబ్బతిన్న ఎస్కేప్‌ను బుధవారం తెలుగుగంగ ప్రాజెక్టు (టీజీపీ) ఎస్ఈ ఎం.రమణారెడ్డి, కుల్లూరు డీఈ శ్రీనివాసులరెడ్డి పరిశీలించారు. ఎస్కేప్ గేట్లు దెబ్బతిని నీరు కాలువ నుంచి బయటకు ప్రవహించి కుల్లూరు చెరువు, పొలాలు మునిగిన విషయం తెలిసిందే. విశాఖ నుంచి గజ ఈతగాళ్లు ఇక్కడికి చేరుకున్న వెంటనే పని ప్రారంభించి గురువారం సాయంత్రానికి కాలువ నుంచి నీరు బయటకు పోకుండా అరికడతామని వారు తెలిపారు. ఎస్కేప్ నుంచి బయటకు పోతున్న నీరు పెన్నానదిలోని చేరుకునేందుకు ఉన్నవాగు ఆక్రమణలపై గంగ ఎస్ఈ ఇరిగేషన్ అధికారులకు ఫిర్యాదు చేశారు. దీంతో రాపూరు ఇరిగేషన్ అధికారి అనంతబాబు వాగు ఆక్రమణల పై తహసీల్దారును నివేదిక కోరారు. కుల్లూరు చెరువు ఆలుగు వాగు ద్వారా 2500 క్యూసెక్కుల నీరు పెన్నానదిలోని చేరాల్సి ఉందని, ఇప్పుడు 60,70 క్యూసెక్కులకే వాగు పొంగి పొలాలపై నీరు పారుతున్నాయని తెలిపారు. ఈ ఆక్రమణల తొలగింపునకు ఇరిగేషన్ అధికారులను చర్యలు తీసుకోవాలని కోరినట్లు వారు తెలియజేశారు. జిల్లా కలెక్టర్‌కు కూడా ఈ ఆక్రమణల విషయాన్ని తెలియజేసినట్లు వారు పేర్కొన్నారు.

సోమశిలకు 20,785 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో

అనంతసాగరం, సెప్టెంబరు 4: సోమశిల జలాశయానికి ఎగువ నుంచి బుధవారం 20,785 క్యూసెక్కుల వరద నీరు వస్తున్నట్లు అధికారులు తెలిపారు. ప్రాజెక్టు పూర్తి నీటి నిల్వ 77.988 టీఎంసీలు కాగా, 40.662 టీఎంసీలకు చేరుకుంది. దిగువ డెల్టాకు 1,050, కండలేరుకు 6,000, ఉత్తర, దక్షిణ కాలువలకు 10 క్యూసెక్కుల నీటిని సరఫరా చేస్తున్నారు.

కబ్జాచేయడం.. కట్టేయడం!

- భగత్‌సింగ్‌కాలనీలో జోరుగా ఆక్రమ నిర్మాణాలు
- పెన్నానదిని అనుకొని ఉన్న స్థలాల ఆక్రమణ
- తెర వెనుక వైసీపీ నాయకులు
- వరద ప్రభావిత ప్రాంతాల్లోనూ నిర్మాణాలు
- పట్టించుకోని ఇరిగేషన్, రెవెన్యూ అధికారులు

నెల్లూరు (వెంకటేశ్వరపురం), సెప్టెంబరు 4 : నెల్లూరు నగరంలోని వెంకటేశ్వరపురం పరిధిలో గల భగత్‌సింగ్‌కాలనీలో అక్రమ నిర్మాణాలు జోరుగా సాగుతున్నాయి. పెన్నానదిని అనుకొని ఉన్న ఇరిగేషన్ స్థలాలను స్థానిక వైసీపీ నాయకులు కొందరు ఇష్టానుసారంగా ఆక్రమిస్తున్నారు. వాటిలో ఇళ్ల నిర్మాణాలు జరిపి అమాయకులకు అమ్మి సొమ్ము చేసుకుంటున్నారు. ఇంత జరుగుతున్నా సంబంధిత రెవెన్యూ, ఇరిగేషన్ శాఖలు పట్టించుకోవడం లేదు. భగత్‌సింగ్‌కాలనీలో పెన్నానదిని అనుకొని దాదాపు ఐదెకరాల ఇరిగేషన్ భూమి ఖాళీగా ఉంది. దానిపై స్థానిక వైసీపీ నాయకుల కన్నుపడింది. దీంతో కొంచెం కొంచెంగా ఆ స్థలాన్ని ఆక్రమించుకుని అక్రమ నిర్మాణాలు చేసి అమ్మేస్తున్నారు. నదికి ఆనుకుని ఉన్న స్థలాల్లో ఇళ్ల నిర్మాణం వల్ల వరదలొచ్చినప్పుడు ఆ ఇళ్లు మునిగిపోతాయి. అయినా అధికారులు పట్టించుకోకపోవడం అనుమానాలకు తావిస్తోంది. ఉన్నతాధికారులు స్పందించి ప్రభుత్వ స్థలాల ఆక్రమణను అడ్డుకోవాల్సి ఉంది.



పెన్నానదిని అనుకొని అక్రమంగా నిర్మిస్తున్న కట్టడాలు



స్థానిక వైసీపీ నాయకులు కబ్జాచేసిన ఇరిగేషన్ స్థలం

పల్లెలకు అందని వైద్యం

● గత ప్రభుత్వ హయాంలో ప్రచారానికే పరిమితం
● కూటమి సర్కార్‌పైనే ఆశలు

వరికుంటపాడు, సెప్టెంబరు 4: పల్లెల్లో మెరుగైన వైద్య సేవలు అందించాలనే సంకల్పంతో గత వైసీపీ ప్రభుత్వం విలేజ్ హెల్త్ క్లీనిక్‌లకు శ్రీకారం చుట్టింది. అయినా ఏళ్ల తరబడి భవనాలను నిర్మించలేక పోయింది. పలు గ్రామాల్లో నిలిచిన పనులు ప్రభుత్వం మారినా వెక్కిరిస్తూనే ఉన్నాయి. ఈ నేపథ్యంలో పల్లె ప్రజలకు వైద్యసేవలు ప్రచారానికే పరిమితమయ్యాయనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

వైసీపీ పాలనలో జిల్లావ్యాప్తంగా 497 భవనాలకు రూ. 85కోట్లను మంజూరు చేశారు. ఇంతవరకు కేవలం 140 భవనాలను మాత్రమే పూర్తిచేశారు. ఉదయగిరి నియోజకవర్గ పరిధిలోని 93 సచివాలయాల పరిధిలో తొలి విడతగా ఒక్కో కేంద్రానికి రూ. 17.50 లక్షలతో 82 కేంద్రాలను మంజూరు చేశారు. దీంతో చిన్నపాటి వైద్యసేవలకైనా సరే ఇతర దూర ప్రాంతాలకు పరుగులు తీయాల్సిన దుస్థితి లేకుండా పోతుందని పల్లె ప్రజలు సంబరపడ్డారు. అయితే 54 భవనాలు మాత్రమే పూర్తయ్యాయి. నిధులు విడుదల కాక పలు ప్రాంతాల్లో కాంట్రాక్టర్లు ఇంతవరకు ఆ భవనాలను అధికారులకు అప్పగించనేలేదు. దీంతో చేసేదేమిలేక సిబ్బంది స్వంత నిధులు వెచ్చించి అద్దె భవనాల్లో అరకొర వైద్య సేవలు అందిస్తున్నారు.

● బిల్లుల భయం

అప్పట్లో సకాలంలో బిల్లులు మంజూరవుతాయో, లేదో అన్న భయంతోనే కాంట్రాక్టర్లు పనులు చేపట్టేందుకు ముందుకు రాలేదు. దీంతో పలు ప్రాంతాల్లో పునాదుల్లోనే భవనాలు ఆగాయి. ఇదిలా ఉండగా, వైసీపీ నాయకులే కాంట్రాక్టర్ల అవతారం ఎత్తినా ఫలితం లేకుండా పోయింది. దీంతో పల్లె వైద్యం ప్రజలకు అందని ద్రాక్షగానే మిగిలింది. ఈ క్రమంలో తమగోడు ఎవరికి చెప్పుకోవాలో తెలియని అయోమయ పరిస్థితుల్లో కొట్టుమిట్టాడుతున్న ప్రజలకు కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టడం వరంగా మారింది. ప్రస్తుత ప్రభుత్వం వైద్యరంగానికి పెద్దపీట వేస్తుందనే నమ్మకంతో ప్రజలు ఉన్నారు. ఆ దిశగా పాలకులు శ్రద్ధ తీసుకోవాలి.


కాంచెరువులో పునాదుల్లోనే నిలిచిన విలేజ్ హెల్త్ క్లీనిక్ భవనం

వాటర్‌ప్లాంట్ ప్రారంభం

చేజర్ల, సెప్టెంబరు 4 : మండలంలోని రెడ్డివారికండ్రికలో బుధవారం వాటర్‌ప్లాంటును ఎంపీపీ తూమాటి విజయభాస్కర్‌రెడ్డి ప్రారంభించారు. ధరణి సేవా సమితి ఆధ్వర్యంలో అరబిందో ఫార్మా ఫౌండేషన్ ఆర్థిక సాయంతో దీన్ని ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు బాలిరెడ్డి సుధాకర్‌రెడ్డి, ఎంపీటీసీ సభ్యులు కృష్ణారెడ్డి, కేంద్ర పర్యావరణ, అటవీ మంత్రిత్వశాఖ పారిశ్రామిక అనుమతుల కమిటీ సభ్యుడు యల్లాల వెంకటరామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

చవితి వేడుకలకు అనుమతులు తప్పనిసరి

ఉదయగిరి రూరల్, సెప్టెంబరు 4: గ్రామాల్లో చవితి వేడుకల నిర్వహణకు అనుమతులు తప్పనిసరని ఎస్‌ఐ కర్నాటి ఇంద్రసేనారెడ్డి తెలిపారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ అనుమతులకు సింగిల్‌విండో విధానం ద్వారా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. విగ్రహాల ఏర్పాటు నుంచి నిమజ్జనం వరకు పోలీసులకు సహకరించాలన్నారు. శాంతియుతంగా ఉత్సవాలు నిర్వహించుకోవాలన్నారు. ఏమైనా సమస్యలు ఉంటే తమ దృష్టికి తీసుకురావాలని తెలిపారు.

నేడు వ్యవసాయ సహాయకులకు శిక్షణ

ఉదయగిరి రూరల్, సెప్టెంబరు 4: వ్యవసాయ సబ్‌డివిజన్ పరిధిలోని సీతారామపురం, ఉదయగిరి, వరికుంటపాడు, దుత్తలూరు, మర్రిపాడు మండల రైతుసేవా కేంద్రాల్లో పనిచేస్తున్న గ్రామ వ్యవసాయ, ఉద్యాన, సెరికల్చర్ సహాయకులకు సామర్థ్యం పెంపుపై గురువారం స్థానిక స్త్రీశక్తి భవనంలో శిక్షణ నిర్వహించనున్నట్లు వ్యవసాయ సహాయ సంచాలకులు పీ.చెన్నారెడ్డి ఓ ప్రకటనలో పేర్కొన్నారు. జిల్లా వనరుల, కృషి విజ్ఞాన కేంద్రాల నుంచి శాస్త్రవేత్తలు హాజరై శిక్షణ ఇస్తారన్నారు. అన్నిమండలాల గ్రామ వ్యవసాయ సహాయకులు హాజరు కావాలని ఆయన తెలిపారు.

సీఐ బాధ్యతల స్వీకరణ



ఉదయగిరి రూరల్, సెప్టెంబరు 4: సీఐగా ఎన్.వెంకటరావు బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పనిచేస్తున్న వేల్పుల గిరిబాబు బదిలీపై నెల్లూరు వీఆర్‌కు వెళ్లారు. ఈ సందర్భంగా వెంకటరావు మాట్లాడుతూ సర్కిల్ పరిధిలో శాంతిభద్రతల పరిరక్షణకు చర్యలు తీసుకోవడంతోపాటు ఫ్రెండ్లీ పోలీసుల విధానాన్ని అమలు చేస్తామన్నారు. అనంతరం ఆయన్ను పలువురు సిబ్బంది అభినందించారు.

భక్తి శ్రద్ధలతో జెండా ఉత్సవం

అనంతసాగరం, సెప్టెంబరు 4: స్థానిక మష్కూర్ అలిషా ఖాదరీ దర్గాలో బుధవారం మహమ్మద్ ప్రవక్త జన్మించిన రబీవల్ అవ్వల్ నెల ప్రారంభం సందర్భంగా జెండా ఉత్సవాన్ని భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. ఈనెల 27, 28, 29 తేదీల్లో జరిగే గంధోత్సవ గోడపత్రికలను విడుదల చేశారు. దర్గాను విద్యుత్ దీపాలతో అలంకరించి, భక్తులకు అన్నదానం చేశా రు. కార్యక్రమంలో దర్గా నిర్వాహకులు సాని సాహెబ్, మజీద్ సాహెబ్ తదితరులు పాల్గొన్నారు.


విద్యుత్ దీపాలతో మష్కూర్ అలిషా దర్గా

వరద బాధితులను ఆదుకోండి

సీతారామపురం, సెప్టెంబరు 4 : విజయవాడ వరద బాధితులను ప్రభుత్వంతోపాటు దాతలు ఆదుకోవాలని జనసేన పార్టీ ఉదయగిరి నియోజకవర్గ ఇన్‌చార్జి భోగినేని కాశీరావు కోరారు. బుధవారం జనసేన కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. ఇప్పటికే మంత్రులు, ఎమ్మెల్యేలు ముంపు ప్రజలకు అండగా నిలవడం అభినందనీయమన్నారు. శుక్రవారం తుపాన్ ఉందని వాతావరణ శాఖ హెచ్చరించినందున ప్రభుత్వం ముందస్తు చర్యలు చేపట్టాలన్నారు.

బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం

వింజమూరు, సెప్టెంబరు 4: మండలంలోని గుండెమడగలకి చెందిన వేములపాటి మహేష్ ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన విషయం విదితమే. ఆయన కుటుంబానికి సీనియర్ జర్నలిస్టు గడ్డం ఫకీరయ్య బుధవారం రూ.10వేలు ఆర్థిక సహాయం అందజేశారు. జర్నలిస్టు మాధవ, బాధిత కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

ఎస్‌ఐని కలిసిన టీడీపీ ఎస్సీ సెల్ నాయకులు

వింజమూరు, సెప్టెంబరు 4 : కొత్తగా బాధ్యతలు చేపట్టిన ఎస్‌ఐ వీరప్రతాప్‌ని మండల టీడీపీ ఎస్సీ నేతలు బుధవారం మర్యాదపూర్వకంగా కలిసి శాలువా, పూలమాలతో సత్కరించారు. అనంతరం వారు మాట్లాడుతూ మండలంలోని ఎస్సీ, ఎస్టీలపై దాడులను అరికట్టాలని, చట్టాలపై అవగాహన కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎస్సీ సెల్ సీనియర్ నాయకులు గంగపట్ల హజరత్తయ్య, మండల కన్వీనర్ గంగపట్ల వెంగయ్య పాల్గొన్నారు.

ఎస్‌ఐ మహబూబ్ సుభానీకి సన్మానం

లింగసముద్రం, సెప్టెంబరు 4 : లింగసముద్రం ఎస్‌ఐ మహబూబ్ సుభానీని టీడీపీ తెలుగు యువత మండల ప్రధాన కార్యదర్శి బోడి సురేష్ బుధవారం పోలీస్‌స్టేషన్‌లో మర్యాదపూర్వకంగా కలిశారు. ఆయనకు శాలువా కప్పి సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు.

ప్రతి ఒక్కరికి పని కల్పించాలి

ఉదయగిరి రూరల్, సెప్టెంబరు 4: ఉపాధి హామీ పథకంలో ప్రతీ ఒక్కరికి పని కల్పించాలని ఎంపీడీవో డీ ఈశ్వరమ్మ, ఏపీవో శ్రీనివాసులు పేర్కొన్నారు. బుధవారం స్థానిక స్త్రీశక్తి భవనంలో ఉపాధి సిబ్బందితో సమీక్ష నిర్వహించారు. వారు మాట్లాడుతూ మండలంలో ప్రతిరోజు ఐదువేల మందికి పని కల్పించడమే లక్ష్యమన్నారు. ప్రతి పంచాయతీలో ఉపాధి పనులు ప్రారంభించాలన్నారు. హార్టికల్చర్ పథకంలో భాగంగా రైతులకు అవగాహన కల్పించి పండ్లతోటల విస్తీర్ణాన్ని పెంచాలన్నారు. మండలంలో పెండింగ్‌లో ఉన్న పక్కాగృహాల బేస్‌మెంట్ లెవల్ బిల్లుల ప్రతిపాదనలను పంపాలని తెలిపారు.


మాట్లాడుతున్న ఎంపీడీవో ఈశ్వరమ్మ

మొక్కలు నాటి సంరక్షించాలి

ఉదయగిరి రూరల్, సెప్టెంబరు 4: పెరుగుతున్న వాయు కాలుష్య నివారణకు ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి వాటి సంరక్షించాలని మేకపాటి గౌతంరెడ్డి ప్రభుత్వ వ్యవసాయ కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ కృష్ణారెడ్డి పేర్కొన్నారు. బుధవారం కళాశాల ఆవరణలో ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో పర్యావరణ పరిరక్షణ కార్యక్రమంలో భాగంగా మొక్కలు నాటే కార్యక్రమాన్ని చేపట్టారు. ఆయన మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యతని, ప్రకృతిని కాపాడే దిశగా ప్రతి అడుగు ముందుకు సాగాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్ ఎస్ అధికారి డాక్టర్ రమేష్, హాస్టల్ వార్డెన్ బాలచంద్ర, ప్రొఫెసర్లు నారాయణస్వామి, కిషన్‌తే జ, శోభ, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.


మొక్క నాటుతున్న కళాశాల అసోసియేట్ డీన్ కృష్ణారెడ్డి

గురుకుల పాఠశాలకు మొక్కల అందజేత

సంగం, సెప్టెంబరు 4: స్థానిక బాలికల గురుకుల పాఠశాలకు బుధవారం సంగం గ్రామానికి చెందిన వేమా మల్లికార్జునరావు 30 పండ్ల మొక్కలను అందజేశారు. మామిడి, పనస, సీతాఫలం, జామ, కొబ్బరి మొక్కలను ప్రిన్సిపాల్ సుమతికి అందించారు. త్వరలో పాఠశాలకు సిమెంటు బల్లలను అందిస్తానని ఆయన హామీ ఇచ్చారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి శ్రీకాంత్ పాల్గొన్నారు.


మొక్కలు అందించిన దాత మల్లికార్జునరావు

ఉత్తమ ఉపాధ్యాయుల ఎంపిక

ఉదయగిరి రూరల్, సెప్టెంబరు 4: పట్టణానికి చెందిన ఉపాధ్యాయ దంపతులు జిల్లాస్థాయి ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికయ్యారు. మండలంలోని బోడబండ ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయుడిగా పని చేస్తున్న షేక్ ఖాదర్‌బాషా, పట్టణంలో పనిచేస్తున్న ఆయన సతీమణి పఠాన్ సందానీబేగం జిల్లా ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికయ్యారు. వారి ఎంపిక పట్ల ఉపాధ్యాయులు, బంధుమిత్రులు వారికి అభినందనలు తెలిపారు.

సీతారామపురం : మండల పరిధిలో ఉత్తమ ఉపాధ్యాయులుగా సీతారామపురం జడ్పీ ఉన్నత పాఠశాల నుంచి షేక్ అంజాద్‌బాషా, పండ్రంగి ఎంపీపీ స్కూల్ నుంచి బాలిరెడ్డి, పబ్బులేటిపల్లి ఎంపీపీ స్కూల్ నుంచి ఎం. మహేష్, గంగవరం ఎంపీపీ స్కూల్ నుంచి జే వెంకటేశ్వర్లు, రంగనాయుడుపల్లి ఉర్దూ స్కూల్ నుంచి షేక్ జరీనాబేగం ఎంపిక అయ్యారని ఎంఈవో మస్తాన్‌వలి తెలిపారు. వీరికి గురువారం మధ్యాహ్నం 2గంటలకు ఎంపీడీవో ఆఫీస్‌లో సన్మానం చేస్తామని తెలిపారు.

కందుకూరు : మండలంలోని పలుకూరు మండల పరిషత్ ప్రా థమిక పాఠశాలలో పనిచేస్తున్న పవని రమేష్ జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డుకు ఎంపికయ్యారు. ఈ మేరకు జిల్లా విద్యాశాఖ కార్యాలయం నుంచి ఉత్తర్వులు వెలువడ్డాయి. ఈ సందర్భంగా బుధవారం రమేష్‌ను పాఠశాల ఉపాధ్యాయులు, విద్యాశాఖ అధికారులు, గ్రామస్థులు సత్కరించారు.


కందుకూరు : రమేష్‌ను సత్కరిస్తున్న ఉపాధ్యాయులు

వలేటివారిపాలెం : మండలంలోని అయ్యవారిపల్లె ఎంపీయూపీ స్కూల్‌లో ఎస్‌జీటీ ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్న ముతకని హనుమంతరావు జిల్లా ఉత్తమ ఉపాధ్యాయుడిగా ఎంపికయ్యారు. ఈయనను ఎంఈవోలు రవికుమార్, మల్లికార్జునలతో పాటు సహోపాధ్యాయులు అబినందించారు.

పౌష్టికాహారంపై అవగాహన


సంగం, సెప్టెంబరు 4: మండలంలోని రాళ్లచెలికలో బుధవారం పౌష్టికాహార మహోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ర్యాలీ చేశారు. గర్భిణీలు, బాలింతలు తీసుకో వాల్సిన పౌష్టికాహారంపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సీడీపీవో సునీలత, సూపర్‌వైజర్ పద్మావతి తదితరులు పాల్గొన్నారు.


సంగం : అవగాహన కల్పిస్తున్న సీడీపీవో సునీలత

అనంతసాగరం: మండలంలోని శంకరనగరంలో పోషకాహార మాసోత్సవం జరిగింది. గర్భిణీలు తీసుకోవల్సిన జాగ్రత్తలు, ఆహారంపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సీడీపీవో పద్మావతి పాల్గొన్నారు.

కావలి రూరల్ : గర్భిణులు, బాలింతలు అంగన్వాడీ కేంద్రాల్లో ఇచ్చే పౌష్టికాహారంతో ఆరోగ్యంగా ఉంటారని రుద్రకోట సెక్టార్ సూపర్‌వైజర్ కృపమ్మ పేర్కొన్నారు. కావలి మండలం రుద్రకోట బీసీ సెంటర్‌లో పౌష్టికాహార మాసోత్సవాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ కార్యకర్తలు రాజేశ్వరి, దయమ్మ, అరుణ, సుకన్య, పద్మ, తదితరులు పాల్గొన్నారు.

లింగసముద్రం : మండలంలోని మొగిలిచెర్ల పంచాయతీ నారసింహాపురం అంగన్‌వాడీ కేంద్రంలో పోషకాహార మాసోత్సవాలు నిర్వహించారు. గర్భిణులకు సీమంతం నిర్వహించారు. కార్యక్రమంలో లింగసముద్రం సెక్టార్ అంగన్‌వాడీ సూపర్‌వైజర్ రాధాదేవి, అంగన్‌వాడీ కార్యకర్తలు మార్తమ్మ, ప్రసన్న, సులోచన, శ్రీదేవి, ఓబులమ్మ పాల్గొన్నారు.


లింగసముద్రం : గర్భిణులకు సీమంతం నిర్వహిస్తున్న సూపర్‌వైజర్ రాధాదేవి

వలేటివారిపాలెం : మండలంలోని నూకవరం, పోకూరు అంగన్‌వాడీ కేంద్రాల్లో పౌష్టికాహార మాసోత్సవాలు నిర్వహించారు. గర్భిణులు, బాలింతలకు ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సునీత అవగాహన కల్పించారు. అనంతరం పిల్లలను బరువు వేసి, అక్షరభ్యాసం చేయించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ స్కూల్ ఉపాధ్యాయిని సుధారాణి, ఏఎన్‌ఎం అనీత, అంగన్‌వాడీ కార్యకర్తలు ధనలక్ష్మీ, అలేఖ్య పాల్గొన్నారు.

బిట్రగుంట : బోగోలు మండలం సీఆర్‌పాలెం, ముంగమూరు, కోవూరుపల్లి పంచాయతీ అంబేడ్కర్ నగర్ అంగన్‌వాడీ కేంద్రాల్లో పౌష్టికాహార మాసోత్సవాలు నిర్వహించారు. గర్భిణులకు సీమంతం, పిల్లలకు అన్నప్రాసన కార్యక్రమాలు చేపట్టారు. ఈ కార్యక్రమంలో సీడీపీవో సౌజన్య, సూపర్‌వైజర్లు సుభాషిణి, కోటేశ్వరి, సుప్రజ, హెచ్‌ఎం విజయలక్ష్మి, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

మురుగు కాలువ ఏర్పాటు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

కావలి రూరల్, సెప్టెంబరు 4: కావలి పట్టణం వెంగయ్యగారిపాలెంలో బుధవారం ఎక్స్‌కవేటర్‌తో మురుగు నీటి కాలువ తవ్వించారు. ఆంధ్రజ్యోతి దినపత్రికలో ఈనెల 1వ తేదీన కాలువల ఆక్రమణ.. నిలిచిన మురుగు అనే కథనం ప్రచురితమైంది. గత ప్రభుత్వంలో వైసీపీ నేతలు పంట కాలువలు ఆక్రమించారు. పట్టణం నుంచి వచ్చే వర్షపు నీరు, మురుగు నీరునీటిని పొలాలకు మళ్లించారు. దీంతో ఆ ప్రాంతంలోని పట్టాభూముల యజమానులు ఇటు కాలువ లేకుండా మురుగు నీరు దారి మళ్లించడమేమిటని కాలువ కొంత భాగం పూడ్చివేశారు. దీంతో మురుగు నీరు మొత్తం కాలువలో నిల్వచేరి పొంగి పొర్లు తుండటంతో దుర్గంధం భరించలేక రోగాల పాలవుతున్నామని స్థానికులు వాపోయారు. ఆంధ్రజ్యోతిలో వచ్చిన కథనానికి స్పందించిన మున్సిపల్ కమిషనర్ జి.శ్రావణ్ కుమార్ సంఘటనా స్థలాన్ని పరిశీలించి ఎక్స్‌కవేటర్‌తో మురుగు నీరు కాలువ తీయించడంతో పాటు తూములు వేయించి మురుగు నీటిని కావలమ్మ గుంటకు దారి మళ్లించారు. కమిషనర్ సత్వరం స్పందించి కాలువ ఏర్పాటు చెయ్యటం పట్ల స్థానికులు కమిషనర్‌కు, ఆంధ్రజ్యోతికి కృతజ్ఞతలు తెలిపారు.


వెంగయ్యగారిపాలెంలో ఎక్స్‌కవేటర్‌తో తవ్వుతున్న కాలువ

మున్సిపల్ కమిషనర్ అనూష బాధ్యతల స్వీకరణ

కందుకూరు, సెప్టెంబరు 4: కందుకూరు మున్సిపల్ కమిషనర్‌గా కొర్రపాటి అనూష బుధవారం బాధ్యతలు స్వీకరించారు. తెనాలి నగర కార్పొరేషన్‌లో విధులు నిర్వహిస్తున్న ఆమె బదిలీపై వచ్చారు. ఆమెను టీడీపీ పట్టణ అధ్యక్షుడు దామా మల్లేశ్వరరావు ఆధ్వర్యంలో టీడీపీ నాయకులు ముచ్చు శ్రీను, వడ్డెళ్ల రవిచంద్ర, చిలకపాటి మధు, బెజవాడ ప్రసాదు, షేక్ రఫీ, షేక్ సలాం, సవిడిబోయిన వెంకటకృష్ణ, మహర్షి శ్రీను తదితరులు మర్యాదపూర్వకంగా కలిసి అభినందనలు తెలిపారు.


కమిషనర్‌ను అభినందిస్తున్న టీడీపీ నాయకులు

అధికారులు తప్పు చేసి గిరిజన ఉద్యోగిని బలి చేస్తారా?

● యానాదుల సంక్షేమ సంఘం నేత పెంచలయ్య

కావలి, సెప్టెంబరు 4: కావలి తహసీల్దారు కార్యాలయంలో ఆఫీస్ సబార్డినేట్‌గా పని చేస్తున్న గిరిజన ఉద్యోగి చలంచర్ల సాయిబాబా ఉద్యోగ విరమణ విషయంలో అధికారులు తప్పుచేసి ఆ ఉద్యోగిని బలిచేస్తారా అని యానాదుల సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కేసీ పెంచలయ్య ప్రశ్నించారు. దీనిపై సమగ్ర విచారణ జరిపి న్యాయం చేయకపోతే ఈ నెల 9వ తేదీ నుంచి కావలి ఆర్డీవో కార్యాలయం వద్ద ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. కావలి జర్నలిస్ట్‌క్లబ్‌లో బుధవారం జరిగిన విలేకరుల సమావేశంలో బాధిత ఉద్యోగి సాయిబాబాతో కలిసి యానాదుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎస్టాబ్లిష్ క్లర్క్ ఆధీనంలో ఉండే ఎస్ఆర్‌లో వివరాలను ఇతరులు దిద్దేందుకు ఎలా అవకాశం ఉంటుందని ప్రశ్నించారు. పుట్టిన తేదీన దిద్ది రెండేళ్ల ఎక్కువగా గిరిజన ఉద్యోగి ఉద్యోగంలో కొనసాగాడని గిరిజన ఉద్యోగిపై పోలీసు కేసు పెట్టి ఆయనను బలిచేయాలని ప్రయత్నించడం తగదన్నారు. ఈ కార్యక్రమంలో బాధిత ఉద్యోగి సతీమణి, మున్సిపల్ మాజీ చెర్‌పర్సన్ చలంచర్ల దేవసేన, యానాదుల సంక్షేమ సంఘం నాయకులు మానికల మురళి, మాకాని రవీంద్రబాబు, చెంబేటి ఉష, తిరువీది సతీష్‌చంద్ర, చలంచర్ల కలుగోలమ్మ, కత్తి ఆదిశేషయ్య తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ బోరు ఆక్రమణ

కొండాపురం, సెప్టెంబరు 4: మండలంలోని నేకునాంపేటలో కాలనీకి తాగునీటికి ఆర్‌అండ్‌బీ రోడ్డుకు పక్కన ఏర్పాటు చేసిన ప్రభుత్వ బోరు పంపును తొలగించి గ్రామానికి చెందిన బ్రహ్మారెడ్డి మోటారు బిగించి తన వ్యక్తిగత పనులకు అక్రమంగా వాడుకుంటున్నారని కాలనీ వాసులు ఆరోపించారు. దీనిపై మూడు రోజుల క్రితం ఎంపీడీవో ఎం.బ్రహ్మయ్యకు ఫిర్యాదు చేయగా మోటారును తొలగించి పంపును బిగించాలని సిబ్బందికి చెప్పినా వారు దానిని పట్టించుకోలేదని ఆవేదన వ్యక్తం చేశారు. అధికారులు స్పందించి బోరుకు పంపును బిగించి కాలనీవాసుల నీటి సమస్యను తీర్చాలని కాలనీ వాసులు రొడ్డా యెహాన్, ఎస్.నారాయణ, ఎన్.యెహాన్. గజేంద్ర, చిరంజీవి, ప్రసాదరావు కోరారు.


ప్రభుత్వ బోరుకు బిగించిన మోటారు

నిత్యావసర ధరలు తగ్గించాలని సీపీఐ ధర్నా

కావలి, సెప్టెంబరు 4: నిత్యావసర వస్తువుల ధరలు తగ్గించి ప్రజాపంపిణీ వ్యవస్థను పటిష్టపరచాలని సీపీఐ జిల్లా కార్యదర్శి దామా అంకయ్య తెలిపారు. సీపీఐ జాతీయ సమితి పిలుపు మేరకు బుధవారం కావలి సీపీఐ ఆధ్వర్యంలో స్థానిక బ్రిడ్జి సెంటర్‌లో ధర్నా చేశారు. ఈ సందర్భంగా జిల్లా కార్యదర్శి దామా అంకయ్య మాట్లాడారు. ఈ కార్యక్రమంలో సీపీఐ సీనియర్ నాయకులు బలిజేపల్లి వెంకటేశ్వర్లు, దమ్ము దర్గా బాబు, పీ బోసు, కే. నరసింహారావు పాల్గొన్నారు.



బ్రిడ్జి సెంటర్‌లో ధర్నా చేస్తున్న సీపీఐ నేతలు

సీజనల్ వ్యాధుల నివారణకు చర్యలు తీసుకోవాలి

కావలిటౌన్, సెప్టెంబరు 4: సీజనల్ వ్యాధుల నివారణకు చర్యలు తీసుకోవాలని సీపీఎం నేతలు బుధవారం ఆర్డీవో శీనానాయక్‌కు వినతిపత్రం అందించారు. ఆ పార్టీ పట్టణ కార్యదర్శి పీ.పెంచలయ్య మాట్లాడుతూ సీజనల్ వ్యాధులు వ్యాప్తి చెంది అనేకమంది జ్వరం, జలుబు, దగ్గు, వంటి నొప్పుల బారినపడి బాధపడుతున్నారన్నారు. పట్టణంలో పారిశుధ్యం మెరుగుకు చర్యలు చేపట్టాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు మధుసూదన్‌రావు, కృష్ణయ్య, తిరుపాల్, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

గృహనిర్మాణాలు త్వరితగతిన పూర్తి చేసుకోవాలి

కందుకూరు, సెప్టెంబరు 4: హౌసింగ్ పథకం కింద గృహాలు మంజూరైన లబ్ధిదారులు త్వరితగతిన నిర్మాణాలు పూర్తి చేసుకోవాలని హౌసింగ్ డీఈఈ సీహెచ్ శ్రీనివాసరావు కోరారు. స్థానిక ఎంపీడీవో వెలమూరి వెంకటేశ్వరరావుతో కలిసి బుధవారం ఆయన మండలంలోని కొండముడుసుపాలెంలో లబ్ధిదారులతో సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో హౌసింగ్ వర్క్‌ఇన్‌స్పెక్టర్ ఫయాజ్, ఇంజనీరింగ్ అసిస్టెంట్ ఇమ్రాన్ పాల్గొన్నారు.

పంచాయతీలకు 15వ ఆర్థిక సంఘం నిధుల మంజూరు

వలేటివారిపాలెం, సెప్టెంబరు 4 : మండలంలోని 21 పంచాయతీలకు 2024-25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి రెండవ విడతలో రూ.51,26,013 15వ ఆర్థిక సంఘం నిధులు మంజూరైనట్లు ఎంపీడీవో శేషబాబు, ఈఓఆర్డీ సుమంత్ ఓ ప్రకటనలో తెలిపారు. అమ్మపాలెం రూ.1,8,416, అంకభూపాలపురం రూ.2,55,996, అయ్యవారిపల్లె రూ.2,29,343, బడేవారిపాలెం రూ.2,33,721, చుండి రూ.3,80,098, జమీన్‌ఉప్పలపాడు రూ.1,06,416, కాకుటూరు రూ. 2,03691, కళవళ రూ.3,05482, కొండారెడ్డిపాలెం రూ.40,136, కొండసముద్రం రూ.1,63,089, లింగపాలెం రూ.1,88,518, నలదలపూరు రూ. 2,46,468, నేకునాంపురం రూ.1,66,677, నూకవరం రూ.75,947, పోకూరు రూ.5,41,461, పోలినేనిచెరువు రూ.2,85,933, పోలినేనిపాలెం రూ.2,63,960, శాఖవరం రూ.3,71,539, శామీరపాలెం రూ.2,42,430, శింగమనేనిపల్లె రూ.1,84,352, వలేటివారిపాలెం రూ.4,59,369 మంజూరైనట్లు వారు తెలిపారు.

1000 వినాయక ప్రతిమలు పంపిణీ చేస్తాం

కావలిటౌన్, సెప్టెంబరు 4: పర్యావరణ పరిరక్షణలో భాగంగా మొక్కలు మొలిసే మట్టి వినాయక ప్రతిమలు పంపిణీకి సిద్ధం చేశామని జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జ్ అళహరి సుధాకర్ పేర్కొన్నారు. బుధవారం స్థానిక జనసేన పార్టీ కార్యాలయంలో పంపిణీకి సిద్ధం చేసిన వినాయక ప్రతిమలను సుధాకర్ ప్రదర్శించి మాట్లాడుతూ 1000 వినాయక ప్రతిమలు పంపిణీకి రంగం సిద్ధం చేశామన్నారు. సుధీర్, శ్రీను, లక్ష్మీ పాల్గొన్నారు.

కొత్త ట్రాన్స్‌ఫార్మర్ల ఏర్పాటు

వలేటివారిపాలెం, సెప్టెంబరు 4 : మండలంలోని రోళ్లపాడు, బడేవారిపాలెం, వలేటివారిపాలెం, తూర్పుపోలినేనిపాలెం, వీరన్నపాలెం, నేకునాంపురం, కాకుటూరు గ్రామాలలో విద్యుత్ లోఓల్టేజి సమస్యను అధిగమించేందుకు విద్యుత్ ఏఈ తాటికొండ మధుబాబు బుధవారం కొత్త ట్రాన్స్‌ఫార్మర్లను ఏర్పాటు చేయించారు.

లైన్‌మన్‌ను నియమించాలి : మండలంలోని చుండి గ్రామానికి రెగ్యులర్ విద్యుత్ లైన్‌మన్‌ను నియమించాలని గ్రామస్థులు విద్యుత్ ఏఈ మధుబాబును కోరారు. గ్రామంలో లైన్‌మన్ లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని తెలిపారు.

ఎస్‌ఐలుగా పదోన్నతి పొందిన వారికి సత్కారం

కావలిటౌన్, సెప్టెంబరు 4: ఎస్సైలుగా పదోన్నతి పొందిన జానికిరామిరెడ్డి, మనోహర్‌రెడ్డిలను బుధవారం స్థానిక సాయిబాబా మందిర ప్రాంగణంలో బెస్ట్ వాకర్స్ అధ్యక్షుడు, విశ్రాంత ఎస్సై టీ శేషయ్య అధ్వర్యంలో శాలువాలు, పూలమాలలతో ఘనంగా సత్కరించారు. వాకర్స్ సభ్యులు టంగుటూరి ప్రసాద్, వెంకటేశ్వర్లు, రమేష్, కే.శ్రీనివాసులు, గౌస్‌బాషా, హరి, కృష్ణ పాల్గొన్నారు.


జానకిరామిరెడ్డి, మనోహర్‌రెడ్డిలను సత్కరిస్తున్న బెస్ట్ వాకర్స్

వరద సహాయక కార్యక్రమాల్లో ఉదయగిరి, కావలి ఎమ్మెల్యేలు

వింజమూరు/ కావలి, సెప్టెంబరు 4 : విజయవాడలోని వరద సహాయ కార్యక్రమాల్లో ఉదయగిరి, కావలి ఎమ్మెల్యేలు కాకర్ల సురేష్, దగుమాటి వెంకట క్రిష్ణారెడ్డి పాల్గొన్నారు. బుధవారం విజయవాడ కార్పొరేషన్ 7వ డివిజన్‌లో కాకర్ల, 17వ డివిజన్‌లో జలవనరులశాఖ మంత్రి నిమ్మల రామానాయుడితో కలసి దగుమాటి పర్యటించారు. వరద బాధితులకు అందుతున్న సేవలను తెలుసుకున్నారు. ఈ విపత్తు నుంచి ప్రజలను కాపాడేందుకు సీఎం చంద్రబాబు అహర్నిశలు కృషి చేస్తున్నారని పేర్కొన్నారు. కాకర్ల వెంట మాలేపాటి చైతన్య, మధురెడ్డి ఉన్నారు.

చికిత్స పొందుతూ టీడీపీ నేత మృతి

కలువాయి, సెప్టెంబరు 4 : మండలంలోని వెరుబొట్ల పల్లి రోడ్డులో జరిగిన ప్రమాదంలో గాయపడి, చికిత్స పొందుతూ కేశమనేనిపల్లి గ్రామ సీనియర్ టీడీపీ నాయకుడు తలపనేని శివరామయ్య బుధవారం మృతి చెందారు. గత శనివారం ఆయన రోడ్డు దాటుతుండగా ఆర్టీసీ బస్సు ఢీకొని ప్రమాదానికి గురయ్యారు. శివరామయ్య మృతి వార్త టీడీపీ శ్రేణులను దిగ్భ్రాంతికి గురి చేసింది. ఆయన మృతి పట్ల మండల టీడీపీ అధ్యక్షుడు గోనుగుంట వెంకటేశ్వర్లు నాయుడు సంతాపం తెలిపారు.


శివరామయ్య (ఫైల్)

ఇసుక ట్రాక్టర్ పట్టివేత

లింగసముద్రం, సెప్టెంబరు 4 : మండలంలోని వీఆర్ కోట గ్రామ సమీపంలోని మన్నేరు వాగులో ఇసుక అక్రమ రవాణా చేస్తున్న ట్రాక్టర్‌ను పోలీసులు పట్టుకున్నారు. బుధవారం తెల్లవారుజామున 3 గంటల సమయంలో ఎస్సై మహబూబ్ సుభాని సిబ్బందితో కలసి దాడులు నిర్వహించి ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్‌ను పట్టుకుని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఈ మేరకు డ్రైవర్‌పై కేసు నమోదు చేసినట్టు ఎస్సై తెలిపారు.

ఈ - పంట నమోదు పూర్తి చేయాలి

వలేటివారిపాలెం, సెప్టెంబరు 4 : ఈ నెల 15వ తేదీ లోపు ఈ పంట నమోదు పక్రియ పూర్తి చేయాలని కందుకూరు వ్యవసాయ సహయ సంచాలకురాలు డాక్టర్ పి.అనసూయ తెలిపారు. వలేటివారిపాలెం రైతు సేవా కేంద్రంలో బుధవారం ఏవో హేమంత్‌భరత్‌కుమార్ అధ్యక్షతన పంట కోత ప్రయోగాలపై శిక్షణ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో అన్ని గ్రామ సచివాలయాల వ్యవసాయ, ఉద్యానశాఖ సహాయకులు పాల్గొన్నారు.

జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి కృషి

కావలి, సెప్టెంబరు 4: జర్నలిస్టుల సమస్యలను రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి వాటి పరిష్కారానికి కృషి చేస్తామని ఆంధ్రప్రదేశ్ జర్నలిస్టుల యూనియన్(ఏపీజేయూ) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గాదంశెట్టి శేఖర్‌బాబు తెలిపారు. కావలి జర్నలిస్ట్‌క్లబ్‌లో బుధవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కావలి డివిజన్‌లో యూనియన్ బలోపేతం చేసేందుకు 5గురు సభ్యులను నియమించారు. ఈ సమావేశంలో జిల్లా అధ్యక్షుడు మనపాటి చక్రవర్తి, ప్రధాన కార్యదర్శి గర్రె వెంకటేశ్వర్లు, తదితరులు పాల్గొన్నారు.

పారిశుధ్య కార్యక్రమాలు చేపట్టాలి

కందుకూరు, సెప్టెంబరు 4: రానున్న వర్షాల సీజన్‌లో అంటువ్యాధులు ప్రబలే అవకాశం ఉన్నందున అన్ని గ్రామాల్లో రెండు రోజుల్లోగా ప్రత్యేక పారిశుధ్య చర్యలు చేపట్టాలని ఎంపీడీవో వెంకటేశ్వరరావు ఒక ప్రకటనలో కోరారు. ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు సూచనలకు అనుగుణంగా ప్రతి గ్రామంలో ఓవర్‌హెడ్ ట్యాంకులు, తాగునీటి వనరులను శుభ్రపరిచి క్లోరినేషన్ చేయించాలని, దోమల నిర్మూలన చర్యలలో భాగంగా ఫాగింగ్, మురుగు నీరు నిల్వ ఉన్న ప్రాంతాలలో లార్వాలను నిర్మూలించే మందు పిచికారి కార్యక్రమాలు చేపట్టాలని కోరారు. వ్యర్థాలు, చెత్తకుప్పలను తొలగించటంతో పాటు మురుగు కాల్వలను శుభ్రం చేయించాలన్నారు.

టీఆర్‌ఆర్‌లో ఇండక్షన్ ప్రోగ్రామ్

కందుకూరు, సెప్టెంబరు 4: స్థానిక టీఆర్‌ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మొదటి సంవత్సరంలో చేరిన విద్యార్థులకు బుధవారం ఇండక్షన్ ప్రోగ్రామ్ నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టరు ఎం.రవికుమార్ మాట్లాడారు. కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డాక్టరు ఏడుకొండలు నరేంద్ర, ఇండక్షన్ ప్రోగ్రాం కో ఆర్డినేటర్ కే.కరుణకుమార్, డాక్టరు కే.సుజాత, తదితరులు పాల్గొన్నారు.

నేత్రదానంపై అవగాహన

కందుకూరు, సెప్టెంబరు 4: జాతీయ నేత్రదాన పక్షోత్సవాలలో భాగంగా బుధవారం కందుకూరు ఏరియా ఆసుపత్రిలో నేత్రదానంపై అవగాహన సదస్సు నిర్వహించారు. సూపరింటెండెంట్ డాక్టరు శకుంతల ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో నేత్రవైద్యురాలు డాక్టరు సౌమ్యసవంతి నేత్రదానంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా 30 మంది మరణానంతరం నేత్రదానంకు ముందుకొచ్చి అంగీకారపత్రాలను అందజేశారు. కార్యక్రమంలో డాక్టరు ఇంద్రాణి, డాక్టరు వెంకటరెడ్డి, డాక్టరు కళ్యాణ్ తదితరులు పాల్గొన్నారు.

బ్రాహ్మణక్రాక మాజీ సర్పంచు మృతి

జలదంకి, సెప్టెంబరు 4: బ్రాహ్మణక్రాక మాజీ సర్పంచు వంటేరు రఘురామిరెడ్డి అనారోగ్యంతో నెల్లూరులోని ఓ ప్రైవేటు వైద్యశాలలో చికిత్స పొందుతూ బుధవారం తెల్లవారుజామున మృతి చెందారు. ఈయన మృతికి ఆయన సోదరులు మాజీ ఎమ్మెల్యే వంటేరు వేణుగోపాల్ రెడ్డి, మాజీ జడ్పీటీసీ వంటేరు జయచంద్రారెడ్డితో పాటు అన్ని రాజకీయపార్టీల మండల నాయకులు తమ ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేశారు.

వరద బాధితులను ఆదుకోవాలి

బిట్రగుంట, సెప్టెంబరు 4: విజయవాడ పరిసర ప్రాంతాల్లోని వరద బాధితులను ఆదుకోవాలని సీపీఎం మండల కార్యదర్శి తుమ్మల వెంకయ్య అన్నారు. బోగోలు మండలం ఇబ్రహీంపేటలోని సీపీఎం కార్యాలయంలో బుధవారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ వరదలో ప్రాణాలు కోల్పోయిన వారి కుటుంబాలకు రూ.25లక్షల ఆర్థిక సహాయం అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ మండల కార్యదర్శి చల్లా నరహరి, షేక్.నూరుద్దీన్, బాలనరసింహం, శ్రీనివాసులు, క్రిష్ణయ్య, అహ్మద్‌బాషా, కార్తీక్ పాల్గొన్నారు.

మట్టి గణపతులనే పూజిద్దాం

ముత్తుకూరు : మట్టి గణపతి విగ్రహాలను పూజించి పర్యావరణాన్ని కాపాడాలని అదానీ కృష్ణపట్నం పోర్టు సీఈవో జీజే రావు సూచించారు. పోర్టులో బుధవారం 1500 మట్టి గణపతి విగ్రహాలను ఉద్యోగులు, కార్మికులకు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సీఓఓ రాజన్‌బాబు, ఈహెచ్‌ఎస్ వైస్ ప్రెసిడెంట్ డాక్టర్ జ్యోతి, వేణుగోపాల్, గణేష్ శర్మ, వేణుగోపాల్‌రెడ్డి, మృత్యుంజయరామ్, తదితరులు పాల్గొన్నారు.

● అదానీ వరల్డ్ స్కూల్‌కి ఎడ్యుకేషనల్ ఎక్సలెన్స్ అవార్డు

అదానీ వరల్డ్ స్కూల్ అరుదైన ఎడ్యుకేషనల్ ఎక్సలెన్స్ అవార్డు-2024 దక్కించుకుందని హెచ్‌ఎం సత్యనారాయణ సిరియాల తెలిపారు. ఇందుకు కృషిచేసిన అధ్యాపక, సహోపాధ్యాయ బృందానికి శుభాకాంక్షలు తెలిపారు.

7, 8, 9 తేదీలలో నిమజ్జనానికి అనుమతులు లేవు

తోటపల్లిగూడూరు: కోడూరు సాగర తీరంలో ఈనెల 7,8,9 తేదీలలో వినాయక నిమజ్జనానికి అనుమతులు లేవని ఎస్‌ఐ వీరేంద్రబాబు పేర్కొన్నారు. మండలంలోని పోలీస్‌స్టేషన్‌లో బుధవారం మీడియా సమావేశం నిర్వహించి ఆయన మాట్లాడుతూ వేళాంగిణి మాత ఉత్సవాలకు భక్తులు భారీగా వస్తారని, ట్రాఫిక్‌కు అవాంతరాలు ఏర్పడతాయని, కావున ఆయా తేదీలలో కోడూరు బీచ్‌లో కాకుండా కాటేపల్లి బీచ్, మైపాడు బీచ్ ఇతర ప్రాంతాలలో ఉన్న చెరువుల్లో వినాయక నిమజ్జనం చేసుకోవాలని కోరారు.

పౌష్టికాహారంపై అవగాహన ర్యాలీ

వెంకటాచలం, సెప్టెంబరు 4: పూడిపర్తిలో బుధవారం ఐసీడీఎస్ ఆధ్వర్యంలో పౌష్టికాహారంపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. కార్య క్రమంలో జడ్పీ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు దివాకర్, సచి వాలయం పోలీస్ లక్ష్మీప్రసన్న, తదితరులు పాల్గొన్నారు.











పెన్నా కరకట్టలను పటిష్టం చేయండి

● ఆర్డీవోకి ముంపు ప్రాంతవాసుల వినతి


పెన్నా పొర్లుకట్టలను పరిశీలిస్తున్న ఆర్డీవో శీనానాయక్

విడవలూరు, సెప్టెంబరు 4: రాష్ట్రంలో విస్తారంగా వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో బలహీనంగా ఉన్న పెన్నా కరకట్టలను పటిష్టం చేసి వరద ముంపు నుంచి కాపాడాలని ఊటుకూరు, ముదివర్తి గ్రామవాసులు కావలి ఆర్డీవో శీనానాయక్‌కి విన్నవించుకున్నారు. ఊటుకూరు, ముదివర్తి పెన్నా పొర్లుకట్టలను బుధవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా టీడీపీ నాయకుడు బెజవాడ వంశీకృష్ణారెడ్డి మాట్లాడుతూ పెన్నా పొర్లుకట్టలపై ఆక్రమణలు తొలగించి కరకట్టలకు మరమ్మతులు చేపట్టాలని కోరారు. అదేవిధంగా ముదివర్తిలో టీడీపీ నాయకుడు ఎస్‌కె రఫీ మాట్లాడుతూ పెన్నానది నుంచి ఇసుక అక్రమంగా తరలిస్తున్న కొందరు పొర్లుకట్టలను ధ్వంసం చేశారని, అక్కడికి దారిని పూర్తిగా మూసివేయాలని కోరారు. ఇందుకు స్పందించిన ఆర్డీవో అధికారులతో చర్చించి పెన్నా పొర్లుకట్టల మరమ్మతులు చేపడతామన్నారు. అదేవిధంగా సర్వే నిర్వహించి ఆక్రమణలు తొలగిస్తామన్నారు. ఆయన వెంట ఇన్‌చార్జ్ తహసీల్దారు భాను ప్రకాష్ తదితరులు ఉన్నారు.

వైసీపీ నేతలు టీడీపీలో చేరిక


విక్రమ్‌రెడ్డిని టీడీపీలోకి ఆహ్వానిస్తున్న సోమిరెడ్డి

ముత్తుకూరు, సెప్టెంబరు 4: దొరువులపాలెం పంచాయతీకి చెందిన వైసీపీ నేతలు మారంరెడ్డి విక్రమ్‌రెడ్డి, ఇసనాక విష్ణువర్ధన్ రెడ్డి, సన్నారెడ్డి శ్రీనివాసులురెడ్డి, దువ్వూరు గోపాల్‌రెడ్డి బుధవారం టీడీపీలో చేరారు. వారికి సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి ఆహ్వానించి అభినందించారు.

వంతెనకు మరమ్మతులు

ఇందుకూరుపేట, సెప్టెంబరు 4: మండలంలోని యాగర్ల వద్ద వంతెన గత ప్రభుత్వంలో పూర్తిగా దెబ్బతినడంతో దానికి బదులుగా తాత్కాలికంగా నిర్మించిన వంతెనపై రాకపోకలకు ప్రయాణికులు ఇబ్బంది పడుతున్నారు. స్థానిక టీడీపీ నాయకుడు కళ్యాణ్‌రెడ్డి కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి దృష్టికి సమస్యను తీసుకుపోగా ఆమె సొంత నిధులతో బ్రిడ్జిని బుధవారం వెడల్పు చేయించారు ఈ కార్యక్రమంలో నాయకులు చెంచుకిషోర్‌బాబు, మధుబాబు, కైలాసం శ్రీనివాసులురెడ్డి, కేతిరెడ్డి అవినాష్‌రెడ్డి, ఇరిగేషన్ డీఈ విజయ భాస్కర్‌రెడ్డి, ఆర్‌అండ్‌బీ డీఈ, ఏఈలు పాల్గొన్నారు.

మహాజన సభను జయప్రదం చేయండి

ముత్తుకూరు, సెప్టెంబరు 4: కృష్ణపట్నం ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ఆధ్వర్యంలో గురువారం నిర్వహించనున్న మహాజన సభను జయప్రదం చేయాలని పీఏసీఎస్ సీఈవో వెంకటాద్రి కోరారు. ముత్తుకూరులో ఉన్న సహకార సంఘం కార్యాలయంలో బుధవారం ఆయన మాట్లాడుతూ సొసైటీ పరిధిలోని సభ్యులందరికీ సొసైటీ ద్వారా జరుగుతున్న అభివృద్ధి తదితర అంశాలను తెలియజేస్తామన్నారు. సొసైటీ పరిధిలోని సభ్యులంతా జనసభకు తప్పనిసరిగా హాజరుకావాలన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

వెంకటాచలం, సెప్టెంబరు 4: సర్వేపల్లి రైల్వే గేటు సమీపంలో కృష్ణపట్నం పోర్టు రోడ్డుపై బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు గాయపడ్డారు. స్థానికులు తెలిపిన వివరాల మేరకు.. గూడూరు రూరల్ మండలం చెన్నూరు ప్రాంతానికి చెందిన శీనయ్య, సురేష్ మోటార్‌బైక్‌పై పంటపాళెంకు వెళ్లి తిరిగి ఇంటికి వెళ్తుండగా సర్వేపల్లి గేటు దాటిన తర్వాత పోర్టురోడ్డుపై గేదెలు అడ్డురావడంతో బైక్ అదుపుతప్పి బోల్తాపడింది. ఈప్రమాదంలో వారు స్వల్పంగా గాయపడ్డారు. క్షతగాత్రులను చికిత్స నిమిత్తం సర్వేపల్లిలోని ఒక ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

పూర్వ విద్యార్థినికి బహుమతి ప్రదానం

కోవూరు, సెప్టెంబరు 4: స్థానిక టీఎన్‌సీ జూనియర్ కళాశాల విద్యార్థిని జి గౌరీకి కళాశాల అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది బుధవారం నగదు బహుమతి అందించారు. అమరావతిలోని విట్ కళాశాలలో ప్రవేశం పొందిన ఆమెను ప్రిన్సిపాల్ సికిందర్ అభినందించారు. రూ. 20వేలు, కాలేజీ బ్యాగు, ప్రయాణం చేసేందుకు బ్యాగు అందించారు. ఈకార్యక్రమంలో అధ్యాపకులు ఎల్సీ రమణారెడ్డి, విజయలక్ష్మి, శ్రీధర్ పాల్గొన్నారు. అలాగే గత ఏడాది ఇంటర్మీడియట్‌లో అధిక మార్కులు సాధించిన దిల్షాద్‌కు, మరో 14 మంది విద్యార్థులకు బహుమతులు అందించారు.

వర్షానికి దెబ్బతిన్న వరిపైరు

బుచ్చిరెడ్డిపాళెం, సెప్టెంబరు 4: మూడు రోజులుగా కురుస్తున్న వర్షానికి మండలంలోని రెండోకారు వరిపంట నేలవాలి దిబ్బతింటోందని రైతులు ఆందోళన చెందుతున్నారు. పంట చేతికొస్తున్న తరుణంలో కురుస్తున్న చిన్నపాటి వర్షానికి తడిసి నేలవాలుతున్నాయని, వర్షం ఇలానే వుంటే మొలకలొస్తాయని రైతులు వాపోతున్నారు. కొంతమంది రైతులు వర్షంలోనే వరికోతలు కోసి ధాన్యాన్ని వచ్చినకాడికి అమ్ముకుని సొమ్ముచేసుకుంటున్నారు.

హత్యాయత్నం కేసులో నిందితుల అరెస్టు

మనుబోలు, సెప్టెంబరు 4: హత్యాయత్నం కేసులో ఇద్దరు నిందితులను అరెస్టు చేసినట్లు ఎస్‌ఐ ఎంఎస్ రాకేష్ బుధవారం తెలిపారు. జూలై 28న మనుబోలుకు చెందిన మొలకల శశిధర్‌రెడ్డిపై తిరుపతి జిల్లా గూడూరు రూరల్ మండలం వెందోడు గ్రామానికి చెందిన హర్షవర్ధన్‌రెడ్డితో పాటు మరో ముగ్గురు యువకులు కత్తులతో దాడిచేసిన సంగతి విదితమే. ఈ కేసులో గూడూరు నాయుడు కాలువకట్టకు చెందిన కంచర్ల ధనరాజ్, చెన్నూరుకి చెందిన సిద్దా హోసన్న అలియాస్ సాయికుమార్‌లు హర్షవర్ధన్‌తో పాటు దాడి చేసేందుకు సహకరించారని గుర్తించినట్లు పోలీసులు తెలిపారు. ఈమేరకు పై ఇద్దరిని అరెస్టు చేసి కోర్టుకు తరలించామని, మరో ఇద్దరిని త్వరలోనే అరెస్టు చేస్తామని ఎస్‌ఐ తెలిపారు.

కామాక్షితాయి ఆలయ హుండీల లెక్కింపు

బుచ్చిరెడ్డిపాళెం : జొన్నవాడ ఆలయంలో బుధవారం దేవదాయ శాఖ, ఆలయ అధికారుల ఆధ్వర్యంలో హుండీల లెక్కింపు జరిగింది. ప్రధాన హుండీల ద్వారా రూ.46,17,092 మేర ఆదాయం ఆలయానికి చేకూరిందని ఆలయ ఈవో శ్రీనివాసులురెడ్డి తెలిపారు. హుండీల లెక్కింపులో జిల్లా దేవాదాయశాఖ అధికారి జే శ్రీనివాసరావు, ఇన్స్‌పెక్టర్ ఎం సుధీర్, చైర్మన్ మావులూరు శ్రీనివాసులురెడ్డి, పలువురు కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

వన్యప్రాణుల సంరక్షణ చట్టంపై అవగాహన

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

పొదలకూరు, సెప్టెంబరు 4: యథేచ్ఛగా వన్యప్రాణుల వేట అనే శీర్షికతో ఈనెల 1వ తేదీన ఆంధ్రజ్యోతి దినపత్రికలో ప్రచురిత మైన కథనానికి అటవీశాఖ అధికారులు స్పందించారు. బుధవారం నందివాయి, అమ్మవారి పాలెం, ప్రభగిరి పట్నంలలో వన్యప్రాణుల సంరక్షణ చట్టంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈసందర్భంగా దాచూరు డీఆర్‌వో ఖాజారసూల్ మాట్లాడుతూ వన్య ప్రాణులను వేటాడినా, వాటి జీవనానికి ఆటంకం కలిగించినా నేర మన్నారు. ఈసదస్సులో వావింటపర్తి, అమ్మ వారిపాలెం, పులికల్లు ఎఫ్‌బీఓలు శ్రీనివాసులు, సీహెచ్ శ్రీనివాసులు, సలీం పాల్గొన్నారు.

త్వరలో బీజేపీ సభ్యత్వ నమోదు

● నాయకులు వాకాటి, వంశీధర్‌రెడ్డి

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట), సెప్టెంబరు 4: భారతీయ జనతా పార్టీ సభ్యత్వ నమోదు కార్య క్రమంలో త్వరలో ప్రారంభమవుతుందని, దీనిని విజయవంతం చేయాలని ఆ పార్టీ రాష్ట్ర నేత వాకాటి నారాయణరెడ్డి, జిల్లా అధ్యక్షుడు శీపా వంశీధర్‌రెడ్డి పిలుపునిచ్చారు. నగరంలోని బీజేపీ జిల్లా కార్యాలయంలో బుధవారం వారు విలేకర్లతో మాట్లాడారు. దేశ వ్యాప్తంగా బీజేపీ సంస్థాగత సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని చేపట్టాలని ప్రధాని మోదీ పిలుపునిచ్చారన్నారు. జిల్లాలో 4 లక్షల సభ్యత్వాల నమోదు లక్ష్యంగా కార్యకర్తలు కృషి చేయాలని లక్ష్యనిర్దేశం చేశారు. సభ్యత్వం పొందాలనుకునే వారు 8800002024 నెంబరుకు కాల్ చేసి వివరాలు తెలియజేయాలన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు పరుశురాం, గడ్డం విజయ కుమార్, పెంచలయ్య, రాజేశ్వరి, ఎర్రబోలు రాజేష్, గురి కుమార్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

కలివెలపాళెం సర్పంచు చెక్‌పవర్ రద్దు

నెల్లూరురూరల్,సెప్టెంబరు 4 : మండలంలోని కలివెలపాళెం గ్రామ పంచాయతీ సర్పంచ్ పార్లపల్లి మధుసూదన్‌రెడ్డి చెక్ పవర్‌ను రద్దు చేస్తూ జిల్లా పంచాయతీ అధికారి సుస్మిత బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. మూడు నెలలపాటు ఆయన పంచాయతీలో ఎలాంటి ఆర్థిక లావాదేవీలు జరిపేందుకు వీలులేదని తన ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. అప్పటి వరకు ఎంపీడీవో కార్యాలయం ద్వారా ఆర్థిక లావాదేవీలు జరపవచ్చని తెలిపారు. మధుసూదన్‌రెడ్డి పంచాయతీలోని రూ. 2.30 లక్షలను సిబ్బంది జీతభత్యాల పేరిట డీపీవో ఆదేశాలు లేకుండా డ్రా చేశారు. 2022-23 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి రూ. 10.02 లక్షలను సర్పంచ్ తన భార్య శ్రావణి బ్యాంకు ఖాతాకి బదిలీ చేశారు. 2023-24 ఆర్థిక సంవత్సరంలో సీఎఫ్‌ఎంఎస్ రూల్స్‌కు విరుద్ధంగా ఆర్థిక లావాదేవీలు థర్డుపార్టీ ఖాతాలకు చెల్లించారని విచారణలో తేలింది. దీంతో ఆయన చెక్‌పవర్ రద్దు చేస్తున్నట్లు డీపీవో ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. కాగా, పెనుబర్తి, సజ్జాపురం గ్రామాల్లోనూ ఆర్థిక లావాదేవీల్లో అవకతవకలు జరిగినట్లు డీఎల్‌పీవో గుర్తించారు. అక్కడ కూడా సర్పంచ్ చెక్‌పవర్ రద్దుపై ఉత్కంఠ నెలకొంది. గొల్లకందుకూరు, దేవరపాళెం గ్రామ పంచాయతీల్లో రికార్డులు తనిఖీకి డీపీవో కార్యాలయం సిద్ధమైంది.

సబ్బుతో గణేష్ ప్రతిమ



నెల్లూరు (సాంస్కృతికం), సెప్టెంబరు 4 : గణేష్ చతుర్థి సందర్భంగా సబ్బుపై విఘ్నేశ్వర ప్రతిమను చెక్కారు సూక్ష్మ కళాశిల్పి, చింతవరం జడ్పీ హైస్కూల్ ఉపాధ్యాయుడు పోలూరు జగదీశ్వర్లు. ఆయన నెలరోజులు శ్రమించి సబ్బుపై గణపతి ప్రతిమను కళాత్మకంగా తీర్చిదిద్దారు. పర్యావరణ హితం కోసం మట్టి గణపతులనే పూజించాలని కోరుతూ జిల్లా ప్రజలకు వినాయక చవితి శుభాకాంక్షలు తెలిపారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

నెల్లూరు (జడ్పీ), సెప్టెంబరు 4: నగరంలోని వినాయక నిమజ్జనం ఘాట్ వద్ద గురువారం ట్రాన్స్‌ఫార్మర్ మార్చుతున్న సందర్భంగా విద్యుత్ సరఫరాకు అంతరాయం కలగనున్నట్లు ఆ శాఖ ఈఈ ఎం శ్రీధర్ ఓ ప్రకటనలో తెలిపారు. ట్రాన్స్‌ఫార్మర్‌తో పాటు 11కేవీ స్తంభాలు మారుస్తున్న కారణంగా శాంతినగర్, బట్వాడి పాళెం పరిసర ప్రాంతాల్లో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని, వినియోగ దారులు గుర్తించాలని కోరారు.

లాభాల బాటలో పేడూరు సొసైటీ

తోటపల్లిగూడూరు : పేడూరు సొసైటీ లాభాల బాటలో ముందంజలో ఉందని అక్టోబరు నాటికి కంప్యూటరైజేషన్ చేసి రైతులకు సొసైటీలో అన్ని వసతులు కల్పిస్తామని జిల్లా సొసైటీ అధికారి గురప్ప పేర్కొన్నారు. మండలంలోని పేడూరు సహకార బ్యాంక్ ఆధ్వర్యంలో బుధవారం మహాజన సభ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి శిరీష రాణి, ఇఫ్కో ప్రతినిధి లక్ష్మీనారాయణ, సహకార బ్యాంకు ప్రతినిధులు రవిప్రకాష్, మోహనకృష్ణ, శివకుమార్, కల్యాణ చక్రవర్తి, సీఈవో రమణమూర్తి, సొసైటీ సభ్యులు పాల్గొన్నారు.

సమస్యలు ఎప్పటికి పరిష్కరిస్తారు?

● విద్యుత్ అధికారులతో రూరల్ ఎమ్మెల్యే సమీక్ష


అధికారులతో సమీక్షిస్తున్న ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డి

నెల్లూరు రూరల్, సెప్టెంబరు 4 : రూరల్ నియోజకవర్గంలో విద్యుత్ సమస్యలు ప్రజలను వేధిస్తున్నాయని, వాటిని ఎప్పటికి పరిష్కరిస్తారని ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి ఆ శాఖ అధికారులను ప్రశ్నించారు. బుధవారం ఎమ్మెల్యే కార్యాలయంలో ఎస్‌ఈ, ఈఈ, డీఈఈ, ఏఈఈలతో సమీక్ష జరిపారు. గ్రామాలు, డివిజన్లలో లైన్‌మెన్ల సమస్య ప్రధానంగా ఉందని, దానిని వేగంగా పరిష్కరించాలని కోరారు. పర్యటనకు వెళితే ఎక్కువగా కరెంట్ సమస్యలే ప్రజలు ప్రస్తావనకు తీసుకువస్తున్నారని, వాటిని వీలైనంత త్వరగా పరిష్కరించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నేత కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి పాల్గొన్నారు.

'మెడికవర్'లో ఉపాధ్యాయులకు ఉచిత వైద్య పరీక్షలు

నెల్లూరు (వైద్యం), సెప్టెం బరు 4 : ఉపా ధ్యాయ దినోత్సవం సందర్భంగా గురువారం నుంచి ఉపాధ్యాయులకు ఉచిత వైద్య పరీక్షలు నిర్వహిస్తున్నట్లు మెడికవర్ ఆసుపత్రి నిర్వాహకులు వెల్లడించారు. బుధవారం నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కార్యాలయంలో ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి ఉపాధ్యాయుల ఉచిత వైద్య పరీక్షలపై రూపొందించిన పోస్టర్‌ను విడుదల చేశారు. ఆసుపత్రి హెడ్ డాక్టర్ ధీరజ్‌రెడ్డి, డాక్టర్ బిందురెడ్డి మాట్లాడుతూ ఉపాధ్యాయులకు రూ.5830 విలువ కలిగిన 25 రకాల వైద్య పరీక్షలు పూర్తిగా ఉచితంగా నిర్వహిస్తామని తెలిపారు. కార్డియాలజీ, గైనకాలజీ, జనరల్ ఫిజీషియన్ కన్సల్టేషన్ కూడా ఉచితంగా ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నేత కోటంరెడ్డి గిరిధర్ రెడ్డి, మాజీ మేయర్ నంది మండలం భానుశ్రీ, మెడికవర్ ఆసుపత్రి మార్కెటింగ్ మేనేజర్ సతీష్, పీఆర్వో చందువర్మ తదితరులు పాల్గొన్నారు.

ఆహారపు అలవాట్లతోనే ఆరోగ్య జీవనం

● డాక్టర్ భానుప్రసాద్



మాట్లాడుతున్న డాక్టర్ భానుప్రసాద్

నెల్లూరు (విద్య), సెప్టెంబరు 4 : ఆధునిక సమాజంలో ఆహార అలవాట్లలో మార్పులు చేసుకుంటేనే ఆరోగ్యకరమైన జీవనాన్ని పొందవచ్చని న్యూయార్క్‌కు చెందిన లాంగ్ బీచ్ కెమిస్ట్స్ అధ్యక్షుడు డాక్టర్ భాను ప్రసాద్ గద్దె అన్నారు. నగరంలోని డీకే ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో బుధవారం నిర్వహించిన అంతర్జాతీయ సదస్సులో ఆయన మాట్లాడారు. ఆధునిక యాంత్రిక జీవనంలో ఆహారపు అలవాట్లు మనిషి మనుగడపై కీలక ప్రభావాన్ని చూపుతాయన్నారు. ప్రస్తుతం ఎక్కువ మంది డీ విటమిన్ లోపంతో బాధపడుతున్నారని, మహిళల్లో పీసీవోడీ సమస్యలు, బీపీ, కొలెస్ట్రాల్, షుగర్, అల్సర్ వంటి దీర్ఘకాలిక వ్యాధులకు ఆహార విధానంలో మార్పులే కారణమని చెప్పారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ డీ గిరి మాట్లాడుతూ మహిళలను వ్యాపారవేత్తలుగా తీర్చిదిద్దేందుకు చేస్తున్న కృషిలో భాగంగా సదస్సు నిర్వహిస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో వీఎస్‌యూ కామర్స్ డిపార్ట్‌మెంట్ హెడ్ సీహెచ్ శ్రీనివాస రావు, ప్రొఫెసర్ డాక్టర్ జీ మేరీసందీప్, అన్విత లైఫ్ కేర్ ఇండస్ట్రీ డైరెక్టర్ డాక్టర్ హితీష్‌కుమార్, సదస్సు నిర్వాహక కార్యదర్శి పీఎంవీ ప్రసాద్, కన్వీనర్ విజయభాస్కర్, తదితరులు పాల్గొన్నారు.

జనసేన కార్యాలయంలో 'జనవాణి'

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట), సెప్టెంబరు 4: జనసేన పార్టీ జిల్లా కార్యాలయంలో బుధవారం జనవాణి కార్యక్రమం నిర్వహించారు. ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను జనసేన నాయకులు తెలుసుకున్నారు. పార్టీ జిల్లా సీనియర్ నేత నూనె మల్లికార్జున యాదవ్, జిల్లా ప్రధాన కార్యదర్శి గునుకుల కిషోర్ మాట్లాడుతూ జనవాణి కార్యక్రమంలో కోవూరు షుగర్ ఫ్యాక్టరీకి చెందిన బాధితులు ఫిర్యాదు చేశారని, ఈ అంశాన్ని కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి దృష్టికి తీసుకెళ్తామని తెలిపారు.

గణేష్ ఘాట్‌లో ప్లాస్టిక్ వ్యర్థాల తొలగింపు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

నెల్లూరు (సాంస్కృతికం), సెప్టెంబరు 4 : ఇరుకళల పరమేశ్వరి అమ్మవారి ఆలయ సమీపంలో స్వర్ణాల చెరువులోని గణేష్ ఘాట్‌లో ప్లాస్టిక్ వ్యర్థాల తొలగింపు కార్యక్రమం బుధవారం ముమ్మరంగా జరిగింది. ఆ ఘాట్‌లో పనులు నాసిరకంగా జరుగుతున్నాయని, ప్లాస్టిక్ వ్యర్థాలు పేరుకున్నాయంటూ ఆంధ్రజ్యోతి బుధవారం ప్రచురించిన కథనంతో నగర పాలక సంస్థ అధికారులు స్పందించారు. గణపతి విగ్రహాల నిమజ్జనం జరిగే ప్రాంతంలో పేరుకుపోయిన ప్లాస్టిక్ వ్యర్థాలను తొలగించే కార్యక్రమం చేపట్టారు. టీడీపీ నాయకులు కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి, మాజీ మేయర్ భానుశ్రీ, దాట్ల చక్రవర్ధన్‌రెడ్డి, తదితరులు పరిశీలించి పలు సూచనలు చేశారు.


ఘాట్‌లో ప్లాస్టిక్ వ్యర్థాల తొలగింపును పరిశీలిస్తున్న టీడీపీ నాయకులు

నేడు విశ్రాంత ఉపాధ్యాయులకు సన్మానం

నెల్లూరు(హరనాథపురం), సెప్టెంబరు 4 : ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా గురువారం విశ్రాంత ఉపాధ్యాయులను సన్మానిస్తున్నామని ఏపీ స్టేట్ గవర్నమెంటు రిటైర్డు ఎంప్లాయీస్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు ఐ లక్ష్మీనారాయణ, కార్యదర్శి పీ వెంకయ్య ఓ ప్రకటనలో పేర్కొన్నారు. నగరంలోని పాత జడ్పీ కార్యాలయ ప్రాంగణంలో ఉన్న పెన్షనర్ల భవన్‌లో సాయంత్రం 4.30 గంటలకు ఈ కార్యక్రమం జరుగుతుందని తెలిపారు. 12 మంది ఉపాధ్యాయులను సత్కరిస్తున్నామని, సంఘం కార్యవర్గ సభ్యులందరూ పాల్గొనాలని కోరారు.


నేత్రదానంతో అంధుల జీవితాల్లో వెలుగు

● డాక్టర్ శార్వాణి


నెల్లూరు (విద్య), సెప్టెంబరు 4 : నేత్రదానంతో అంధుల జీవితాల్లో వెలుగు నింపవచ్చని జిల్లా అంధత్వ నివారణ సంస్థ ప్రోగ్రాం మేనేజర్ డాక్టర్ ఎం శార్వాణి తెలిపారు. 39వ జాతీయ నేత్రదాన పక్షోత్సవాల సందర్భంగా నగరంలోని వేదాయపాళెంలో గల శ్రీదుర్గా నర్సింగ్ కళాశాలలో జిల్లా అంధత్వ నివారణ సంస్థ, పీహెచ్‌సీ సంయుక్త ఆధ్వర్యంలో బుధవారం నేత్రదాన అవగాహన సదస్సు నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ దేశంలో 12 లక్షల మందికి కార్నియల్ అంధత్వముందన్నారు. వీరిలో 60 శాతం మంది 30 ఏళ్లలోపు వారేనని, వారికి దాతల కళ్లు అమరిస్తే చూపు వస్తుందని చెప్పారు. నేత్రదానంపై విద్యార్థి దశ నుంచే అవగాహన పెంచుకుని నేత్రదానాన్ని కుటుంబ సంప్రదాయంగా మార్చుకోవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో నర్సింగ్ కళాశాల వ్యవస్థాపకుడు దుర్గారెడ్డి, జిల్లా న్యాయసేవాధికార సంస్థ సభ్యుడు శ్రీనివాసరావు, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కే సుబ్బారావు, పీహెచ్‌సీ నాయకులు శాఖవరపు వేణుగోపాల్, గోరంట్ల శేషయ్య, దేవరకొండ శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

గర్భిణులు, బాలింతలకు రొట్టెల పంపిణీ

నెల్లూరు(వైద్యం), సెప్టెంబరు 4 : ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలోని గర్భవతులు, బాలింతలకు నెల్లూరు పినాకినీ లయన్స్‌క్లబ్ నిర్వాహకులు బుధవారం రొట్టెలు పంచిపెట్టారు. నెల్లూరు క్లాత్ మర్చంట్స్ అసోసియేషన్ అధ్యక్షుడు లయన్ కిశోర్ కుమార్, కోశాధికారి ధనుంజయ కలిసి ప్రసూతి వార్డులో 350 రొట్టెలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ అధ్యక్షుడు శేషాద్రి సుధీర్, క్లబ్ కార్యదర్శి మెంటా శరత్ తదితరులు పాల్గొన్నారు.









ఉపాధ్యాయ దినోత్సవ ప్రత్యేకం

గురువులకు వందనం!

చిన్ననాట గురువులు విద్యార్థుల ఆలోచనల్లో నాటిన విత్తనం.. చదువులోనే కాదు వ్యక్తిత్వ వికాసంలోనూ కీలకంగా మారుతుంది. అందుకే ఏ స్థాయికి ఎదిగినా గురువులను తలచుకుంటారు. తిరుపతి జిల్లా కలెక్టర్ డాక్టర్ సంజామల వెంకటేశ్వర్.. తనకు దారి చూపిన గురువులను ఇలా గుర్తు చేసుకుంటూ నమస్కరించుకుంటున్నారు.

గతంలో ప్రభుత్వ పాఠశాలల్లో నైతిక విలువల బోధనకు ప్రాధాన్యత వుండేది. ప్రత్యేకంగా దానికంటూ కొన్ని క్లాసులు తీసుకునేవారు. పాఠ్యాంశాల్లో కూడా నైతిక విలువలకు సంబంధించిన ఇతివృత్తాలు వుండేవి. ఇపుడు వాటిని తగ్గించేయడం, పూర్తిగా తొలగించడం చేస్తున్నారు. ప్రాథమిక విద్యలో పిల్లలకు మాతృభాషలోనే సబ్జెక్టులు బాగా అర్థమవుతాయి. దానికోసం తెలుగు భాషా బోధనపై దృష్టి సారించాల్సిన అవసరముంది.

పాఠశాలల్లో కేవలం పాఠ్యపుస్తకం చదివి టీచ్ చేయడం సరిపోదు. అవసరమైన బొమ్మలు, దృశ్యాలు, మ్యాపులు, డ్రాయింగులు వంటివి ఉపయోగించాలి. ఉదాహరణలు చూపాలి. కేవలం కాన్సెప్టులు మాత్రమే బోధిస్తే పిల్లలకు అర్థం కాదు. వీటన్నింటికీ మించి సామాజిక బాధ్యత కలిగిన ఉపాధ్యాయులు పిల్లల పాలిట మెంటర్లుగా మారాలి.


● తిరుపతి కలెక్టర్ డాక్టర్ సంజామల వెంకటేశ్వర్

హైస్కూల్‌లో సెబాస్టియన్ సార్

ఫస్ట్ క్లాస్ నుంచీ టెన్త్ వరకూ గుంటూరు లయోలా పబ్లిక్ స్కూల్లో చదువుకున్నా. అప్పట్లో మాకు కెమిస్ట్రీ టీచర్‌గా సెబాస్టియన్ వుండేవారు. కేవలం తన సబ్జెక్టుకే పరిమితమయ్యేవారు కాదు. ఇతర అంశాలు చెప్పేవారు. మంచిచెడులు వివరిస్తూ పిల్లల వ్యక్తిత్వాన్ని తీర్చిదిద్దడానికి ప్రయత్నించేవారు. హైస్కూలు స్థాయి లోనే కెరీర్ వైపు దృష్టి మళ్లించారు. నాకు కూడా కెరీర్ కౌన్సిలింగ్ ఇచ్చి గైడ్ చేసింది తనే.

సివిల్స్ దిశగా.. ప్రొఫెసర్ కృష్ణబాబు

విశాఖ ఆంధ్రా మెడికల్ కాలేజీలో మెడిసిన్ చేస్తున్న సమయంలో ఎస్పీఎం (సోషల్ అండ్ ప్రివెంటివ్ మెడిసిన్) ప్రొఫెసర్ కృష్ణబాబు టీచింగ్ నన్ను బాగా ప్రభావితం చేసింది. సివిల్స్ వైపు దృష్టి మరల్చింది కూడా వారే. జీవితంలో తల్లిదండ్రుల్ని మినహాయిస్తే నన్ను ఓ వ్యక్తిగా తీర్చిదిద్దడంలో ఈ ఇద్దరి పాత్ర ఎక్కువ. గురుపూజోత్సవ దినాన వారిని గుర్తు చేసుకుంటూ వందనం సమర్పించుకుంటున్నా.


తిరుపతి
ఆంధ్రజ్యోతి

అర్థశాస్త్ర నిపుణుడైన ఆచార్య కూతాటి వెంకటరెడ్డి ఎస్వీ ఆర్ట్స్ కాలేజీ అధ్యాపకుడిగా 36 ఏళ్లు ఎందరో శిష్యులను తీర్చిదిద్దారు. అనంతపురం ఎస్కే యూనివర్శిటీ వైస్ చాన్సలర్‌గా చేసి రిటైరైన ఆయన ప్రస్తుతం తిరుపతి ఎస్వీ నగర్‌లో విశ్రాంత జీవితం గడుపుతున్నారు. 93 ఏళ్ల వెంకటరెడ్డి ఇటీవలే తన ఆత్మకథ రాశారు. అందులో చిన్ననాట తనకు చదువు చెప్పిన గురువులను ఇలా గుర్తు చేసుకున్నారు.



స్వాతంత్ర్యోద్యమంలోకి నడిపిన గురువు

"ధనోజివారిపల్లె మావూరు. ఆ కాలంలో ప్రాథమిక పాఠశాల కూడా మావూర్లో లేదు. పాకాల బడిలో చేరాను. పాకాల మావూరికి అయిదు మైళ్లు. రానూపోనూ పదిమైళ్ల నడక. మా హైస్కూల్లో రంగస్వామి అయ్యంగార్ అని ఒక ఉపాధ్యాయుడు వుండేవారు. తిరుచానూరు నివాసి. రైల్లో రోజూ పాకాలకి వచ్చేవారు. ఒకరోజు రైలు ఆలస్యం మూలాన 5నిమిషాలు లేటుగా వచ్చారు. అంతే,ఆ రోజు సెలవు పెట్టి సాయంకాలం దాకా అక్కడే ఉన్నారు. పాఠశాల వదిలాక ఆరోజు మాకు చెప్పవలసిన పాఠం చెప్పారు. క్రమశిక్షణలో ఆయన అంతటి ఘనాపాటి! ఒకసారి నేను జబ్బుపడి వరసగా మూడురోజులు పాఠశాలకు వెళ్లలేదు. అప్పుడు రంగస్వామి అయ్యంగార్ 5 మైళ్లు పాకాల నుంచీ నడుచుకుంటూ వచ్చి నన్ను చూసి పళ్లూ ఫలాలూ ఇచ్చి మళ్లీ నడుచుకుంటూ మా వూర్నించి పాకాల వెళ్లి అక్కడ రైలెక్కారు తిరుపతికి. అంతటి ఆప్యాయత వారికి విద్యార్థులంటే! 1943లో గాంధీ బొంబాయి నుంచి రేణిగుంట మీదుగా మద్రాసుకు ప్రయాణిస్తున్నారని తెలిసింది. రంగస్వామి అయ్యంగార్‌తో కలసి 30 మంది విద్యార్థులం రేణిగుంటకు వెళ్లాము. గాంధీని దర్శించిన మొదటి సందర్భం అది. క్విట్ ఇండియా, సహాయ నిరాకరణోద్యమాల్లో 8,9 తరగతుల్లో వుండగా నేను చురుగ్గా పాల్గొన్నాను. అది చూసి రంగస్వామి అయ్యంగార్ మా పాఠశాల విద్యార్థులతో 'పాకాల కాంగ్రెస్ స్టూడెంట్స్ అసోసియేషన్' అని స్థాపించి నన్ను అధ్యక్షుడిని చేశారు. ఈ కార్యక్రమాల్లో పాల్గొన్న నన్ను 6 మాసాలు చిత్తూరు జైలులో వుంచారు. అయినా ఏనాడూ పరీక్ష తప్పింది లేదు.

ఆ కాలంలో విద్యార్థులకు స్కాలర్‌షిప్పు వసతి లేదు. హెడ్‌మాస్టర్ ఆర్.టి. రంగారెడ్డి, చెంగారెడ్డి, రంగస్వామి అయ్యంగారు ఇత్యాది టీచర్లంతా కూడా స్తోమత లేని పిల్లలకు పరీక్ష ఫీజులు కట్టి మరీ పరీక్షలు రాయించేవారు.అట్టి నిబద్ధత ఆనాటి ఉపాధ్యాయులది.



విజిలెన్స్ ఎస్పీగా

కరీముల్లా షరీఫ్

తిరుపతి(నేరవిభాగం), సెప్టెంబరు 4: తిరుపతి విజిలెన్సు ఎస్పీగా విజయవాడలో పనిచేస్తున్న కరీముల్లా షరీఫ్ నియమితులయ్యారు. ప్రస్తుతం ఈయన తిరుపతిలో ఇన్‌చార్జి ఎస్పీగా పనిచేస్తున్నారు. 2010 బ్యాచ్‌కు చెందిన కరీముల్లా షరీఫ్ అనంతపురం జిల్లా కదిరి డీఎస్పీగా పని చేశాక గ్రేహౌండ్స్‌కు బదిలీ అయ్యారు.తర్వాత కడప జిల్లా మైదుకూరు,అనంతపురం జిల్లా పెనుకొండల్లో డీఎస్పీగా పనిచేసిన ఆయన సీఐడీకి బదిలీ అయ్యారు.2018లో అదనపు ఎస్పీగా పదోన్నతి కల్పించిన ప్రభుత్వం ఇంటెలిజెన్సు విభాగానికి బదిలీ చేసింది. అనంతరం పశ్చిమ గోదావరి సెబ్ అదనపు ఎస్పీగా నియమించింది. తరువాత విజయవాడ ఇంటెలిజెన్సు విభాగానికి బదిలీ చేసారు. 2023లో ఎస్పీగా పదోన్నతిపై విజయవాడలోని విజిలెన్సు విభాగంలో ఎనిమిది నెలలు పనిచేశారు.కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత టీటీడీలోని వివిధ విభాగాల్లో జరిగిన అవినీతి అక్రమాలను వెలికి తీసేందుకు ఆయన్ను విచారణాధికారిగా నియమించింది. ఈ క్రమంలో ప్రస్తుతం తిరుపతి విజిలెన్సు విభాగానికి ఇన్‌చార్జి ఎస్పీగా పని చేస్తున్నారు. బుధవారం రాష్ట్ర వ్యాప్తంగా జరిగిన విజిలెన్సు ఎస్పీల బదిలీల్లో కరీముల్లా షరీఫ్‌ను తిరుపతి ఎస్పీగా నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తిరుపతిలో పనిచేయడం అదృష్టంగా భావిస్తున్నానని చెప్పారు.

సీఐల బదిలీ

తిరుపతి(నేరవిభాగం), సెప్టెంబరు 4: నలుగురు సర్కిల్ ఇన్‌స్పెక్టర్లు బదిలీ అయ్యారు.చంద్రగిరిలో పనిచేస్తున్న రామయ్యను ఎస్వీయూనివర్శిటీకి, ఇక్కడ పనిచేస్తున్న మురళీమోహన్‌ను తిరుమల టూటౌన్‌కు బదిలీ చేశారు.తిరుమల టూటౌన్‌లో పనిచేస్తున్న సత్యనారాయణను వీఆర్‌కు పంపారు. ఎన్నికల ముందు వీఆర్‌కు పంపిన అబ్బన్నను తిరుపతి క్రైం పోలీస్‌స్టేషన్ సీఐగా నియమించారు. వీరందరూ రెండు రోజుల్లో బాధ్యతలు స్వీకరించనుండగా చంద్రగిరి సీఐగా సుబ్బరామిరెడ్డి బుధవారం రాత్రి బాధ్యతలు స్వీకరించారు.

7న స్విమ్స్‌లో

ఓపీ, ఓటీలకు సెలవు

తిరుపతి(వైద్యం), సెప్టెంబరు 4: వినాయక చవితి పండుగ సందర్భంగా ఈ నెల 7న స్విమ్స్ ఓపీ, ఓటీలకు సెలవు ప్రకటిస్తున్నట్లు డైరెక్టర్ ఆర్వీకుమార్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. కేవలం అత్యవసర వైద్య సేవలు మాత్రమే అందుబాటులో వుంటాయని, ఈ విషయంలో అందరూ సహకరించాలని ఆయన కోరారు.


మెడికల్ షాపు యజమానిపై

అత్యాచారం కేసు

తిరుపతి(నేరవిభాగం), సెప్టెంబర్ 4 : ఓ మెడికల్ షాపు యజమాని అత్యాచారానికి పాల్పడిన ఘటన బుధవారం వెలుగు చూసింది. సీఐ చిన్నగోవిందు కథనం మేరకు....తిరుపతి రూరల్ మండలంలో కుప్పస్వామి హిమ మెడికల్ షాపు నడుపుతున్నాడు. ఆస్మాతో బాధపడుతోన్న ఓ కార్మికుడి కుమార్తె (10) బుధవారం సాయంత్రం మెడికల్ షాపులో నెబులైజర్ పెట్టుకుని మందులు తీసుకు వెళ్లేందుకు వచ్చింది.వైద్యం పేరుతో ఆమెను లోపలికి పిలిచిన కుప్పస్వామి మాయ మాటలతో నమ్మించి అత్యాచారానికి పాల్పడ్డాడు. భయపడిపోయిన ఆ బాలిక జరిగిన విషయాన్ని తన తండ్రికి తెలియజేసింది.ఆగ్రహంతో మెడికల్ షాపు వద్దకు చేరుకున్న బాలిక తల్లిదండ్రులు, బంధువులు అతడికి దేహశుద్ధి చేసి పోలీసులకు అప్పగించారు.బాలిక తండ్రి ఫిర్యాదు మేరకు ముద్దాయిపై పోక్సో కేసు నమోదు చేసినట్లు సీఐ చిన్నగోవిందు చెప్పారు.

71మంది టీచర్లకు నేడు పురస్కారాలు

తిరుపతి(విద్య), సెప్టెంబరు 4: జిల్లాస్థాయిలో ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపిక చేసిన 71మందికి గురుపూజోత్సవ సందర్భంగా నేడు పురస్కారాలను అందజేయనున్నట్లు డీఈవో శేఖర్ తెలిపారు. ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారాలకు తడ, చిల్లకూరు, ఏర్పేడు మండలాలనుంచి ఎవరూ దరఖాస్తు చేసుకోలేదని, మిగిలిన 31 మండలాలనుంచి 88మంది దరఖాస్తు చేసుకోగా 71 మంది ఎంపికయ్యారని వివరించారు. వారి వివరాలు మండలాలవారీగా.. ఎ. చెన్నమ్మ (ఎస్జీటీ, అక్కసముద్రం, బాలాయపల్లి మండలం), ఎం. లక్ష్మయ్య, పి. దేవేంద్ర (స్కూల్ అసిస్టెంట్లు, కలివెట్టు, బీఎన్ కండ్రిగ మండలం), పి. విజయ (ఎస్జీటీ, పద్మావతిపురం, బీఎన్ కండ్రిగ), బి. రామ్మూర్తి (హెచ్‌ఎం, నరసింగాపురం, చంద్రగిరి), డాక్టర్. ఎ. భారతమ్మ (స్కూల్ అసిస్టెంట్, ఎ.రంగంపేట, చంద్రగిరి), బి. లావణ్యలత (స్కూల్ అసిస్టెంట్, బాలికల ఉన్నతపాఠశాల, చంద్రగిరి), బి. మల్లీశ్వరి (ఎస్జీటీ, మొండికాల్వ, చంద్రగిరి), పి. శ్రీనివాసులు (స్కూల్ అసిస్టెంట్, చిల్లకూరు), జి. తారకనాథ్ (ఎస్జీటీ, చినిగేపల్లి, చిన్నగొట్టిగల్లు), టి. జ్యోతి (ఎస్జీటీ, నాగవోలు, డక్కిలి), వి. శ్రీనివాసులు (ఎస్జీటీ, తల్లంపాడు, దొరవారి సత్రం), కె. శివకళ (ఎస్జీటీ, అయ్యవారిపాళెం, గూడూరు), మోహన్‌బాబు (హెచ్‌ఎం, రాగిగుంట, కేవీబీ పురం), ఎల్. మంజుల (ఎస్జీటీ, తిమ్మనాయుడుపాళెం, కోట), ఎ. వెంకటేశ్వర్లు (పీఎస్ హెచ్‌ఎం, వెంబాకం, నాగలాపురం), మధుసూదన్ (హెచ్‌ఎం, అన్నమేడు, నాయుడుపేట), ఎండీ షఫీవుల్లా (స్కూల్ అసిస్టెంట్, అన్నమేడు, నాయుడుపేట), కె. సుబ్బారావు (పీజీటీ, నాయుడుపేట), జి. శంకరయ్య(ఎస్జీటీ, అత్తపాళెం, నాయుడుపేట), ఎ. శంకరయ్య (ఎస్జీటీ, మర్లపల్లి, నాయుడుపేట), కె. బాలకృష్ణారెడ్డి (స్కూల్ అసిస్టెంట్, పాలమంగళం, నారాయణవనం), బి. వల్లి (ఎస్‌ఏ, అరణ్యకండ్రిగ, నారాయణవనం), కేవీ శ్యామలత (ఎస్‌ఏ, నారాయణవనం), ఎన్. రమేష్ (ఎస్జీటీ, కొండలచెరువు, నారాయణవనం), జె. శ్రీనివాసులు (ఎస్‌ఏ, చిల్లమానుచేను, ఓజిలి), కె. శ్రీరంజని (ఎస్జీటీ, ఇరంగారిపల్లి, పాకాల), పి. రుత్‌పావని (ఎస్జీటీ, నేలదానిపల్లె, పాకాల), డి. బాలసుబ్రహ్మణ్యం (ఎస్జీటీ, పాకాల), జె. డోరతి వయోల (ఎస్జీటీ, కానూరు రాజుపాళెం, పెళ్లకూరు), వి. బాలసుబ్రహ్మణ్యం (ఎస్జీటీ, ఎడపూడి, పెళ్లకూరు), వి. గిరిప్రకాష్ (హెచ్‌ఎం, పిచ్చాటూరు), ఎం. రమేష్‌బాబు (ఎస్‌ఏ, పిచ్చాటూరు), ఎం. మదనమునయర్ (ఎస్జీటీ, పిచ్చాటూరు), పీఎస్. సుబ్బరాయన్ (హెచ్‌ఎం, గోపాలకృష్ణాపురం, పుత్తూరు), భువనేశ్వరి (హెచ్‌ఎం, పుత్తూరు), ఎం. గోపి (ఎస్‌ఏ, జీకే పురం, పుత్తూరు), బి. హరినాథ్ (ఎస్‌ఏ, ఎగువకనకంపాళెం, పుత్తూరు), ఎ. గోపీకృష్ణ (ఎస్‌ఏ, గొల్లపల్లి, పుత్తూరు), ఎ. కేశవులు (ఎస్జీటీ, బొజ్జనాతం, పుత్తూరు), సి. రమేష్‌యాదవ్ (ఎస్‌ఏ, పరమాల, ఆర్సీ పురం), ఇ. స్వయంప్రభ (ఎస్‌ఏ, కమ్మకండ్రిగ, ఆర్సీ పురం), పి. సుగుణ (ఎస్జీటీ, ఎస్ఆర్ కమ్మపల్లి, ఆర్సీపురం), జె. లక్ష్మీదేవసేన (పీఎస్‌హెచ్‌ఎం, ఇంద్రానగర్, రేణిగుంట), ఎస్‌కే బావాజాన్ (ఎస్‌ఏ, తారకారామానగర్, రేణిగుంట), ప్రేమ్‌కుమార్ (ఎస్‌ఏ, పుదుకుప్పం, సత్యవేడు), జి.కృష్ణయ్య (హెచ్‌ఎం, తొండమనాడు, శ్రీకాళహస్తి), పి. మాధవీలత (పీజీటీ, అంబేడ్కర్ గురుకులం, కాసా గార్డెన్స్, శ్రీకాళహస్తి), డి. నరసింహయ్య (ఎస్‌ఏ, ముచ్చివోలు, శ్రీకాళహస్తి), జీపీ చలం (ఎస్‌ఏ, వేడాం, శ్రీకాళహస్తి), ఎం. చంద్రజిత్ యాదవ్ (హెచ్‌ఎం, కోటాపోలూరు, సూళ్లూరుపేట), కె. మునీశ్వర్‌రెడ్డి (ఎస్‌ఏ, గుండేలిగుంట, తొట్టంబేడు), ఎస్. మురళీమోహన్ ప్రసాద్ (ఎస్‌ఏ, ఎస్ఎన్ పురం, తిరుపతి అర్బన్) మురళీకృష్ణయ్య (ఎస్జీటీ, ఎస్వీయూ క్యాంపస్, తిరుపతి), జి. దేవరాజులు నాయుడు (ఎస్జీటీ, గాంధీనగర్, తిరుపతి), డి. నిర్మల (ఎస్జీటీ, సత్యనారాయణపురం, తిరుపతి), డి.ప్రశాంతి (ఎస్‌ఏ, తిరుచానూరు), కె.నాగేశ్వరయ్య (ఎస్‌ఏ, దుర్గసముద్రం, తిరుపతి రూరల్), కె. జానకిరామ మందాడి (ఎస్‌ఏ, మల్లంగుంట, తిరుపతి రూరల్), బి. నాగమల్లేశ్వరి (పీఈటీ, పెరుమాళ్లపల్లి, తిరుపతి రూరల్), ఎం. రవిశేఖర్‌రెడ్డి (హెచ్‌ఎం, తడుకు, వడమాలపేట), ఎస్. మధుసూదనరాజు (పీఎస్‌హెచ్‌ఎం,పాపానాయుడుపేట,ఏర్పేడు), డి. మాల్యాద్రి (ఎస్జీటీ, దుగరాజపట్నం, వాకాడు), ఐ. మాలిని (ఎస్జీటీ, వెంకటరెడ్డిపాళెం, వాకాడు), మాధవయ్య (హెచ్‌ఎం, సంతవేలూరు, వరదయ్యపాళెం), బి. మురళీకృష్ణ (ఎస్‌ఏ, బత్తలవల్లం, వరదయ్యపాళెం), బి. సత్యనారాయణ (ఎస్జీటీ, పారవోలు, వెంకటగిరి), ఆర్. సాయిరాం (ఎస్జీటీ, మొగళ్లగుంట, వెంకటగిరి), సి. అమరనాథ్ (ఎస్‌ఏ, ఎర్రావారిపాళెం), పి. రాజగోపాల్ (ఎస్జీటీ, బిజ్జేపల్లి, ఎర్రావారిపాళెం).



ప్రభుత్వం అందుబాటులోకి తీసుకువచ్చిన వెబ్ సైట్ పోర్టల్

అనుమతి కోసం 'హాయ్' చెప్పండి

● చవితి వేడుకలకు సింగిల్ విండో క్లియరెన్స్ విధానం

తిరుపతి(వైద్యం), సెప్టెంబరు 4: వినాయక చవితి వేడుకల్లో భాగంగా విగ్రహాలు ప్రతిష్ఠించే మండపాలకు ఆన్‌లైన్‌లోనే అనుమతులు ఇచ్చేలా ప్రభుత్వం సింగిల్ విండో క్లియరెన్స్ విధానాన్ని అందుబాటులోకి తీసుకువచ్చింది. గతంలో వేడుకలు నిర్వహించాలంటే అగ్నిమాపక, విద్యుత్తు, పురపాలక , పోలీసు శాఖల నుంచి అధికారుల అనుమతి తీసుకోవాల్సి వచ్చేది. వీటి కోసం అధికారుల చుట్టూ చవితి వేడుకల నిర్వాహకులు రోజుల తరబడి ప్రదక్షిణ చేసే వారు. కానీ ఈ ఏడాది ప్రభుత్వం తీసుకువచ్చిన నూతన విధానంతో ఇంటి నుంచే అనుమతులను పొందే అవకాశం ఉంది. ప్రభుత్వం ఏర్పాటు చేసిన నంబర్‌కు హాయ్ అని మెసేజ్ చేయడం లేదా దానికి సంబంధించిన వెబ్‌సైట్‌లో వివరాలు నమోదు చేయడం వలన ఇట్టే వినాయక విగ్రహ ఏర్పాటుకు అనుమతులు పొందే వెసులుబాటును ప్రభుత్వం తీసుకువచ్చింది.

● చవితి వేడుకలు నిర్వహించే వారు కచ్చితంగా ఉత్సవ కమిటీని నియమించుకోవాలి. వారిలో ఒకరి సెల్‌ఫోన్ నుంచి 79950 95880 నంబరుకు వాట్సాప్‌లో హాయ్ అని మెసేజ్ పంపించాలి. వెంటనే సదరు నంబరుకు లింక్ వస్తుంది. దాన్ని అనుసరించాలి. లేకుంటే నేరుగా డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.గణేష్‌ఉత్సవ్.నెట్ అనే వెబ్‌సైట్‌లో అడిగిన పూర్తి వివరాలను నమోదు చేయడంతో అందులో ఇచ్చిన మన సెల్ నంబరుకు ఒక ఓటీపీ వస్తుంది. ఓటీపీ నమోదు చేసిన వెంటనే గూగుల్లో దరఖాస్తు వస్తుంది. అందులో అడిగిన వివరాలను పూరించాల్సి ఉంటుంది. దానిని పోలీసులు, ఇతర శాఖల అధికారులు పరిశీలించి అనుమతి మంజూరు చేస్తారు. ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్న వెంటనే సంబంధిత బాధ్యుడి పేరుతో క్యూఆర్ కోడ్ వస్తుంది. ఆ క్యూఆర్ కోడ్ డౌన్‌లోడ్ చేసి విగ్రహం ఏర్పాటు చేసే మండపం వద్ద అంటించాల్సి ఉంటుంది. ఈ కోడ్‌ను స్కాన్ చేస్తే విగ్రహానికి సంబంధించిన వివరాలన్నీ వెల్లడవుతాయి.


చిన్నారి పేషెంట్ తల్లితో మాట్లాడుతున్న టీటీడీ ఈవో శ్యామలరావు

బర్డ్‌పై టీటీడీ దృష్టి

● సందర్శించిన ఈవో, జేఈవోలు
● అంతా బాగుందంటూ వైద్యుల వివరణ
● మరి మీడియాలో కథనాలేంటన్న ఈవో

[ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్]

తిరుపతి, సెప్టెంబరు4(ఆంధ్రజ్యోతి): బాలాజీ వికలాంగుల శస్త్రచికిత్స, పరిశోధన, పునరావాస కేంద్రం (బర్డ్)పై టీటీడీ అధికారులు దృష్టి పెట్టారు. బుధవారం టీటీడీ ఈవో శ్యామలరావు, జేఈవో గౌతమి, మరో జేఈవో, బర్డ్ ఇంచార్జి డైరెక్టర్ వీరబ్రహ్మం బర్డ్ ఆస్పత్రిని సందర్శించారు. అక్కడి వైద్యులతో సమీక్షించారు. అయితే 'బర్డ్‌లో అంతా బాగా జరుగుతోంది' అని వైద్యులు ఈవోను పక్కదారి పట్టించే ప్రయత్నం చేసినట్టు తెలిసింది. దీంతో ఈవో స్పందిస్తూ 'అంతా బాగుంటే మీడియాలో వారానికో కథనం ఎందుకు వస్తోంది' అని ప్రశ్నించినట్టు సమాచారం. గడిచిన ఐదేళ్లలో బర్డ్ ఆస్పత్రి పాలన పక్కదారిపట్టిందని బుధవారం ఆంధ్రజ్యోతిలో 'గతి తప్పిన బర్డ్' శీర్షికన కథనం ప్రచురితమైంది. అదేవిధంగా రెండు వారాల క్రితం బర్డ్‌లో అవినీతి, అక్రమాలపై వచ్చిన ఆరోపణలపై విజిలెన్స్ విచారణ జరుగుతోందన్న నేపథ్యంలో 'బర్డ్‌ను భ్రష్టుపట్టించారు' అని మరో కథనాన్ని కూడా ఆంధ్రజ్యోతి ప్రచురించింది. ఈ నేపథ్యంలో టీటీడీ ఈవో, జేఈవోలు బర్డ్‌ను పరిశీలించారు. పత్రికలో వచ్చిన ప్రతి అంశంపై వైద్యులు వివరణ రాసి ఈవోకు అందించినట్టు తెలుస్తోంది. వీటిపై తర్వాత విచారణ చేస్తానని ఈవో చెప్పినట్టు తెలుస్తోంది. బర్డ్ ఆస్పత్రిలో రోగులు, వారి సహాయకులకు అందుతున్న సదుపాయాలను, వైద్య సేవలను అడిగి ఈవో తెలుసుకున్నారు. అనంతరం అత్యవసర వార్డు, జనరల్ వార్డు, ఎక్సరే, స్కానింగ్, ఓపీ వార్డులను పరిశీలించి పలు సూచనలు చేశారు. ఆస్పత్రిలో అందిస్తున్న వైద్య సేవలు, అన్నప్రసాదాల నాణ్యత గురించి రోగులతో మాట్లాడి వారి అభిప్రాయాలను అడిగి తెలుసుకున్నారు.

● **ఆపరేషన్లు తగ్గలేదు : టీటీడీ**

బర్డ్‌లో కార్పొరేట్ ఆస్పత్రుల స్థాయిలో వైద్య చికిత్సలు అందిస్తున్నట్లు టీటీడీ సీపీఆర్వో రవికుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. ఆంధ్రజ్యోతిలో బుధవారం ప్రచురితమైన 'గతి తప్పిన బర్డ్' కథనంపై ఆయన వివరణ ఇచ్చారు. రోగులకు ఓపీ, ఆపరేషన్లు, కృత్రిమ అవయవాల అమరిక వేగవంతంగా నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. గత మూడు నెలల్లో 24,429 ఓపీ సేవలు, 1489 ఆర్థోపెడిక్ సేవలు అందించారని, 24 గంటలూ వైద్యులు అందుబాటులో ఉంటున్నారని వెల్లడించారు. కాగా గాయానికి కట్టు మార్చడం, కట్టు కట్టడాలు కూడా ఆపరేషన్ల కిందే చూపించి, ఈవోకు తప్పుడు సమాచారం ఇచ్చారన్న చర్చ వినిపిస్తోంది. అదేవిధంగా విజిలెన్స్ విచారణ పైన, సిబ్బంది నిర్లక్ష్యంపైన, మెడికల్ షాపు మూతపైన ఎలాంటి వివరణ ఇవ్వకపోవడం గమనార్హం.



వరసిద్ధుడి హుండీ ఆదాయం రూ.1.15కోట్లు

ఐరాల(కాణిపాకం), సెప్టెంబరు 4: కాణిపాక వరసిద్ధి వినాయక స్వామి ఆలయ హుండీ ఆదాయం రూ.1.15,81,533 వచ్చింది. ఆస్థాన మండపంలో ఈవో గురుప్రసాద్ పర్యవేక్షణలో స్వామి హుండీ కానుకలను బుధవారం లెక్కించారు. 49 గ్రాముల బంగారు, 1.30 కేజీల వెండి, 602 యూఎస్‌ఏ, 20 ఆస్ట్రేలియా, 2 సింగపూర్ డాలర్లు లభించాయి. గోసంరక్షణ హుండీ ద్వారా రూ.7,940, నిత్యాన్నదాన సత్రం వద్ద ఏర్పాటు చేసిన హుండీ ద్వారా రూ.24,025 సమకూరాయి. ఈ ఆదాయం పూర్తిగా 18 రోజులలో లభించింది.

రేపు జడ్పీ సమావేశం

చిత్తూరు రూరల్, సెప్టెంబరు 4: జిల్లా పరిషత్ సర్వసభ సమావేశం శుక్రవారం నిర్వహిస్తున్నట్లు జడ్పీ సీఈవో గ్లోరియా ఒక ప్రకటనలో తెలిపారు. కలెక్టర్, ఉమ్మడి జిల్లాకు చెందిన ఎమ్మెల్యేలు, ఎంపీలు, జడ్పీటీసీలు పాల్గొనే ఈ సమావేశానికి జిల్లా అధికారులు పూర్తి సమాచారంతో హాజరుకావాలని కోరారు.

20లోగా ఓటరు జాబితా సవరణ: కలెక్టర్

దొరవారిసత్రం, సెప్టెంబరు 4: ఎన్నికల కమిషన్ ఆదేశాల ఓటర్ల జాబితా సవరణను ఈ నెల 20వ తేది లోగా బీఎల్వోలు పూర్తి చేయాలని కలెక్టర్ ఎస్.వెంకటేశ్వర్ ఆదేశించారు. ఆయన బుధవారం ఓటరు జాబితా సవరణను దొరవారిసత్రం మండలం నెలబల్లిలో బీఎల్వోలతో కలిసి పరిశీలించారు. కుటుంబ సభ్యులందరనీ ఒకే చోట చేర్చి సవరణ చేపట్టాలన్నారు. అలాగే ఓటరు ఇష్టం మేరకు వారికి అవసరమైన చోట ఓటు హక్కు కల్పించాలన్నారు. చనిపోయిన, వలస వెళ్లిన వారి ఓట్లు తొలగించే సమయంలో వారి సంబంధీకులనుంచి సరైన సమాచారం తీసుకుని తదుపరి చర్యలు చేపట్టాలన్నారు. తహసీల్దారు శైలాకుమారి, ఆర్డీవో కార్యాలయ ఏవో రవికుమార్, డీటీ గోపీనాథ రెడ్డి, ఎస్ఐ అజయ్‌కుమార్ పాల్గొన్నారు.

ఓటరు జాబితా సవరణలపై మరో సారి శిక్షణ

తడ, సెప్టెంబరు 4: ఓటరు జాబితా సవరణలపై జిల్లాలోని బీఎల్వోలకు మరో సారి శిక్షణ ఇస్తామని కలెక్టర్ వెంకటేశ్వర్ తెలిపారు. బుధవారం మధ్యాహ్నం ఆయన కాదలూరు, తడ కండ్రిగ గ్రామాల్లో ఓటరు సవరణలను పరిశీలించారు. సవరణలు పక్కాగా చేయాలని, ఎలాంటి తప్పులకు ఆస్కారం ఉండకూడదని బీఎల్వోలను ఆదేశించారు. తహసీల్దారు రవికుమార్, ఎంపీడీవో విజయ్‌కుమార్, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్‌ను కాదలూరు మాజీ సర్పంచ్ వి.చంద్రయ్య శాలువతో సత్కరించి పుష్పగుచ్ఛం అందించారు.

గురుకుల పాఠశాల తనిఖీ


విద్యార్థులతో కలెక్టర్ సహపంక్తి భోజనం

సూళ్లూరుపేట, సెప్టెంబరు 4: పట్టణంలోని అంబేడ్కర్ బాలికల గురుకుల పాఠశాలను బుధవారం కలెక్టర్ ఎస్.వెంకటేశ్వర్ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... రాష్ట్రంలో అత్యధిక విద్యార్థులున్న సూళ్లూరుపేట గురుకులం గత ఏడాది టెన్త్‌లో 98 శాతం ఉత్తీర్ణత సాధించిందని, ఈ ఏడాది వందశాతం ఉత్తీర్ణత సాధించేలా కృషి చేయాలని సిబ్బందిని ఆదేశించారు. డ్రైనేజి వ్యవస్థ మెరుగుపర్చుకోవాలని, వంటశాల పరిసరాలు ఇంకా శుభ్రంగా ఉంచుకోవాలన్నారు. తాగునీటి సమస్య శాశ్వత పరిష్కారానికి సంబంధిత అధికారులను ఆదేశించారు. మెనూ ప్రకారం వడ్డిస్తున్నారా అని విద్యార్థులను అడిగి తెలుసుకుని వారితో కలసి భోజనం చేశారు. అనంతరం పాఠశాల ఆవరణలో మొక్కను నాటారు. ఈ కార్యక్రమంలో గురుకులం వైస్ ప్రిన్సిపాల్ రేచల్ వాణి, ఆర్డీవో కార్యాలయ డీఏవో రవికుమార్, డీటీ చైతన్య, మున్సిపల్ మేనేజర్ శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

గంజాయిపై ఉక్కుపాదం: ఎస్పీ


పోస్టర్ల ఆవిష్కరణలో ఎస్పీ తదితరులు

నాయుడుపేట టౌన్, సెప్టెంబరు 4: అసాంఘిక కార్యక్రమాల్లో భాగంగా గంజాయి రవాణా, వినియోగంపై ఉక్కు పాదం మోపుతామని అందుకు బాధ్యులైన వారిపైన చట్టపరమైన చర్యలు తప్పవని తిరుపతి జిల్లా ఎస్పీ సుబ్బరాయుడు హెచ్చరించారు. నాయుడుపేట డీఎస్పీ కార్యాలయంలో బుధవారం గంజాయి నిర్మూలన పోస్టర్లను పోలీస్ అధికారులతో కలసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గంజాయి వినియోగ నివారణకు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. డీఎస్పీ చెంచుబాబు, సీఐలు బాబి, సంగమేశ్వరరావు, హుస్సేన్‌బాషా, ఎస్ఐ రవిబాబు, సిబ్బంది ఉన్నారు.

ఉత్తమ ఉపాధ్యాయులుగా ఇద్దరి ఎంపిక

పెళ్లకూరు, సెప్టెంబర్, 4: జిల్లాస్థాయి ఉత్తమ ఉపాధ్యాయులుగా మండలానికి చెందిన ఇద్దరు ఎంపికైనట్లు ఎంఈవో ఎం.శంకరయ్య తెలిపా రు. యడపూడి ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయుడు వి.బాలసుబ్రహ్మణ్యం, కానూరు రాజుపాలెం ప్రాథమికోన్నత పాఠశాల ఉపాధ్యాయురాలు డోరతి వయోలా జిల్లాస్థాయి ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికైనట్లు ఆయన చెప్పారు. గురుపూజోత్సవం సందర్భంగా గురువారం తిరుపతిలో వీరికి ఉత్తమ ప్రశంసాపత్రాలతో పాటు జ్ఞాపికలు అందజేయనున్నట్లు తెలిపారు.

నేడు ఉత్తమ గురువులకు సన్మానం

వాకాడు, సెప్టెంబరు 4 : గురుపూజ దినోత్సవాన్ని పురస్కరించుకొని గురువారం మండలంలోని షాదీమంజిల్‌లో మధ్యాహ్నం 2 గంటలకు ఉత్తమ ఉపాధ్యాయులను సన్మానిస్తున్నట్టు ఎంఈవో నసీం అలీ తెలిపారు. పి.శ్రీనివాసరావు, ఎస్‌కె రహీదా, కె.సుష్మ, ఎం.హరికృష్ణ, టి.సుభాషిణిని సన్మానిస్తున్నట్టు తెలిపారు.

నావెల్ ఎన్‌సీసీ క్యాడెట్ల ఎంపిక



కోట, సెప్టెంబరు 4: మండలంలోని విద్యానగర్ ఎన్‌బీకేఆర్ ఇంజనీరింగ్ కళాశాలలో 2024 నావెల్ ఎన్‌సీసీ క్యాడెట్ల ఎంపిక జరిగింది. 23 ఖాళీల భర్తీకి 130 మంది విద్యార్థులకు శారీరక పరీక్షలు నిర్వహించారు. ఈ ఎంపిక ప్రక్రియ 10ఆంధ్రా నావెల్ ఎన్‌సీసీ కమాండెంట్ ఆఫీసర్ గణేష్, స్థానిక ఎన్‌సీసీ అధికారి డాక్టర్ మల్లికార్జున్‌రెడ్డి, అనిల్‌శర్మ, సుధాకర్, సునీల్ పర్యవేక్షణలో జరిగాయి. కళాశాల డైరెక్టర్ డాక్టర్ విజయకుమార్‌రెడ్డి, సాగర్‌ముకుంద పర్యవేక్షించారు.

మా ఊరి రోడ్లు బాగు చేయండి సారూ...

● కలెక్టర్‌కు నెలబల్లి దళితకాలనీ మహిళల మొర


కలెక్టర్‌కు విన్నవిస్తున్న దళిత కాలనీ మహిళ రమణమ్మ

దొరవారిసత్రం, సెప్టెంబరు 4: మా ఊర్లో రోడ్లు వర్షం కురిస్తే రొచ్చు రొచ్చుగా మారితున్నాయి... మీరు చూస్తున్నారుగా ఇళ్ల ముందు ఎలా ఉందో ... రోడ్లు వేయించండి సారు... అంటూ కలెక్టర్ వెంకటేశ్వర్‌కు దొరవారిసత్రం మండలం నెలబల్లి దళితవాడ మహిళలు మొరపెట్టుకొన్నారు. ఆ గ్రామంలో ఓటర్ల జాబిత సవరణలపై పరిశీలనకు వచ్చిన ఆయనకు మహిళల నుంచి సమస్యల మొర వినిపించాయి. ఇద్దరు బిడ్డలకు పెళ్లిళ్లు అయ్యాయి, అయినా ఇల్లు ఇవ్వలేదని ఓ మహిళ, బడిలో బిడ్డలకు వంట చేయడానికి వంట గది లేదు అంటూ మరో మహిళ మొరపెట్టారు. అలాగే చిన్న గాలి తోలినా కరెంట్ తీసేస్తారని ఫిర్యాదు చేశారు. మహిళల సమస్యలను సావధానంగా ఆలకించిన కలెక్టర్ అక్కడే ఉన్న ఎంపీడీవో కార్యాలయ ఏవో రఘురామయ్యకు పరిష్కరించాలని ఆదేశించారు. పాఠశాలలో వంట గదికి ప్రతిపాదనలు పంపాలని ఆదేశించారు. త్వరలో ప్రభుత్వం నివేశ స్థలాలతో పాటు, అర్హత కలిగిన ప్రతి పేదవాడికి ఇల్లు మంజూరు చేస్తుందని చెప్పారు. చిరునవ్వుతో కలెక్టర్ సమాధానం చెప్పడంతో మహిళలు ఆనందం వ్యక్తం చేశారు.

తుపాను హెచ్చరికలపై అప్రమత్తం

ఓజిలి, సెప్టెంబరు 4: తుపాను హెచ్చరికల నేపథ్యంలో ఓజిలి మండల ప్రజలను తహసీల్దారు పద్మావతి అప్రమత్తం చేశారు. మండలంలోని మామిడి కాలువ పరివాహక ప్రాంతాలైన మనవాలి, గ్రద్దగుంట, నెమళ్లపూడి, పున్నేపల్లి, కురుగొండ, మానమాల తదితర గ్రామాల ప్రజలను అవసరమైతే సురక్షిత ప్రాంతాలకు తరలిస్తామని తెలిపారు. ఈక్రమంలో ఆయా గ్రామాలలోని వీఆర్వోలను అప్రమత్తం చేసినట్టు తెలిపారు. ఇప్పటికే వర్షాలు కురుస్తున్న క్రమంలో రానున్న రెండు రోజులు జాగ్రత్తగా ఉండాలన్నారు. డీటీ మధుసూదన రాజు పాల్గొన్నారు.

లారీ దొంగల అరెస్టు: రూ.60 లక్షల సొత్తు స్వాధీనం


మీడియా సమావేశంలో ఎస్పీ తదితరులు

నాయుడుపేట టౌన్, సెప్టెంబరు 4: ముగ్గురు అంతర్రాష్ట్ర దొంగలను అరెస్టు చేసి వారి నుంచి రూ.60 లక్షల విలువైన సొత్తును రికవరీ చేసినట్లు తిరుపతి జిల్లా ఎస్పీ సుబ్బరాయుడు తెలిపారు. నాయుడుపేట డీఎస్పీ కార్యాలయంలో బుధవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆగస్టులో కర్ణాటక రాష్ట్రం నుంచి ఐరన్ సామగ్రితో లారీ తమిళనాడుకు బయలు దేరింది. మార్గమధ్యంలో నాయుడుపేట - శ్రీకాళహస్తి బైపాస్‌రోడ్డు సమీపంలో రాగానే లారీ యజమాని బాలాజీకి సంబంధించిన దుకాణం వద్ద డ్రైవర్ రవి వాహనాన్ని ఆపి నిద్రించేందుకు ఇంటికి వెళ్లాడు. తిరిగి మరుసటిరోజు ఉదయం వచ్చి చూసేసరికి లారీ లేకపోవడంతో చోరికి గురైనట్లుగా గుర్తించిన లారీ యజమాని బాలాజీ నాయుడుపేట పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు డీఎస్పీ చెంచు బాబు ఆధ్వర్యంలో అర్బన్ సీఐ బాబి, సిబ్బంది తో కలసి దర్యాప్తు చేసినట్లు ఎస్పీ తెలిపారు. వెంకటగిరి - పెంచలకోన మార్గమధ్యంలో ఈ కేసుకు సంబంధించి కాకినాడకు చెందిన గంగాధర్‌రావు, హైదరాబాద్‌కు చెందిన సయ్యద్ ఇక్బాల్, మహ్మద్ అబ్దుల్‌ను అరెస్టుచేసి చోరీకి గురైన లారీ అందులో ఉన్న సామగ్రితోపాటు నిందితులు ఉపయోగించిన కారును స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. వీరిపై పలు రాష్ట్రాల్లో వివిధ కేసుల్లో ముద్దాయిలుగా ఉన్నట్లు తెలిపారు. పోలీసులు స్వాధీనం చేసుకున్నవాటిలో రూ.20 లక్షల లారీ, రూ.30 లక్షల ఐరన్, నిందితులు ఉపయోగించిన రూ.10 లక్షల కారు ఉన్నాయి. కేసును ఛేదించిన డీఎస్పీ చెంచు బాబు, అర్బన్ సీఐ బాబి, వాకాడు సీఐ హుస్సేన్‌బాషా, ఎస్ఐ రవిబాబు, సిబ్బందికి ఎస్పీ రివార్డులను అందజేశారు.

బాధ్యతగా పనిచేసినా అవమానించారు

● అందుకే పార్టీ వీడా
● వైసీపీ ఆత్మీయ సమావేశంలో దువ్వూరు


సమావేశంలో మాట్లాడుతున్న దువ్వూరు బాలచంద్రారెడ్డి

దొరవారిసత్రం, సెప్టెంబరు 4: సార్వత్రిక ఎన్నికల్లో వైసీపీ గెలుపు కోసం బాధ్యతగా పనిచేశా... అయితే పని చేయలేదని అవమానించారు.... అందుకే పార్టీ వీడుతున్నా... నాతో కలసి రండి... టీడీపీలో చేరుదాం అంటూ సూళ్లూరుపేట చెంగాళమ్మ ఆలయ మాజీ చైర్మన్ దువ్వూరు బాలచంద్రారెడ్డి పిలుపునిచ్చారు. బుధవారం దొరవారిసత్రం మండలంలోని ఆయన స్వగ్రామమైన ఫైలాంగంలో ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... 'ఎన్నికల ముందు పనబాక కుటుంబీకులకు సూళ్లూరుపేట నియోజకవర్గ టీడీపీ టిక్కెట్ వస్తే ఆ పార్టీలో చేరాలని నిర్ణయించుకున్నా. వారికి టిక్కెట్ రాకపోవడంతో వైసీపీలోనే కొనసాగా. బాధ్యతగా ఎన్నికల్లో పని చేశా. అయితే కొందరు నాయకులు పార్టీకి వె న్నుపోటు పొడిచినట్టు చిత్రీ కరించారు. అవమానకరంగా వ్యవహరించారు. అందుకే పార్టీకి రాజీనామా చేశా. ఈనెలలోనే టీడీపీలో చేరుతున్నా ' అని చెప్పారు. ఈ సమావేశంలో దొరవారిసత్రం మండలంలోని 22 పంచాయతీల నుంచి, సూళ్లూరుపేట, తడ, నాయుడుపేట, పెళ్లకూరు, ఓజిలి మండలాల నుంచీ కొందరు వచ్చారు. ఎంపీపీ దువ్వూరు సుజాతమ్మ, జడ్పీటీసీ సభ్యుడు రమేష్, కళత్తూరు శేఖర్‌రెడ్డి, ఇలుపూరు సుధయ్య, మునస్వామినాయుడు, ఓడూరు రమణారెడ్డి, కొండూరు రవిరెడ్డి, దువ్వూరు గోపాల్‌రెడ్డితోపాటూ దొరవారిసత్రం మండలానికి చెందిన 18 మంది సర్పంచులు, ఏడుగురు ఎంపీటీసీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

వైసీపీని విమర్శించను: దువ్వూరు

తడ, సెప్టెంబరు 4: టీడీపీ నాయకుల కోరిక మేరకు త్వరలోనే టీడీపీలో చేరుతున్నానని సూళ్లూరుపేట చెంగాళమ్మ ఆలయ మాజీ చైర్మన్ దువ్వూరు బాలచంద్రారెడ్డి ఆంధ్రజ్యోతితో అన్నారు. వైసీపీతో తన అనుబంధం ముగిసినట్లే అని తెలిపారు. ఆ పార్టీపై తాను విమర్శలు చేయదలుచు కోలేదన్నారు. టీడీపీలో చేరిన తరువాత ఆ పార్టీ అధిష్ఠానం ఏ బాధ్యతలు అప్పగించినా చిత్తశుద్ధితో పనిచేస్తానని ఆయన తెలిపారు.

మాజీ అనుచరులతో వాకాటి సమాలోచనలు

తడ, సెప్టెంబరు 4: సూళ్లూరుపేట వైసీపీకి వరుస దెబ్బలు ఊపిరి ఆడకుండా చేసేలా ఉన్నాయి. ఓ పక్క చెంగాళమ్మ ట్రస్టుబోర్డు మాజీ చైర్మన్ దువ్వూరు బాలచంద్రారెడ్డి 250 మందిని టీడీపీలోకి తీసుకువెళ్తున్నారు. ఇదే వైసీపీకి పెద్ద దెబ్బ అనుకుంటుండగానే మరోదెబ్బ ఆ పార్టీకి తగిలేలా ఉంది. బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్సీ వాకాటి నారాయణరెడ్డి బుధవారం సూళ్లూరుపేటకు రావడం చర్చనీయాంశమైంది. ఆయన అనుచరులంతా వైసీపీలోనే కొనసాగుతున్నారు. వారిని అటు టీడీపీలో కానీ, ఇటు బీజేపీలోకి తీసుకువచ్చేలా ఆయన మంతనాలు సాగిస్తున్నట్లుగా సమాచారం. ఈ మేరకు ఇప్పటికే కొంతమంది ఆయన మాటకు జైకొట్టినట్టు తెలిసింది.

నటనలో తండ్రిని మించిన తనయుడు

ఎమ్మెల్యే విజయశ్రీ


విద్యార్థులకు నోటు పుస్తకాలు అందజేస్తున్న ఎమ్మెల్యే

సూళ్లూరుపేట, సెప్టెంబరు 4: నటనలో తండ్రిని మించిన తనయుడిగా పేరుతెచ్చుకున్న నటుడు బాలకృష్ణ అని ఎమ్మెల్యే విజయశ్రీ అన్నారు. బాలకృష్ణ సినీరంగ ప్రవేశం చేసి 50 ఏళ్లు పూర్తయిన సందర్భంగా బుధవారం బాలకృష్ణ అభిమాన సంఘ నాయకులు వి.రమేష్, జయకాంత్ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో కేక్ కట్ చేశారు. టి.సుధాకర్ రెడ్డి, మాధవనాయుడు, ఏ.రమేష్, చిట్టేటి పెరుమాళ్, ఏ.శ్రీనివాసులు, బి.ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

నిధుల మంజూరుకు కృషి

చిల్లకూరు, సెప్టెంబరు 4: వరదల సమయంలో తీరప్రాంత గ్రామాలు ముంపునకు గురికాకుండా చర్యలు తీసుకునేందుకు కేంద్రప్రభుత్వం నుంచి నిధులు మంజూరు చేయించేందుకు కృషి చేస్తానని మాజీ ఎమ్మెల్యే వరప్రసాద్‌రావు అన్నారు. బుధవారం మండలంలోని మోమిడి, వరగలి తదితర ప్రాంతాల్లో కూటమిపార్టీ నాయకులతో కలిసి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... వరదల సమయంలో కండలేరు క్రీకు నుంచి వచ్చే నీటి ధాటికి లింగవరం, మోమిడి, తమ్మినపట్నం, గుమ్మళ్లదిబ్బ తదితర తీరప్రాంత గ్రామాలు ముంపునకు గురవుతుంటాయన్నారు. త్వరలో క్రిస్ సిటీ శంకుస్థాపనకు రానున్న ప్రధానమంత్రి నరేంద్రమోదీ దృష్టికి తీసుకెళ్తానన్నారు.

ఉపాధ్యాయులకు క్రీడా పోటీలు

కోట, సెప్టెంబరు 4: పట్టణంలోని మహాత్మాజ్యోతిబా పూలే బీసీ బాలుర గురుకులంలో బుధవారం మండల ఉపాధ్యాయులకు క్రీడా పోటీలు జరిగాయి. ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకొని ఉపాధ్యాయులకు ఎంఈవో మస్తానయ్య ఆధ్వర్యంలో పలు పోటీలు నిర్వహించారు. ప్రధానంగా కబడ్డీ, షాట్‌పుట్, లాంగ్‌జంప్, వాలీబాల్, త్రోబాల్, మ్యూజికల్ చైర్స్ జరిగాయి. విజేతలకు గురువారం మండల విద్యావనరుల కేంద్రంలో బహుమతులు అందిస్తారు.

కోటవాసికి బంగారు పతకం

కోట, సెప్టెంబరు 4 : పట్టణానికి చెందిన షాజిద్‌బాషాకు పవర్ లిఫ్టింగ్ పోటీలో బంగారు పతకం లభించింది. షాజిద్‌బాషా నేపాల్ దేశం పోఖరాలో గత నెల 31వ తేదీ నుంచి ఈనెల 4వ తేదీ వరకు పవర్‌లిఫ్టింగ్ పోటీల్లో ప్రాతినిధ్యం వహించాడు. ప్రతిభా పాటవాలు కనబరచి బంగారు పతకం, 3 వెండి పతకాలను సాధించాడు.

చెన్నై వైద్యశాలకు వెళ్లి పింఛను అందజేత

సూళ్లూరుపేట, సెప్టెంబరు 4: మున్సిపాలిటీ పరిధిలోని మన్నారుపోలూరు న్యూకాలనీకి చెందిన జి.ఆనందయ్య గత నెల 24న రోడ్డు ప్రమాదంలో గాయపడ్డాడు. ఈ నేపథ్యంలో చెన్నై జీహెచ్‌లో మోకాలి శస్త్రచికిత్స చేసుకొని అక్కడే ఉంటున్నాడు. ఈ విషయాన్ని తెలుసుకొన్న మన్నారుపోలూరు సచివాలయ కార్యదర్శి పి.కృష్ణయ్య బుధవారం చెన్నై జీహెచ్‌కి వెళ్లి ఆనందయ్యకు పింఛను అందజేశారు.

సీఐలను కలిసిన టీడీపీ నాయకులు

గూడూరు అర్బన్, సెప్టెంబరు 4: స్థానిక 1వ పట్టణ పోలీస్‌స్టేషన్‌లో సీఐల కార్యాలయంలో ఇటీవల బాధ్యతలు చేపట్టిన పట్టణ సీఐ శేఖర్ బాబు, రూరల్ సీఐ కిషోర్‌బాబును బుధవారం టీడీపీ నాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు. పట్టణ, మండల ప్రాంతాల్లో శాంతి భద్రతల పరిరక్షణకు చర్యలు చేపట్టాలని కోరారు. మస్తాన్ నాయుడు, చెంచురామయ్య, ఇశ్రాయిల్ కుమార్, చంద్రమౌళి, కోటేశ్వరరావు, అబ్దుల్‌రహీం తదితరులు పాల్గొన్నారు.

ఆర్థిక సాయం

గూడూరు, సెప్టెంబరు 4: స్థానిక అశోక్‌నగర్‌లో ఓ యువకుడికి వైద్యఖర్చుల నిమిత్తం రాజనేని రామానాయుడు చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో బుధవారం ఆర్థికసాయం అందజేశారు. ఈ సందర్భంగా ట్రస్ట్ సభ్యుడు అమరయ్య మాట్లాడుతూ... మూత్రపిండాల వ్యాధితో బాధపడుతున్న రాజాకు వైద్యఖర్చుల నిమిత్తం తమ ట్రస్ట్ రూ.10వేలు అందజేసిందన్నారు. బాబు, భాస్కర్, పద్మమ్మ పాల్గొన్నారు.

సభ్యత్వ నమోదును విజయవంతం చేయాలి

గూడూరు, సెప్టెంబరు 4: పట్టణంలో బీజేపీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని మాజీ ఎంపీ వరప్రసాద్‌రావు పిలుపునిచ్చారు.సనత్‌నగర్‌లో బీజేపీ సభ్యత్వ నమోదుపై నాయకులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశాన్ని అభివృద్ధిపథంలో నడిపించేందుకు బీజేపీ ఎంతో కృషి చేస్తోందన్నారు. నరసప్ప, దయాకర్, సుమన్ తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేపై అనుచిత వ్యాఖ్యలు మానుకోండి


సమావేశంలో మాట్లాడుతున్న చంద్రశేఖర్

గూడూరు, సెప్టెంబరు 4: ఎమ్మెల్యే పాశం సునీల్ కుమార్‌పై ఎమ్మెల్సీ మేరిగ మురళీధర్ అనుచిత వ్యాఖ్యలు మానుకోవాలని జనసేన ఉమ్మడి నెల్లూరు జిల్లా ఉపాధ్యక్షుడు టి.చంద్రశేఖర్ అన్నారు. బుధవారం పట్టణంలోని పార్టీ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ... నిత్యం ప్రజలకు అందుబాటులో ఉంటూ నియోజకవర్గ అభివృద్ధికి పాటు పడుతున్న ఎమ్మెల్యేపై ఎమ్మెల్సీ విమర్శలు చేయడం మానుకోవాలన్నారు. ఎమ్మెల్సీగా గూడూరు అభివృద్ధికి ఆయన ఏం చేశారో ప్రజలకు తెలుసు కాబట్టే సునీల్ కుమార్‌ను ప్రజలు గెలిపించారన్నారు. మోహన్, సాయికిరణ్, సనత్, మనోజ్‌కుమార్, వంశీ తదితరులు పాల్గొన్నారు.

కంటి వైద్యశిబిరం


నారాయణ ఇంజనీరింగ్ కళాశాలలో జరిగిన శిబిరం

గూడూరు అర్బన్, సెప్టెంబరు 4: పట్టణంలోని నారాయణ ఇంజనీరింగ్ కళాశాలలో బుధవారం ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో నెల్లూరుకు చెందిన స్మార్ట్‌విజన్ ఆసుపత్రి సహకారంతో కంటి వైద్యశిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ సందీప్ మాట్లాడుతూ... శరీరంలోని ఇతర భాగాల మాదిరిగానే కళ్లకు కూడా సమస్యలు వస్తుంటాయన్నారు. సమీప దృష్టి, దూరదృష్టి వంటి సమస్యలను ప్రారంభంలోనే గుర్తించేందుకు వైద్యపరీక్షలు దోహదపడుతాయన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ రవిప్రసాద్, విష్వక్సేనారెడ్డి, కోటేశ్వరరావు, కొండారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

జోరుగా చవితి పందిళ్ల ఏర్పాట్లు

నాయుడుపేట, సెప్టెంబరు 4: చవితి వేడుకలను అంగరంగ వైభవంగా నిర్వహించేందుకు వాడవాడలా ఏర్పాట్లు చురుకుగా సాగుతున్నాయి. దర్గావీధిలో సినిమా సెట్టింగ్ తరహాలో రూ.15 లక్షలతో 22 అడుగుల వినాయక ప్రతిమను తయారుచేస్తున్నారు. 8 రోజులుగా ఒడిశాకు చెందిన కార్మికులు వినాయక చవితి వేదికను నిర్మిస్తున్నారు. శెట్టిపల్లివారివీధి, పడమటివీధి, రామకృష్ణాపురం, బస్టాండ్, రాజగోపాలపురం, పిచ్చిరెడ్డితోపు, బ్రాహ్మణవీధి తదితర ప్రాంతాలలో భారీ వినాయక ప్రతిమలను ఏర్పాటు చేయనున్నారు.

విజయవాడ సహాయక చర్యల్లో కురుగొండ్ల


భోజనాన్ని పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే కురుగొండ్ల

వెంకటగిరి, సెప్టెంబరు 4 : విజయవాడలోని వరద ప్రభావిత ప్రాంతాల్లో ప్రభుత్వం సహాయక చర్యలు ముమ్మరం చేసిందని వెంకటగిరి ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ అన్నారు. బుధవారం ఆయన వెంకటగిరి నుంచి తన అనుచరులతో విజయవాడ చేరుకున్నారు. సింగ్ రోడ్‌లో వరద బాధితులకు ఆహార పట్లాలు, తాగునీటి బాటిళ్లు అందించారు. ఈ సందర్భంగా ఆయన ఆంధ్రజ్యోతితో మాట్లాడుతూ... గత నాలుగు రోజులుగా సీఎం చంద్రబాబు విజయవాడలోనే ఉంటూ వరద బాధితులను అన్ని విధాలా ఆదుకుంటున్నారని చెప్పారు. కొద్దిరోజుల్లో విజయవాడలో సాధారణ పరిస్థితి తీసుకు వచ్చేందుకు శాయశక్తులా కృషి చేస్తున్నారన్నారు. సీఎం ఆదేశాల మేరకు వెంకటగిరి నుంచి పెద్ద ఎత్తున టీడీపీ కార్యకర్తలు, నాయకులు తరలివచ్చి సహాయక చర్యల్లో పాల్గొంటూ బాధితులకు అండగా నిలుస్తున్నారని చెప్పారు. బి.రాజేశ్వరరావు, ఎం.ఆనంద్, ఎ.సత్యనారాయణ, ఆర్.సత్యం, పి.పెంచల నరసయ్య నాయుడు, ఆర్.రాజా, టీవీఆర్ తదితరులు సహాయక చర్యల్లో పాల్గొన్నారు.

వరద బాధితులను ఆదుకుందాం


ఎమ్మెల్యేకు చెక్కులు అందిస్తున్న దాతలు

గూడూరు, సెప్టెంబరు 4: విజయవాడలో వరదబాధితులను ఆదుకునేందుకు దాతలు స్వచ్ఛందంగా ముందుకు రావాలని ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్ పిలుపునిచ్చారు. బుధవారం స్థానిక ఆడిటర్ శ్రీకంటి రామ్మోహన్‌రావు రూ.50 వేలు, ఆర్టీసీ బస్టాండు సమీపంలోని షర్డీ సాయిబాబామందిరం ఆధ్వర్యంలో రూ.లక్ష, రోటరీ వెస్ట్ క్లబ్ రూ.50వేల చెక్కులను సీఎం సహాయనిధికి ఎమ్మెల్యేకు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ... వరదల కారణంగా విజయవాడ, చుట్టుపక్కల ప్రాంతాల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. సీఎం చంద్రబాబు అక్కడే ఉంటూ బాధితులను సురక్షిత ప్రాంతాలకు తరలిస్తూ వారికి కావాల్సిన సౌకర్యాలను ఏర్పాటు చేసేలా నిరంతరం పని చేస్తున్నారన్నారు. ఈ వయసులో కూడా మోకాళ్ల నీటిలో పర్యటిస్తూ బాధితులకు భరోసా కల్పిస్తున్నారన్నారు. ఆయన్ను స్ఫూర్తిగా తీసుకుని సీఎం సహాయనిధికి తన నెల జీతం రూ.1.50లక్షలు అందిస్తున్నానన్నారు.చెంచురామయ్య, సనత్‌కుమార్‌రెడ్డి, ధనుంజయరెడ్డి, కృష్ణయ్య, ఉమాశంకర్ తదితరులు పాల్గొన్నారు.

ఇసుక అందుబాటులోకి తెస్తా

గూడూరు, సెప్టెంబరు 4: ఉచిత ఇసుకను ప్రజలకు అందుబాటులోకి తెచ్చేలా చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్ చెప్పారు. బుధవారం ఎమ్మెల్యే నివాసంలో భవననిర్మాణ కార్మిక సంఘం నాయకులు ఉచిత ఇసుకను అందుబాటులోకి తేవాలని ఎమ్మెల్యేకు విన్నవించారు. ఈ సందర్భంగా నిర్మాణ సంఘం నాయకులు మాట్లాడుతూ గూడూరుకు సమీపంలో ఇసుక పాయింట్లు లేకపోవడంతో కొనుగోలు చేయాలంటే దూరప్రాంతాల నుంచి అధిక ధరలు వెచ్చించాల్సి వస్తుందని దీంతో పనులు సక్రమంగా లేక నిర్మాణరంగ కార్మికులు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ త్వరలోనే ఇసుక పాయింట్ ఏర్పాటుకు చర్యలు తీసుకుని తక్కువ ధరకు ఇసుకను అందించేందుకు తన వంతు కృషిచేస్తానన్నారు. కార్యక్రమంలో శివకుమార్, రఫీ, శంకరయ్య, శేఖరాచారి, బీవీరమణయ్య, సురేష్, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ప్రతిమల ఏర్పాటుకు అనుమతులు తప్పనిసరి

కోట, సెప్టెంబరు 4: చవితి మండపాలు, ప్రతిమల ఏర్పాటుకు అనుమతి తప్పని సరి అని గూడూరు డీఎస్పీ వివి రమణకుమార్ చెప్పారు. కోట పోలీస్ స్టేషన్‌ను తనిఖీ చేసిన అనంతరం ఆయన మాట్లాడుతూ... గణేశ నిమజ్జనాలను వాకాడు మండలం దుగరాజపట్నం, తూపిలిపాళెం, కోట మండలం శ్రీనివాససత్రం సముద్రతీరాల్లో మాత్రమే నిమజ్జనాలకు అనుమతించామన్నారు. ఆయన వెంట కోట, వాకాడు ఎస్ఐలు పవన్‌కుమార్, నాగబాబు, తదితరులు ఉన్నారు.

వెంకటగిరి టౌన్: వినాయకచవిత ప్రతిమలు ఏర్పాటు చేసుకునే నిర్వాహకులు తప్పనిసరిగా పోలీసుల అనుమతులు తీసుకోవాలని వెంకటగిరి సీఐ రమణ తెలిపారు. బుధవారం స్థానిక కింజలవీరయ్య కల్యాణమండపంలో ఆయన మాట్లాడుతూ... భారీ వినాయక ప్రతిమలు ఏర్పాటు చేసే నిర్వాహకులు నిబంధనలు తప్పకుండా పాటించాలన్నారు. ప్రతిమల వద్ద అవాంఛనీయ సంఘటనలు జరిగితే నిర్వాహకులపై కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.

అనుమానాస్పద స్థితిలో గుర్తు తెలియని మహిళ మృతి

దొరవారిసత్రం, సెప్టెంబరు 20 : పట్టణంలోని జాతీయ రహదారి పక్కన ఓటుగుంట చెరువు కట్ట సమీపంలో చెట్లమాటున గుర్తు తెలియని మహిళ మృతదేహం పడి ఉన్నట్టు స్థానికులు గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. నాయుడుపేట డీఎస్పీ చెంచుబాబు, నాయుడుపేట రూరల్ సీఐ సంగమేశ్వరరావు, ఎస్ఐ అజయ్‌కుమార్ సిబ్బందితో సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించారు. మహిళ వయసు సుమారు 35 నుంచి 40 యేళ్లు ఉంటాయని చెప్పారు. మృతదేహాన్ని నాయుడుపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

ఎంపీడీవో వెంకటేశ్వరరావుకు సాదర వీడ్కోలు

వాకాడు, సెప్టెంబరు 4: మండలంలో సంవత్సరంపైగా ఎంపీడీవోగా విధులు నిర్వహించి వాలంటరీ రిటైర్డ్‌మెంట్ తీసుకున్న ఎంపీడీవో ఐ.వెంకటేశ్వరరావును ఏఎన్ఆర్ కల్యాణ మండపంలో జరిగిన కార్యక్రమంలో సన్మానించి వీడ్కోలు పలికారు. తహసీల్దారు రామయ్య, మాజీ ఎంపీడీవో టి.గోపీనాథ్, కె. భక్తవత్సల్‌రెడ్డి, డి.మధుసూదన్‌రెడ్డి, ఎస్.విజయశేఖర్‌రెడ్డి, కుంచం దయాకర్, డీటీ సందీప్, తదితరులు పాల్గొన్నారు.

చెట్ల సంరక్షణతోనే మానవాళి మనుగడ



దక్కిలి, సెప్టెంబరు 4 చెట్ల సంరక్షణతోనే మానవాళి మనుగడ ఆధారపడి ఉంటుందని ఎంపీడీవో ప్రసన్న కుమారి అన్నారు. బుధవారం బాలయోగి బా లికల గురుకుల కళాశాలలో వనమహోత్సవంలో మొక్కలు నాటారు. ఈ సం దర్భంగా ఆమె మాట్లాడుతూ... అడవులు అంతరించిపోవడం, చెట్ల నరికివేత వల్లే ప్రకృతి విపత్తులు సంభవిస్తున్నాయని చెప్పారు. ప్రతి ఒక్కరు మొక్కలు నాటి సంరక్షించాలని కోరారు. గురకుల కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ నాగమణి, వైద్యాధికారి శ్రీహరిరావు, బింధు ప్రియాంక, ఎంఈవోలు పి.జగదీష్ బాబు, వెంకటేశ్వర్లు, గురుకుల కళాశాల విద్యాకమిటీ చైర్మన్ ఎస్.రత్నయ్య తదితరులు పున్నారు.